సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+40 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 6.00 | సంపుటి: 12 సంచిక: 113

ఆదివారం 14-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

SUNDAY Special



నగ్న సత్యాలు..

నటి అమలాపాల్‌తో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

- ఫ్యామిలీలో



హై హై... హాలెప్

సెరెనాను చిత్తు చేసి తొలిసారి వింబుల్డన్ ట్రోఫీ నెగ్గిన హాలెప్

- స్పోర్ట్స్‌లో







## ఇంగ్లండ్ X న్యూజిలాండ్

మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

- లార్డ్స్ మైదానంలో నేడు ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్
- ఫైనల్‌కు రిజర్వ్ డే. వర్షం వల్ల మ్యాచ్ రద్దయితే సంయుక్త విజేతలుగా ప్రకటన

-స్పోర్ట్స్‌లో

# చందమామపైకి చలో చలో

## 'చంద్రయాన్-2'కు సర్వం సిద్ధం

- నేటి ఉదయం 6.51 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం
- రేపు వేకువజామున 2.51 గంటలకు ప్రయోగం
- ఎంఆర్ఆర్ సమావేశంలో అధికారికంగా ప్రకటన
- సెప్టెంబర్ 6 నుంచి రోవర్ పరిశోధన ప్రారంభం
- ప్రయోగాన్ని వీక్షించనున్న రాష్ట్రపతి రామ్‌నాథ్

టిక్:టిక్:టిక్ 2లో

**సూళ్లూరుపేట (శ్రీహరికోట)/తిరుమల:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టనున్న ప్రతిష్టాత్మక చంద్రయాన్-2 ప్రయోగానికి కౌంట్‌డౌన్ మొదలైంది. నెల్లూరు జిల్లా సతీష్ థావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి సోమవారం వేకువజామున 2.51 గంటలకు జీఎస్ఎల్వీ మార్క్3-ఎం1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. షార్‌లోని బ్రహ్మ ప్రకాశ్ హాలులో ఎంఆర్ఆర్ కమిటీ చైర్మన్ బీఎన్ సురేష్ ఆధ్యర్యంలో, ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ పర్యవేక్షణలో శనివారం మిషన్ సంసిద్ధత సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 7 నుంచి శనివారం దాకా ప్రయోగ వేదిక మీదున్న రాకెట్‌కు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాక ప్రయోగ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. రాకెట్ సిద్ధంగా ఉందని, పరీక్షలన్నీ పూర్తి చేశామని చెప్పి ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) చైర్మన్ ఆర్ముగ రాజరాజన్‌కు అప్పగించారు. ఆయన ఆధ్వర్యంలో కూడా బోర్డు శనివారం రాత్రి మరోసారి సమావేశమైంది. ఈ సందర్భంగా రాకెట్‌కు కె. శివన్ ఆధ్వర్యంలో

మిగతా 2వ పేజీలో ▶



చంద్రయాన్-2 ప్రయోగంలో ల్యాండర్‌ను చంద్రునిపైనకు మోసుకెళ్లే ఆర్బిటర్

## ఎస్సై తుది ఫలితాలు విడుదల

**సాక్షి, హైదరాబాద్:** వేలాదిమంది అభ్యర్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న ఎస్సై ఫలితాలు విడుదలయ్యాయి. సివిల్, ఏఆర్, టీఎస్ఎస్పీ ఫైర్, ఐటీ, ఫింగర్‌ప్రింట్ బ్యూరోలో ఎస్సై నియామకాల తుది ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక బోర్డు (టీఎస్ఎల్పీఆర్బీ) శనివారం వెల్లడించింది. ఫలితాలను బోర్డు అధికారిక వెబ్‌సైట్ https://www.tslprb.inలో అందుబాటులో ఉంచింది. వివిధ విభాగాల్లో మొత్తం 1272 పోస్టుల కోసం నిర్వహించిన ఈ పరీక్షలో కటాఫ్ మార్కులు నిర్ణయించిన అనంతరం ఫలితాలను బోర్డు ప్రకటించింది. తుది జాబితాపై

మిగతా 2వ పేజీలో ▶

సాక్షి సెలబ్రేషన్ ఆఫర్

3 కూపన్

# ఇక రెవెన్యూ పనే!

## 'పుర'చట్టం ఆమోదం పొందగానే రెవెన్యూ సంస్కరణలపైనే సీఎం కేసీఆర్ దృష్టి

- తాజా అవినీతి మకిలితో గరంగరం... మరీ ఇంత ఘోరమా అని వ్యాఖ్యలు
- ప్రక్షాళన ప్రక్రియలో వేగం పెంచాలని ఉన్నతాధికారులకు అంతర్గత ఆదేశాలు
- కొత్త రెవెన్యూ చట్టమే కాకుండా ఉద్యోగుల విలీనంపైనా ఆలోచన
- వెలుగులోకి వస్తున్న అవినీతి వీడియోలతో 'రెవెన్యూ' ఉక్కిరిబిక్కిరి



**సాక్షి, హైదరాబాద్:** పైసలు ఇవ్వందే ఫైలు కదలని పరిస్థితి. ఆమ్యామ్యాలు అందనిదే రికార్డులు ఆన్‌లైన్‌లోకి ఎక్కని దుస్థితి. వేళ్లూనుకున్న అవినీతి వటవృక్షాల 'భూ'ప్రకంపనలు రెవెన్యూ వ్యవస్థ ప్రతిష్టకే మచ్చ తెచ్చేలా మారాయి. కొందరు అధికారుల నిర్వాకం ఆ శాఖకే ఎసరు పెట్టేలా కనిపిస్తోంది. వ్యవస్థీకృతమైన చేతివాటంతో ఇటీవల ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న అవినీతి వీడియోలు ప్రభుత్వ పరువునే భ్రష్టు పట్టిస్తున్నాయి. ఇప్పటికే సీఎం కేసీఆర్ రెవెన్యూ శాఖను సమూల ప్రక్షాళన చేసేందుకు అడుగులు వేస్తున్న తరుణంలో తాజా పరిణామాలు ఆ ప్రక్రియను వేగవంతం చేయడానికి దారితీస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతు శరత్‌తో ఫోన్‌లో సంభాషించిన కేసీఆర్.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రెవెన్యూ వ్యవస్థను సంస్కరిస్తామని స్పష్టం చేశారు. అనుకున్నట్లుగా

మిగతా 2వ పేజీలో ▶



# కాటేసిన ఖరీఫ్

- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- 3 దశల కంటింజెన్సీ ప్రణాళిక ప్రకటించిన వ్యవసాయ శాఖ
- ఏ జిల్లాల్లో ఏ పంటలు సాగు చేయాలో క్యాలెండర్ విడుదల
- ఆగస్టు 15వరకల్లా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక ఖరారు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఖరీఫ్ సాగు చతికిలపడింది. సీజన్ మొదలై నెలన్నర కావొస్తున్నా ఇప్పటికీ పంటల సాగు విస్తీర్ణం పెరగలేదు. వర్షాల్లేక వేసిన విత్తనాలు వేసినట్లే భూమిలో మాడిపోతున్నాయి. ఖరీఫ్‌లో కీలక సమయంలో వేయాల్సిన వివిధ పంటల సీజన్ మారిపోయింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఖరీఫ్ విత్తనాలు వేసే సీజన్ ముగిసిపోతుండటంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని వ్యవసాయ శాఖ రైతులకు

మిగతా 2వ పేజీలో ▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్ల రిటైల్ ధర ₹ 52 డజన్ | ఫారం వద్ద లైవ్ బర్డ్ | 80 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 148 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 102 కిలో | స్కిన్‌లెస్ | 168 కిలో |

Conditions Apply

## ఫేస్‌బుక్‌కు రూ.34 వేల కోట్ల జరిమానా!

### సిద్ధమవుతున్న ఫెడరల్ ట్రేడ్ కమిషన్

వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని లీక్ చేసిందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫేస్‌బుక్‌కు అమెరికా నియంత్రణ సంస్థలు భారీ జరిమానా విధించనున్నాయి. సోషల్ నెట్‌వర్క్‌ల గోప్యత, సమాచార రక్షణలో లోపాలు వంటి కారణాలకుగానూ ఫేస్‌బుక్‌పై జరిమానా విధించేందుకు ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) సిద్ధమవుతోంది. దర్యాప్తు సెటిల్‌మెంట్‌లో భాగంగా ఎఫ్‌టీసీ ఫేస్‌బుక్‌పై రూ.34,280 కోట్ల (5 బిలియన్ డాలర్లు) జరిమానా విధించనుంది.

- వివరాలు 5లో




## రేపే 'విశ్వాసం' పెట్టండి

- సీఎం కుమారస్వామిని డిమాండ్ చేసిన కర్ణాటక బీజేపీ చీఫ్ యడ్యూరప్ప
- ప్రభుత్వ మనుగడ కోసం కాంగ్రెస్ నేతల ముమ్మరయత్నాలు
- రెబెల్ ఎమ్మెల్యే నాగరాజ్‌తో కాంగ్రెస్ ముఖ్యనేతల భేటీ
- స్పీకర్ రమేశ్‌కు స్వతంత్ర ఎమ్మెల్యేల లేఖ

- వివరాలు 5లో

## గోవా మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ

- జీఎఫ్‌పీకి చెందిన ముగ్గురికి ఉద్వాసన
- బీజేపీ మోసం చేసిందన్న జీఎఫ్‌పీ

- వివరాలు 5లో

## సోమాలియాలో ఉగ్రదాడి.. 26 మంది మృతి

- దక్షిణ సోమాలియాలోని సరిహద్దు పట్టణం కిస్మాయోలో జరిగిన ఉగ్ర దాడిలో 26 మంది చనిపోగా 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక మెదినా హోటల్‌లోకి సైనిక దుస్తులు ధరించిన కొందరు ఉగ్రవాదులు కాల్పులు జరుపుతూ ప్రవేశించారు. భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మృతిచెందారు.

- వివరాలు 5లో



జాబిల్లిపైకి ఓ ల్యాండర్‌ను ప్రయోగించిన నాలుగో దేశంగా భారత్ రికార్డు సృష్టించేందుకు ఇక కేవలం కొన్ని గంటలే మిగిలి ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున 2:51 గంటలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తన బాహుబలి రాకెట్ జీఎస్‌ఎల్వీ మార్క్–3 ద్వారా చంద్రయాన్–2 ప్రయోగాన్ని చేపట్టనుంది. ఒక్క దెబ్బకు మూడు పిట్టలన్న చందంగా ఈ ప్రయోగం ద్వారా ఇస్రో బహుళ ప్రయోజనాలను సాధించనుంది. ఈ ప్రయోగం భారత కీర్తి కిరీటంలో మరో కలికితురాయి అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

## అత్యంత సంక్లిష్టమైన ప్రయోగం...

ఇస్రో ఇప్పటివరకూ చేపట్టిన ప్రయోగాలన్నింటికంటే చంద్రయాన్–2 చాలా సంక్లిష్టమైంది. జాబిల్లి చుట్టూ తిరిగే ఆర్బిటర్.. ఉపగ్రహంపై దిగే ల్యాండర్లు రెండింటినీ జీఎస్‌ఎల్వీ మార్క్–3 రాకెట్ ద్వారా పంపనున్నారు. ల్యాండర్ జాబిల్లిపైకి సురక్షితంగా దిగాక అందులోంచి రోవర్ బయటకు వచ్చి ఉపరితలంపై దాదాపు అర కిలోమీటర్ దూరం ప్రయాణిస్తుంది. అత్యంత శీతల (–157 డిగ్రీ సెల్సియస్) పరిస్థితుల్లో ఈ యంత్రాన్ని పనిచేయించడం ఒక సవాలే. జీఎస్‌ఎల్వీ రాకెట్ ఆర్బిటర్‌ను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెడితే 50 రోజుల ప్రయాణం తరువాత అది జాబిల్లిపైకి చేరుతుంది. జాబిల్లికి సుమారు 150 కి.మీ. దూరంలో ఉన్న దశలో ఆర్బిటర్ నుంచి ల్యాండర్ వేరుపడుతుంది. నాలుగు రోజులపాటు చక్కర్లు కొడుతూ నెమ్మదిగా వంద కిలోమీటర్ల ఎత్తుకు చేరుతుంది. దశలవారీగా వేగాన్ని 30 కిలోమీటర్లకు తగ్గించుకొని దక్షిణ ధ్రువ ప్రాంతంలో దిగుతుంది. చందమామ ఉపరితలంపైకి ల్యాండర్ దిగిన నాలుగు గంటల తరువాత అందులోంచి రోవర్ బయటపడుతుంది. సెకనుకు ఒక సెంటీమీటర్ వేగంతో ల్యాండర్ నుంచి వేరుపడి ఆ తరువాత 14 రోజుల్లో సుమారు 500 మీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ల్యాండర్‌పై మన జాతీయ పతాకం ముద్రితమై ఉంటుంది. రోవర్‌కు ఉన్న ఆరు చక్రాలపై అశోకచక్రను ముద్రించారు. చంద్రయాన్–2 మొత్తం ఖర్చు రూ. 978 కోట్లుకాగా అందులో రూ. 603 కోట్లు ల్యాండర్, ఆర్బిటర్ల నిర్మాణానికి, నేవిగేషన్, భూమ్మీది నెట్‌వర్క్ ఏర్పాటుకు ఖర్చు పెట్టారు. మిగిలిన రూ. 375 కోట్లను జీఎస్‌ఎల్వీ మార్క్–3 నిర్మాణం, క్రయోజెనిక్ ఇంజిన్, ఇంధనాల కోసం ఉపయోగించారు.



# టిక్: టిక్: టిక్

## మరికొన్ని గంటల్లో 'మామ'పై మహాన్వేషణ

### ప్రయోగం సంక్లిష్టం.. ప్రయోజనాలు బహుళం

**వినువీధిలో భారత పతాక మరోసారి రెపరెపలాడేందుకు రంగం సిద్ధమైంది. జాబిల్లిపై నీటి జాడలను నిర్ధారించిన చంద్రయాన్–1కు కొనసాగింపుగా మరోసారి చందమామపై కాలుమోపేందుకు చంద్రయాన్–2 సిద్ధమైంది. మునుపెన్నడూ.. ఎవ్వరూ చేయని రీతిలో జాబిల్లి దక్షిణ ధ్రువ ప్రాంతంలో... ఓ ల్యాండర్‌ను దింపడం.. రోవర్‌ను నడపడం, జాబిల్లి చుట్టూ ఉపగ్రహాన్ని తిప్పడమన్న లక్ష్యాలతో నింగికి ఎగరనున్న చంద్రయాన్-2 అవసరమేమిటి? ప్రయోగాలు ఏం తేల్చనున్నాయి?**

## ఇస్రో శాస్త్రవేత్తలకు కలాం ఇచ్చిన సలహా...



మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం ఇస్రో శాస్త్రవేత్తలకు ఇచ్చిన సలహా ఈనాటి చంద్రయాన్–2గా పరిణమించిందంటే ఆశ్చర్యం ఏమీ కాదు. ఎందుకంటే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ స్వావలంబన సాధించాలని, అందుకుతగ్గ సామర్థ్యం మనకు ఉందని బలంగా నమ్మి, ప్రోత్సహించిన వ్యక్తుల్లో కలామ్ ఒకరన్నది తెలిసిందే. 2003లో జాబిల్లిపై ప్రయోగాలు చేసేందుకు ఇస్రో ఆలోచిస్తోందన్న వార్తలు వస్తున్న తరుణంలో తనను కలిసిన ఇస్రో శాస్త్రవేత్తలతో కలాం మాట్లాడుతూ చంద్రయాన్ ప్రాజెక్టు ద్వారా జాబిల్లిని చేరితే ఆ విజయం దేశ యువత, పిల్లల్లోనూ స్ఫూర్తి నింపుతుందని సూచించారు. అంతేకాకుండా 2009లోనూ జాబిల్లిపైనే ఎందుకు ప్రయోగాలు చేయాలో చెబుతూ భవిష్యత్తులో భూమికి, అంగారకుడికి మధ్య వారధిగా జాబిల్లి ఉపయోగపడుతుందని చెప్పారు. చంద్రయాన్–1 100 కి.మీ. దూరంలో జాబిల్లి చుట్టూ తిరుగుతూ సమాచారం సేకరిస్తుందని ఇస్రో శాస్త్రవేత్తలు కలాంకు వివరించినప్పుడు అంత దూరం వెళ్లిన అంతరిక్ష నౌకను జాబిల్లిపైకి దింపవచ్చు కదా అని సూచించారట. ఈ సూచన ఫలితంగానే చంద్రయాన్–1లో మూన్ ఇంపాక్ట్ ప్రోబ్ (ఎంఐపీ) రూపకల్పన జరిగిందని, జాబిల్లిపై దిగిన ఈ పరికరం అక్కడ నీరు ఉన్న విషయాన్ని నిర్ధారించిందని చంద్రయాన్–1 ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. అన్నాదురై తెలిపారు. భవిష్యత్తులో జాబిల్లి అంతరిక్ష పారిశ్రామిక కేంద్రంగా మారే అవకాశముందని 2009లోనే కలాం అంచనా కట్టారు. కేంద్రక సంలీన చర్య ద్వారా విద్యుదుత్పత్తి సాధ్యమైన రోజున హీలియంకు డిమాండ్ పెరుగుతుందని, దీని ద్వారా తయారు చేసే విద్యుత్‌తో భూమ్మీద వాహనాలు నడుస్తాయని, జాబిల్లిపై మానవ ఆవాసాలకూ ఉపయోగపడుతుందని కలాం అప్పట్లో వివరించినట్లు అన్నాదురై వివరించారు.

## ట్విట్టరాటీ జాబితాలో అగ్రస్థానంలో జాతీయ పతాకం!



''చంద్రయాన్–2 ద్వారా జాబిల్లిపైకి ఏం తీసుకెళితే బాగుంటుంది?''ఇటీవల ట్విట్టర్ ప్రపంచానికి ఇస్రో వేసిన ప్రశ్న ఇది. ఇందుకు భారీగా స్పందించిన నెటిజన్లు... జాతీయ పతాకాన్ని తీసుకెళ్లాలని సూచించారు. దీంతోపాటు కొన్ని ఆసక్తికరమైన విషయాలను కూడా ట్వీట్ల ద్వారా పంచుకున్నారు. గౌతమ్ సింగ్ అనే వ్యక్తి.. ఇండియా మ్యాప్‌ను తీసుకెళ్లాలని, భవిష్యత్తులో గ్రహాంతర వాసులెవరైనా జాబిల్లిని సందర్శిస్తే.. ఈ మ్యాప్ చూసి మనం ఎవరో తెలుసుకుంటారని వ్యాఖ్యానించారు. జాతీయ పతాకం వారికి ఏమాత్రం ఉపయోగపడదని అన్నారు. ఇంకొందరు మన దేశం మట్టిని అక్కడికి తీసుకెళ్లాలని సూచించగా.. కొంతమంది ఈ ఆలోచనకు మద్దతుగా నిలిచారు. ఇంకొందరు మాత్రం ఆ గ్రహాన్ని కలుషితం చేయడం సరికాదని పేర్కొన్నారు.

## ఇవీ లక్ష్యాలు...

చంద్రయాన్–2 ప్రధాన లక్ష్యం ఇప్పటివరకూ ఏ దేశమూ ప్రవేశించని ప్రాంతాల్లో ప్రయోగాలు చేయడం. తద్వారా ఎప్పుడూ చీకటిలోనే ఉండే దక్షిణ ధ్రువ ప్రాంతంలో పెద్ద ఎత్తున నీరు ఏమైనా ఉందా? అన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది. దీంతోపాటు స్వచ్ఛమైన ఇంధనం హీలియం–3 ఛాయలను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతాయి. జాబిల్లిపై ఉన్న హీలియం–3ని సమర్థంగా వాడుకోగలిగితే భూమి మొత్తానికి అవసరమైన విద్యుత్‌ను ఏకంగా 250 ఏళ్లపాటు తయారు చేసుకోవచ్చనని అంచనా.



అంతరిక్ష పోటీ...

చాలా ఏళ్ల తరువాత జాబిల్లిపై ప్రపంచ దేశాలన్నింటిలోనూ ఆసక్తి ఎక్కువైంది. దీంతో అనివార్యంగా అంతరిక్ష పోటీ ఏర్పడింది. ఈ ఏడాదే చైనా, ఇజ్రాయెల్ జాబిల్లిపై దృష్టి పెట్టాయి. ఇజ్రాయెల్ ఏప్రిల్‌లో జాబిల్లిపైకి ఓ ల్యాండర్‌ను పంపేందుకు విఫలయత్నం చేయగా ఈ ఏడాది చివరలో చాంగి–5 పేరుతో ఓ శోధక నౌకను పంపేందుకు చైనా ప్రయత్నాలు చేస్తోంది. ఆ తరువాత మరో మూడు శోధక నౌకలను పంపేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసింది. వాటిల్లో కనీసం ఒక నౌక దక్షిణ ధ్రువ ప్రాంతంలోనే పరిశోధనలు చేపట్టవచ్చన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రయాన్–2కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

## జాబిల్లికి ఎందుకంత ప్రాముఖ్యత?

సౌర కుటుంబంలో భూమిని మినహాయించి ఇంకో ఎనిమిది గ్రహాలు ఉన్నప్పటికీ శాస్త్రవేత్తలు చందమామపై ప్రయోగాలను ముమ్మరం చేసేందుకు ప్రత్యేక కారణాలు ఉన్నాయి. వాటిలో మొదటిది గ్రహాంతర యానానికి తొలిమెట్టుగా చూడటం. భవిష్యత్తులో భూమ్మీద మనుగడ కష్టమైనా, జనాభా ఎక్కువై ఇక్కడి వనరులు సరిపోక పోయినా మనిషి ఇతర గ్రహాలకు తరలి వెళ్లాల్సిందే. సౌర కుటుంబంలో ఇందుకు అవకాశమున్న ఒకే ఒక్క గ్రహం అంగారకుడు. కానీ కోటాను కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉండే అరుణగ్రహాన్ని నేరుగా అందుకోవడం కష్టం. ఈ నేపథ్యంలో జాబిల్లిపై ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని అక్కడికక్కడ ఇంధనాన్ని ఉత్పత్తి చేసుకోవాలని, తద్వారా సుదూర గ్రహాంతర యానానికి సిద్ధం కావచ్చని కొన్ని దేశాలు ఆలోచిస్తున్నాయి. ఇందులో భాగంగా 2020కల్లా జాబిల్లిపై ఓ ఔట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసుకోవాలని నాసా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక రెండో కారణం అక్కడి హీలియం–3. అత్యంత సమర్థమైన ఇంధనంగా గుర్తింపు పొందిన హీలియం–3ని భూమ్మీదకు తరలించి ఇంధనంగా వాడుకోవాలన్న ఆలోచనలు ఉన్నాయి. మూడో కారణం.. చంద్రయాన్–2 ప్రధాన లక్ష్యం సౌర కుటుంబం పుట్టుకకు సంబంధించిన రహస్యాలను ఛేదించడం.




## మూడోవంతు మహిళలే...

చంద్రయాన్–2 ప్రాజెక్టు వెనుక ఉన్న ఇస్రో సిబ్బందిలో కనీసం 30 శాతం మంది మహిళలే! ప్రాజెక్టు డైరెక్టర్‌గా ముత్తయ్య వనిత, మిషన్ డైరెక్టర్‌గా రితూ కరిధాల్‌లు చంద్రయాన్–2 ప్రయోగ ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండటం కూడా ఇస్రో చరిత్రలో ఇదే తొలిసారి. మిషన్ డైరెక్టర్ రితూ కరిధాల్ బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో పాఠశాల విద్యార్థిగా ఉన్న సమయంలోనే సైన్స్ సబ్జెక్టుల్లో విశేష ప్రతిభ కనపరిచిన రితూ కరిధాల్... 1997 నుంచి ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. మంగళ్‌యాన్ ప్రాజెక్టుకు డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రాజెక్టు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ముత్తయ్య వనిత ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ ఇంజనీర్. అప్పటివరకూ దేశ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల సమాచార నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వనిత.. చంద్రయాన్–2 ప్రాజెక్టులో చేరేందుకు అంతగా ఇష్టం చూపలేదు. అయితే చంద్రయాన్–1 డైరెక్టర్‌గా పని చేసిన ఎం.అన్నాదురై సమస్యలను పరిష్కరించడంలో, సిబ్బంది నిర్వహణలోనూ వనితకు ఉన్న అపారమైన నైపుణ్యాన్ని గుర్తించి చంద్రయాన్–2లో చేరాల్సిందేనని పట్టుబట్టి చేర్పించారు.



రితూ కరిధాల్



వనిత

# చందమామపైకి చలో చలో

▶ మొదటి పేజీ తరువాయి

మళ్లీ లాంచ్ రిహార్సల్స్ నిర్వహించారు. ప్రయోగ సమయానికి 20 గంటల ముందు అంటే ఆదివారం ఉదయం 6.51 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించాలని నిర్ణయించారు. 20 గంటల కౌంట్‌డౌన్ అనంతరం జీఎస్‌ఎల్వీ మార్క్3–ఎం1 రాకెట్.. 3,850 కిలోల బరువుగల చంద్రయాన్–2 ఉపగ్రహాన్ని భూమి నుంచి చంద్రుడిపైకి మోసుకెళ్తుంది. జీఎస్‌ఎల్వీ మార్క్ 3–ఎం1 రాకెట్ పొడవు 43.43 మీటర్లు, బరువు 640 టన్నులు. ఇందులో 3,850 కిలోల బరువుగల చంద్రయాన్–2 మిషన్‌ను పంపుతున్నారు. ఉపగ్రహంలో 2.3 టన్నుల ఆర్బిటర్, 1.4 టన్నుల ల్యాండర్ (విక్రమ్), 27 కిలోల రోవర్ (ప్రజ్ఞాన్)లో 14 ఇండియన్ పేలోడ్స్ (ఉపకరణాలు)తోపాటు అమెరికాకు చెందిన రెండు, యూరప్ దేశాలకు సంబంధించి రెండు పేలోడ్స్‌ను పంపిస్తున్నారు.

### ఇలా పనిచేస్తుంది...

- మొదటి దశలో జీఎస్‌ఎల్వీ మార్క్3–ఎం1 రాకెట్, దాని ఇరువైపులా ఉన్న అత్యంత శక్తివంతమైన ఎస్–200 బూస్టర్ల సాయంతో నింగికి పయనమవుతుంది. ఈ దశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో 400 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించి 131.30 సెకన్లలో మొదటి దశను పూర్తి చేస్తారు.
- రెండో దశలో ద్రవ ఇంజన్ మోటార్లు 110.82 సెకన్లకే ప్రారంభమవుతాయి. 203 సెకన్లకు రాకెట్ శిఖర భాగాన అమర్చిన చంద్రయాన్–2 మిషన్‌కు ఉన్న హీట్ షీల్డ్స్ విడిపోతాయి. ఈ దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని ఉపయోగించి 308.50 సెకన్లకు రెండో దశను పూర్తి చేస్తారు.
- మూడో దశలో అత్యంత కీలకమైన క్రయోజనిక్ (సీ–25) మోటార్లు 310.90 సెకన్లకు ప్రారంభమవుతాయి. 958.71 సెకన్లకు 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి మూడో దశను పూర్తి చేస్తారు. అనంతరం రాకెట్‌కు శిఖర భాగాన అమర్చిన త్రీ–ఇన్–వన్ చంద్రయాన్–2 మిషన్ 973.70 సెకన్లకు (16.21 నిమిషాల వ్యవధిలో) భూమికి దగ్గరగా (పెరిజీ) 170.06 కిలోమీటర్లు, భూమికి దూరంగా (అపోజి) 39,059.6 కిలోమీటర్ల ఎత్తులో హైలీ ఎసిన్‌ట్రిక్ ఆర్బిట్ (అత్యంత విపరీతమైన కక్ష్య)లోకి ప్రవేశిస్తుంది. ఆ తరువాత ఈ బాధ్యతను బెంగళూరులోని మాస్టర్ కంట్రోల్ సెంటర్ అధీనంలోకి తీసుకొని మిషన్ చంద్రుడిపైకి వెళ్లే వరకు ఆపరేషన్ నిర్వహిస్తుంది.

### 16 రోజుల్లో కక్ష్య దూరం పెంపు...

ప్రయోగం జరిగిన 16 రోజుల్లో అపోజిని 39,059.6 కిలోమీటర్ల నుంచి 1,41,000 పెంచేందుకు ఆర్బిటర్‌ను మండించి నాలుగుసార్లు కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను చేపడతారు. ఐదోసారి ఆర్బిటర్‌ను చంద్రుడి వైపు మళ్లిస్తారు. తదనంతరం చంద్రుని చుట్టూ కక్ష్య ఏర్పరిచేందుకు రెట్రోబర్న్ చేసి వంద కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యను తగ్గించడానికి నాలుగుసార్లు ఆపరేషన్ చేపడతారు. 100 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్లు ఎత్తుకు తగ్గించుకుంటూ ఆర్బిటర్‌ను మండిస్తారు. ఆ తరువాత ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడి ఉపరితలంపైన దక్షిణ ధ్రువ ప్రాంతంలోని మృదువైన ప్రదేశంలో నెమ్మదిగా దిగుతుంది. ఆ తర్వాత ల్యాండర్ నుంచి రోవర్ చంద్రుడి ఉపరితలంపైకి రావడానికి సుమారు 4 గంటల సమయాన్ని తీసుకుంటుంది. రోవర్ ఒక లూనార్ డే (చంద్రరోజు).. అంటే 14 రోజుల్లో 500 మీటర్ల దూరం ప్రయాణించి చంద్రుడి ఉపరితలంపై మూలాలను పరిశోధించి భూ నియంత్రిత కేంద్రానికి సమాచారాన్ని చేరవేస్తుంది. ఇదంతా జరగడానికి 52 రోజులు పడుతుంది. ఇలా 3.50 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి సెప్టెంబర్ 6న ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడి మీదకు చేరుకుని పరిశోధనలకు శ్రీకారం చుడుతుంది.



### తిరుమలలో ఇస్రో చైర్మన్ ప్రత్యేక పూజలు

తిరుమల శ్రీవారిని ఇస్రో చైర్మన్ డాక్టర్ కె. శివన్ శనివారం దర్శించుకున్నారు. చంద్రయాన్–2 నమూనాను శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విచ్చేస్తున్నారని ఆయన తెలిపారు.

# కాటేసిన ఖరీఫ్!

▶ మొదటి పేజీ తరువాయి

విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక విడుదల చేసింది. ఈ నెల 15 నాటికి సాధారణ స్థాయిలో పంటల సాగు విస్తీర్ణం పెరగకపోతే దీన్ని అమలు చేయాలని సూచించింది. ఆ ప్రణాళికలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పరిస్థితిని వివరిస్తూ, ప్రత్యామ్నాయ పంటల వివరాలను జిల్లాల వారీగా ప్రకటించింది. మరోవైపు కంటిజెన్సీ ప్రణాళిక ప్రకారం అవసరమైన విత్తనాలను సరఫరా చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థను ఆదేశించింది.

### వర్షాభావ పరిస్థితులు..

రుతుపవనాలు బలహీనంగా ఉండటంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని కంటిజెన్సీ ప్రణాళికలో వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ నెల 12 నాటికి రాష్ట్రంలో 31 శాతం లోటు వర్షపాతం నమోదైందని పేర్కొంది. సాధారణంగా జూన్ 1 నుంచి ఈ నెల 12 నాటికి కురవాల్సిన వర్షపాతం 213.1 మిల్లీమీటర్లు (మి.మీ.) కాగా 146 మి.మీ. మాత్రమే కురిసింది. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో తీవ్రమైన దుర్భిక్షం నెలకొందని తెలిపింది. ఖమ్మం జిల్లాలో 69 శాతం, సూర్యాపేట జిల్లాలో 67 శాతం, నల్లగొండ జిల్లాలో 66 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మరో 23 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని తెలిపింది. దీంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 40 శాతానికే పరిమితమైంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా 1.08 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 43.33 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయని తెలిపింది. రైతులు 9 శాతమే నారు వేశారు. పత్తి, సోయాబీన్ తదితర విత్తనాలు వేసినా అవి భూమిలోనే మాడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు వెళ్లాల్సి వస్తుందని, ఆ మేరకు అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది.

### మూడు దశల కంటింజెన్సీ ప్రణాళిక..

కంటింజెన్సీ ప్రణాళికను మూడు దశల్లో అమలు చేస్తారు. ఈ నెల 15 వరకు సాధారణంతో పోలిస్తే సాగు విస్తీర్ణం పెరగకపోతే మొదటి ప్రణాళిక, అలాగే ఈ నెల 31 నాటికి కూడా పరిస్థితి మెరుగుపడకపోతే రెండో దశ ప్రణాళిక, ఆ తర్వాత ఆగస్టు 15 నాటికి కూడా పరిస్థితిలో మార్పు రాకపోతే మూడో దశ ప్రణాళిక అమలు చేస్తారు. ఆ ప్రకారం ఆయా సమయాల్లో ఏ జిల్లాల్లో ఎటువంటి పంటలను సాగు చేయాలనే దానిపై ఒక కేలండర్‌ను వ్యవసాయ శాఖ విడుదల చేసింది. జిల్లాల వారీగా వర్షపాతం, అక్కడి నేలల స్వభావం, వేయాల్సిన పంటలను అందులో వ్యవసాయ శాఖ వెల్లడించింది. ప్రధానంగా ఆయా పంటల్లో స్వల్పకాలిక, మధ్యకాలిక విత్తనాలను, అలాగే వివిధ రకాల వెరైటీలను వేయాలని సూచించింది. ఉదాహరణకు కామారెడ్డి జిల్లాలో తేలికపాటి నేలల్లో (ఈ నెల 15 నాటికి వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే) మధ్యకాలిక కంది, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న వేయాలని సూచించింది. ఈ నెల 31 నాటికి పరిస్థితి మెరుగుపడకపోతే ఆయా పంటల్లోని స్వల్పకాలిక రకాలను, అలాగే జొన్న, స్వల్పకాలిక కూరగాయల విత్తనాలను వేయాలని సూచించింది. ఆగస్టు 15 నాటికి మూడో దశలో కంది, పొద్దు తిరుగుడు, ఆముదం, కంది వంటి విత్తనాలను సాగు చేయాలని సూచించింది. ఇలా జిల్లాల వారీగా తయారు చేసిన కేలండర్‌ను జిల్లాలకు పంపింది.



### 6.02 లక్షల క్వింటాళ్ల విత్తనాలు..

కంటింజెన్సీ ప్రణాళిక అమలుకు ప్రత్యేకంగా 6.02 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థను వ్యవసాయ శాఖ ఆదేశించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్‌బొజ్జా విత్తనాభివృద్ధి సంస్థకు లేఖ రాశారు. ఈ నెల 15 నాటి మొదటి దశ ప్రణాళిక అమలు కోసం 1.78 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, ఈ నెల 31 నాటి రెండో దశ ప్రణాళిక అమలుకు 1.94 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, వచ్చే నెల 15 నాటి మూడో దశ ప్రణాళిక అమలుకు 2.28 లక్షల కింటాళ్ల విత్తనాలు అందజేయాలని కోరింది. అందులో అత్యధికంగా వరి, వేరుశనగ, పెసర, కంది, మొక్కజొన్న విత్తనాలున్నాయి. వేరుశనగ విత్తనాలు మూడు దశల కంటింజెన్సీ అమలుకు 2.45 లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ కోరింది. ఆ తర్వాత కంది విత్తనాలు 76 వేల క్వింటాళ్లు, వరి విత్తనాలు 57 వేల క్వింటాళ్లు, మొక్కజొన్న విత్తనాలు 59 వేల క్వింటాళ్లు, సోయాబీన్ 22 వేల క్వింటాళ్లు, జొన్న 13 వేల క్వింటాళ్లు సరఫరాకు విన్నవించింది. ఇవిగాక మినుములు, నువ్వులు, సజ్జలు, ఆముదం, కొర్రలు, పొద్దు తిరుగుడు విత్తనాలను కూడా సరఫరా చేయాలని కోరింది. ఏ జిల్లాకు ఎంతెంత ఇండెంట్ కావాలో స్పష్టంగా పేర్కొంది.

## ఇంటర్ రెండో సంవత్సరం 'అడ్వాన్స్' ఫలితాలు నేడు

సాక్షి, హైదరాబాద్: గత జూన్‌లో నిర్వహించిన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలను ఆదివారం విడుదల చేస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను బోర్డు వెబ్‌సైట్‌లో సరిచూసుకోవాల్సిందిగా సూచించారు. ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ప్రవేశాల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటర్ అడ్వాన్స్ ఫలితాల వెల్లడిలో జాప్యంపై ఆందోళన చెందారు. ప్రస్తుతం ఫలితాల వెల్లడి కానుండటంతో ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులకు ఊరట దక్కనుంది.

## ఎస్సై తుది ఫలితాలు విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

సందేహాలున్న అభ్యర్థులు నివృత్తి కోసం ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు సూచించారు. ఇందుకుగానూ ఎస్సీ, ఎస్టీలకు రూ.2000, ఇతర అభ్యర్థులకు రూ.3000 వేలుగా ఫీజు నిర్ణయించారు. ఈ దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, ఎలాంటి వ్యక్తిగత వినతులు స్వీకరించబోమని చైర్మన్ స్పష్టం చేశారు.

# ఇక రెవెన్యూ పనే!

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే నూతన పురపాలక చట్టాన్ని కొలిక్కి తెచ్చిన ఆయన ఈ నెల 18, 19వ తేదీల్లో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో దానికి ఆమోదముద్ర వేయాలని నిర్ణయించారు. కొత్త 'పుర'చట్టం అనంతరం నయా రెవెన్యూ చట్టం తీసుకురానున్నట్లు ఇది వరకే ప్రకటించిన సీఎం.. కొత్త చట్టాన్ని త్వరితగతిన తీసుకురావాలని ఉన్నతాధికారులకు అంతర్గత ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

### భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం...

రెండేళ్ల క్రితం రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాందిపలుకుతూ భూ రికార్డుల ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. ఈ ప్రక్షాళనే రెవెన్యూలో మరిన్ని భూ తగాదాలకు ఆజ్యం పోసింది. క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించకుండానే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో భూ వివాదాలు పెరిగిపోవడానికి దారితీసింది. సర్వే చేయకుండానే అడ్డగోలుగా రికార్డులు తారుమారు చేయడం, వాటిని సరిచేసేందుకు తహసీల్దార్ల చుట్టూ తిప్పించుకోవడం అవినీతికి దారితీసింది. లంచం ఇస్తే గానీ రికార్డులను సరిచేయని పరిస్థితి తలెత్తింది. భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం జరిగిన తప్పిదాలపై ఇంటలిజెన్స్ విభాగంతో ఆరా తీసిన ముఖ్యమంత్రి రెవెన్యూ యంత్రాంగం అవినీతి లీలలను చూసి ఆశ్చర్యపోయారు. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ వ్యవస్థను సమూలంగా సంస్కరించాలనే నిర్ణయానికి వచ్చారు. ఒక దశలో రెవెన్యూ శాఖను పంచాయతీ రాజ్‌లో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానించినట్లు వార్తలొచ్చాయి. ముఖ్యమంత్రి ఆగ్రహాన్ని అర్థం చేసుకున్న రెవెన్యూ ఉద్యోగ సంఘాలు పరిస్థితిని సరిదిద్దేందుకు ప్రయత్నించాయి. అందులో భాగంగా లంచం ఇవ్వకూడదని, అవినీతిరహిత కార్యాలయాలుగా పేర్కొంటూ.. ఎవరైనా డబ్బులడిగితే ఫిర్యాదు చేయమని ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులను తహసీల్దార్ కార్యాలయాల ముందు ప్రదర్శించాయి.

### నీతులు బోర్డులకే పరిమితం...

అయితే ఈ నీతులు బోర్డులకే పరిమితం కావడం, రోజుకో అధికారి ఏసీబీ వలలో చిక్కుతుండటంతో ఆ శాఖ అవినీతి మకిలీ బయటపడుతోంది. మెదక్ జిల్లాలో ఓ తహసీల్దార్ ఏకంగా రూ.8 లక్షల లంచాన్ని చెక్కు రూపేణా తీసుకోవడం.. పని చేయకపోవడం వెలుగులోకి వచ్చింది. అలాగే తాజాగా రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల తహసీల్దార్ లావణ్య, వీఆర్ఓ అనంతయ్య లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ ఉచ్చుకు చిక్కారు. ఈ దాడిలో తహసీల్దార్ ఇంట్లో ఏకంగా రూ.93 లక్షల నగదు పట్టుబడటం రెవెన్యూ చరిత్రలోనే సంచలనం సృష్టించింది. ఈ పరిణామాలన్ని రెవెన్యూ ఉద్యోగ సంఘాలను ఇరుకున పడేశాయి. ఎన్నికల వేళ బదిలీ చేసిన తహసీల్దార్లను పాత జిల్లాలకు పంపాలని పేషీల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో తలపట్టుకున్న నేతలకు.. కొందరు అవినీతి అధికారుల వ్యవహారశైలి తలెత్తుకోకుండా చేస్తోంది. ఈ క్రమంలోనే ఉద్యమబాటకు పిలుపునిచ్చిన సంఘాలు.. వ్యూహాత్మకంగా ఆందోళన విరమించుకుంటున్నట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నాయి. రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉండటంతోనే ఉన్నతాధికారులు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని పరిస్థితుల్లో తాజా పరిణామాలు మింగుడు పడకుండా చేశాయి.

### రద్దా.. విలీనమా?

ఈ నేపథ్యంలో మరోసారి కొత్త రెవెన్యూ చట్టం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే నూతన చట్టంపై మల్లగుల్లాలు పడుతున్న నిపుణుల కమిటీ.. రెవెన్యూ శాఖను రద్దు చేయాలా? లేక ఇతర శాఖల్లో విలీనం చేయాలా? అని ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కిందిస్థాయిలోని సిబ్బందిని పంచాయతీరాజ్ పరిధిలోకి తేవాలని, ఇతర అధికారుల హోదాలు, అధికారాలను కుదించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి మచ్చతెచ్చేలా పూటకో అధికారి అవినీతి వలలో పడుతుండటంతో సాధ్యమైనంత త్వరగా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే వారంలో 'పుర'చట్టం కార్యరూపం దాల్చగానే.. కొత్త రెవెన్యూ చట్టంపై తుది కసరత్తు ప్రారంభవుతుందని, ఈ నెలాఖరులోగా దీనిపై స్పష్టత రావచ్చని ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు.



# కాలేజీల కాసుల మాయ!

- రాష్ట్రంలోని ప్రైవేటు వృత్తి, సాంకేతిక విద్య కళాశాలల్లో జీతాల గోల్‌మాల్
- లెక్చరర్లకు రికార్డుల్లోనే ఆరో వేతన కమిషన్ వేతనాలు
- వారి ఏటీఎంలు, చెక్‌బుక్‌లు అట్టిపెట్టుకొని భారీగా సొమ్ము విత్‌డ్రా
- నెలకు రూ. 60 కోట్ల చొప్పున ఏటా రూ. 720 కోట్లు వెనక్కి..
- ఒప్పుకోని లెక్చరర్ల తొలగింపు.. సర్టిఫికెట్లు లాక్కొని కూడా వేధింపులు

- **ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, ఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్‌కు నెలకు రూ. 90 వేల జీతం బ్యాంకులో పడుతోంది. కానీ పడిన కాసేపటికే ఆ సొమ్ములోంచి రూ. 40 వేలు తిరిగి వెనక్కి వెళ్లిపోతోంది.**
- **అదే కాలేజీలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పేరుకే రూ. 62 వేల జీతం వస్తోంది. కానీ ప్రతి నెలా అందులోంచి ఏకంగా రూ. 30 వేలు కోత పడుతోంది.**
- **ఘట్‌కేసర్ సమీపంలోని మరో ప్రముఖ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్‌కు ఇస్తున్నట్లుగా రికార్డుల్లో చూపుతున్న వేతనం రూ. 1.20 లక్షలు. కానీ వాస్తవానికి ఆయనకు అందుతున్నది మాత్రం రూ. 65 వేలే.**
- **ఇలా రాష్ట్రంలో కొంత బాగా నడిచే ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంటెక్ కాలేజీల్లో పని చేసే దాదాపు 30 వేల మంది లెక్చరర్ల నుంచి ప్రతి నెలా రూ. 60 కోట్ల చొప్పున ఏడాదికి రూ. 720 కోట్ల మేరకు జీతాల సొమ్మును యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వెనక్కి తీసుకుంటున్నట్లు అంచనా.**




**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని చాలా ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో వేతనాల మాయ కొనసాగుతోంది. ఓవైపు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులను దండుకుంటున్న యాజమాన్యాలు... మరోవైపు లెక్చరర్ల శ్రమనూ దోచేస్తున్నాయి. రికార్డుల్లో వారికి భారీ వేతనాలు చూపుతూ వాస్తవానికి అరకొర జీతాలే చెల్లిస్తున్నాయి. రూ. 70 వేలకుపైగా వార్షిక ఫీజు ఉన్న ప్రముఖ కాలేజీల్లోనే ఈ దోపిడీ కొనసాగుతోంది. ఇక సాధారణ కాలేజీల్లో పరిస్థితి సరేసరి. ఎక్కడా సరైన జీతాలు అడిగే వారు లేరు. కాలేజీలను పట్టించుకునే వారూ లేరు. యాజమాన్యాలు ఇచ్చిందే వేతనం. దీంతో రాష్ట్రంలోని 650 వరకు ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర వృత్తివిద్యా కాలేజీల్లోని దాదాపు 49 వేల మంది లెక్చరర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. వారే కాదు... మరో 50 వేల వరకు ఉండే బోధనేతర సిబ్బందికి సైతం అరకొర వేతనాలతో సతమతమవుతున్నారు.

### ఇలా వేయడం.. అలా తీసుకోవడం...

సాంకేతిక, వృత్తి విద్యా కాలేజీల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో భారీగా వేతనాలు వేస్తున్నట్లు చూపుతున్న యాజమాన్యాలు.. వారి ఏటీఎం కార్డులు, చెక్ బుక్‌లను మాత్రం అట్టిపెట్టుకొని డ్రా చేసుకుంటున్నాయి. కొన్ని యాజమాన్యాలు వారితోనే డబ్బు డ్రా చేయించి తీసుకుంటున్నాయి. ఇటీవల ఒక కాలేజీలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని లైన్లో నిలబెట్టి డబ్బు తిరిగి తీసుకుంటున్న వ్యవహారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. తాము చెల్లించే వేతనాలకు ఒప్పుకోకుంటే లెక్చరర్లను నిర్దాక్షిణ్యంగా తీసేస్తున్నారు. కొన్ని యాజమాన్యాలైతే వారి సర్టిఫికెట్లనూ దగ్గర పెట్టుకొని వేధిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా పట్టించుకునే వారు లేక యాజమాన్యాల వేతన మాయకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

### ఐదారు నెలలపాటు వేతనాల్లేవ్...

రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీల్లో చాలా కాలేజీలు ఐదారు నెలలపాటు అరకొర వేతనాలనూ చెల్లించడం లేదు. దీంతో బోధన, బోధనేతర సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్ని కాలేజీలైతే 9 నెలలపాటు జీతాలు ఇవ్వకుండా ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. రాష్ట్ర విద్యా చట్టం 1982లోని చాప్టర్-14, సెక్షన్-84లో ప్రతి ఉద్యోగికి ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని స్పష్టం చేసినా అది పెద్దగా అమలు కావట్లేదు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి అప్రూవల్ హ్యాండ్ బుక్‌లో ప్రతి కాలేజీ వేతన స్కేళ్లను అమలు చేయాలని లేదంటే ఆయా కాలేజీల గుర్తింపును రద్దు చేస్తామని పేర్కొంది. దీంతో యాజమాన్యాలు రికార్డుల్లోనే పే స్కేళ్లను అమలు చేస్తున్నట్లు చూపి ఇచ్చిన వేతనాల్లో సగానికి పైగా వేతనాలను వెనక్కి తీసుకుంటున్నాయి.

### సదుపాయాలు నామమాత్రమే...

రాష్ట్రంలోని చాలావరకు సాంకేతిక, వృత్తి విద్యా సంస్థల్లో ఎలాంటి గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించట్లేదు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి జారీ చేసిన అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్ బుక్‌లో 28వ అంశంగా ఆయా కాలేజీల్లో పని చేసే ప్రతి ఉద్యోగికి గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని పేర్కొంది. కానీ మెజారిటీ కాలేజీలు దానిని పట్టించుకోవడం లేదు. అలాగే మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులను అమలు చేయాలని స్పష్టం చేసినా వాటినీ అమలు చేయడం లేదు.

### వేతనాలు చెల్లించకపోతే ఇల్లు గడిచేదెలా?

సిబ్బందికి నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే జీవనం ఎలా కొనసాగిస్తారు? దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలి.

**– సంతోష్ కుమార్, తెలంగాణ స్కూల్స్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు**

### పక్కాగా నిబంధనలు అమలు చేయాలి

రాష్ట్రంలోని వృత్తి, సాంకేతిక విద్యాసంస్థల్లో పనిచేసే లెక్చరర్లకు వేతనాల చెల్లింపు విషయంలో నిబంధనలను పక్కాగా అమలు చేయాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, ఏఐసీటీఈ తగిన చర్యలు చేపట్టాలి.

**– బాలకృష్ణారెడ్డి, ఏఐసీటీఈ తెలంగాణ టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు**

## అసమానతలు విస్మరించిన కస్తూరి రంగన్ నివేదిక

### టీపీటీఎఫ్ సెమినార్‌లో అభిప్రాయపడ్డ వక్తలు

**సాక్షి, హైదరాబాద్:** పాఠశాల విద్యలో నెలకొన్న అసమానతలను కస్తూరి రంగన్ కమిటీ ప్రస్తావించలేదని, కొందరి ప్రయోజనాలు కాపాడేలా నివేదిక ఉందని ప్రొఫెసర్ బుర్రా రమేశ్ విమర్శించారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ అధ్యక్షతన శనివారం హైదరాబాద్‌లో కస్తూరి రంగన్ నివేదికపై జరిగిన సెమినార్‌లో రమేశ్ ప్రసంగించారు. విద్యారంగం సంక్షోభంలో ఉందని అంగీకరించిన కస్తూరి రంగన్ కమిటీ.. మరోవైపు విద్యారంగంలో ప్రపంచీకరణను సమర్థించేలా నివేదిక ప్రతిపాదించిందన్నారు. గుణాత్మక విద్య గురించి పదేపదే ప్రస్తావించినప్పటికీ పాఠ్యాంశాల్లో సెక్యులరిజం ప్రస్తావన విస్మరించిందని అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా విద్యార్థులకు బోధన అందించాలని ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి సూచించారు. ప్రైవేటు విద్యాసంస్థల రద్దుతోనే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో విద్యారంగ నిపుణులు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎ.నర్సింహారెడ్డి, కె.వేణుగోపాల్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నారయణమ్మ, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు అంతా అటానమస్ కాలేజీలదే

### యూజీసీ సభ్యుడు గోపాల్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** దేశంలో భవిష్యత్తు అంతా అటానమస్ కాలేజీలదేనని యూజీసీ సభ్యుడు జి.గోపాల్‌రెడ్డి తెలిపారు. అందుకే నాణ్యత ప్రమాణాలు పెంచే దిశగా అటానమస్ కాలేజీలు చర్యలు చేపట్టాలని సూచించారు. విజ్ఞాన భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అటానమస్ హోదా లభించింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అటానమస్ హోదా సర్టిఫికెట్‌ను కాలేజీ చైర్మన్ గౌతంరావుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో 46 వేల కాలేజీలు ఉంటే 800 కాలేజీలకు అటానమస్ హోదా దక్కిందని తెలిపారు. రాష్ట్రంలోని జేఎన్‌టీయూ పరిధిలో 26 కాలేజీలకు అటానమస్ ఉందని, అందులో వీబీఐటీ ఒకటని పేర్కొన్నారు. కాలేజీలు అటానమస్ వైపు వెళ్తేనే పరిశోధనలకు ప్రాధాన్యం మరింతగా పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని యువతను నైపుణ్యాలు కలిగిన వారిగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కేంద్రం తీసుకురానున్న నూతన విద్యా విధానంలో నైపుణ్యాల పెంపునకు రాష్ట్రీయ శిక్షా ఆయోగ్‌లో అధిక ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో 1,000 కాలేజీలకు అటానమస్ హోదా లక్ష్యంగా కేంద్రం చర్యలు చేపట్టిందన్నారు. జేఎన్‌టీయూ మాజీ వైస్ చాన్స్‌లర్ డీఎన్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక యుగంలో టెక్నాలజీతో ఉపయోగం ఎంతుందో ప్రమాదం కూడా అంతే ఉందన్నారు. విద్యార్థుల్లో సబ్జెక్ట్ నైపుణ్యాలు మాత్రమే కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, పరిస్థితులకు అనుగుణంగా స్పందించగలిగే సత్తాను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో వీబీఐటీ చైర్మన్ గౌతంరావు, కార్యదర్శి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌ల్లో 29 వేల కేసులు పరిష్కారం

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శనివారం తెలంగాణలోని అన్ని జిల్లా కోర్టుల్లో లోక్‌అదాలత్‌లను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం సాయంత్రానికి 29,027 కేసుల్ని పరిష్కరించినట్లు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎ.సంతోష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్. చౌహాన్, రాష్ట్ర న్యాయాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌ల ఆదేశాలకు అనుగుణంగా నిర్వహించిన లోక్‌అదాలత్‌ల్లో ఇప్పటికే న్యాయ వివాదాల్లో ఉన్న 16,793 కేసులు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 12,234 కేసులు కలిపి మొత్తం 29,027 కేసులు పరిష్కారం అయ్యాయని, వీటి విలువ రూ.40.73 కోట్లని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# పాస్‌పోర్ట్‌ల జారీలో టాప్–10లో రాష్ట్రం

- ఎన్నారై భర్తలపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఉంటే పాస్‌పోర్ట్ రద్దు
- త్వరలో చిప్ బేస్డ్ పాస్‌పోర్ట్‌లు జారీ
- హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్:** అత్యధిక పాస్‌పోర్ట్‌ల జారీలో తెలంగాణ టాప్–10లో నిలిచిందని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఇక అత్యంత వేగంగా పాస్‌పోర్ట్‌ల జారీ ప్రక్రియలో తెలుగు రాష్ట్రాలు మొదటి స్థానంలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియను సరళీకృతం చేయడం వల్లే ఎక్కువ మందికి సేవలందించటం సాధ్యమైందన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కుటుంబాల కోసం శనివారం ప్రత్యేక పాస్‌పోర్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ..ఉద్యోగ రీత్యా సమయాభావం వల్ల పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలకు రాలేని పట్టణ వాసుల కోసం ప్రత్యేక పాస్‌పోర్ట్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ప్రెస్‌క్లబ్ తరపున రెండోసారి మేళా నిర్వహించగా దాదాపు 600 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందుకు ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత రెండున్నరేళ్లలో దేశవ్యాప్తంగా 414 పోస్టాఫీసు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు ప్రారంభించగా, హైదరాబాద్ రీజినల్ పరిధిలో 14 సెంటర్లను కొత్తగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా సెంటర్లకు 2018లో 45,000, 2019 జూన్ నాటికి 35, 000 పాస్‌పోర్ట్ దరఖాస్తులు వచ్చాయన్నారు.

### గతంకంటే భిన్నంగా..

గతంలో నివాసం ఎక్కడ ఉంటే అక్కడ సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను స్వీకరించి పాస్‌పోర్ట్‌లు జారీ చేసేవారని, ఇప్పుడా పద్ధతికి స్వస్తి చెప్పి శాశ్వత చిరునామా ఎక్కడ ఉన్నా ప్రస్తుత నివాసప్రాంతం నుంచే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పోలీసుల పరిశీలన మాత్రం ప్రస్తుత చిరునామాలోనే జరుపుతారని, కొన్ని సందర్భాల్లో మాత్రమే శాశ్వత చిరునామాలో పరిశీలన జరుపుతున్నట్లు వెల్లడించారు. 2018 ఏడాదికి గాను 5,49,000 దరఖాస్తులు రాగా అందులో 5,20,000 మందికి, 2019 జూన్ వరకు 2,82,000 మంది దరఖాస్తు చేసుకుంటే 2,69,000 మందికి పాస్‌పోర్ట్‌లు జారీ చేశామని తెలిపారు. పాస్‌పోర్ట్‌కు సంబంధించిన పోలీసు పరిశీలన తెలంగాణలో నాలుగు రోజుల్లో, ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల్లోను పూర్తవుతుందన్నారు. పాస్‌పోర్ట్‌ల పెండింగ్ తగ్గుముఖం పట్టిందన్నారు.

### ఫేక్ వెబ్‌సైట్లతో మోసపోవద్దు

పాస్‌పోర్టు ఇప్పిస్తామని కొన్ని వెబ్‌సైట్లు అమాయకులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ అంశాన్ని కేంద్ర కమ్యూనికేషన్ల విభాగం దృష్టికి తీసుకెళ్తామని విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. ఫేక్‌వెబ్‌సైట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పాస్‌పోర్ట్ కార్యాలయానికి సంబంధించి **passportindia.gov.in** మాత్రమే అధికారిక వెబ్‌సైట్‌గా ఆయన పేర్కొన్నారు. పాస్‌పోర్టు పొందేందుకు రూ.1,500 మాత్రమే చెల్లించాలని, అంతకంటే ఎక్కువ డబ్బులు అడిగితే ఆ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఎఫ్ఐఆర్, ఛార్జిషీటు, నాన్‌బెయిలబుల్ వారెంట్ ఉన్న ఎన్నారై భర్తల పాస్‌పోర్ట్‌లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో చిప్ బేస్డ్ పాస్‌పోర్ట్‌లను జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.



**శనివారం జర్నలిస్టుల పాస్‌పోర్టు మేళాలో మాట్లాడుతున్న హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి. చిత్రంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు**

### రెండున్నర ఎకరాల్లో విదేశీ భవన్

శిల్పారామం ఎదురుగా విదేశీ భవన్ ఏర్పాటుకు రెండున్నర ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించిన తెలంగాణ ప్రభుత్వానికి విష్ణువర్ధన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. భవన్ నిర్మాణానికి అవసరమైన ప్లానింగ్ పనిలో కేంద్ర ప్రభుత్వ ఇంజనీర్లు ఉన్నారన్నారు. ఈ ఏడాది చివరికల్లా భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీగిరి విజయ్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, పాస్‌పోర్ట్ కార్యాలయ డీపీఓ ఇందుభూషణ్ లింకా తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన జాతీయ జెండా డెన్మార్క్ దేశానిది. 1625 నుంచి ఇప్పటివరకు ఈ జెండాను జాతీయ జెండాగా వాడుతున్నారు.



## గట్టి ప్రాణమే సుమీ!



ఈ పిల్లి పిల్లకు ఇంకా భూమి మీద నూకలు రాసి ఉన్నట్లున్నాయి. ఎందుకంటే ఫొటో చూశారుగా.. అమెరికాలోని ఫ్రాంక్‌ఫోర్ట్‌లో ఉన్న ఓ కారు మెకానిక్ షాప్‌లో రిపేర్ కోసం వచ్చిన కారు కింది భాగంలో 9 నెలల వయసున్న ఈ పిల్లి పిల్ల ఇరుక్కుంది. ఆ విషయం తెలియక ఆ కారు డ్రైవర్ ఏకంగా 48 కిలో మీటర్ల దూరం ప్రయాణించాడు. ఆ తర్వాత ఆ పిల్లి అరుపులు విని కారు ఆపి చూడటంతో పిల్లి కన్పించింది. వెంటనే ఆ బుజ్జి పిల్లిని బయటకు తీశారు. ఇప్పుడు పిల్లి ఆరోగ్యంగానే ఉంది.

## ఎంచక్కా ఎగిరేద్దాం..



మనకు ఇప్పటివరకు డ్రోన్ అనగానే.. ఏదైనా వస్తువులను మోసుకెళ్లేదే తెలుసు కదా.. అయితే మానవులను మోసుకెళ్లే డ్రోన్‌లను కూడా తయారు చేసేందుకు పరిశోధకులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ బాటలో ఓ ముందడుగు వేసిన బలాజ్ కెరులో అనే ఇంజనీర్ మానవ సహిత డ్రోన్‌ను తయారుచేశారు. 'హెక్సా'అనే పర్సనల్ డ్రోన్‌ను ఇటీవల అమెరికాలోని టెక్సస్‌లో ఉన్న లాగోవిస్టాలో జరిగిన ఓ ఈవెంట్‌లో 'లిఫ్ట్ ఎయిర్ క్రాఫ్ట్'చీఫ్ ఇంజనీర్ కెరులో ప్రదర్శించారు.

## ఐర్లాండ్ భోగి మంటలు!



సంక్రాంతి అనగానే మనకు గుర్తొచ్చేది భోగి మంటలు. అయితే భోగి మంటలు వేయడం మన దగ్గర మాత్రమే కాదు.. ప్రపంచంలోని చాలా సంప్రదాయాల్లో భాగంగా ఉంది. ఉత్తర ఐర్లాండ్‌లోని లార్నే అనే పట్టణంలో ఉన్న క్రెయిగీ హిల్స్ వద్ద భోగి మంటల కోసం అంతెత్తున క్రమపద్ధతిలో పేర్చారు. 1690 జూలై 12న జరిగిన బోయన్ యుద్ధంలో కేథలిక్ రాజు జేమ్స్–2ను ఆరెంజ్ రాజైన విలియం–3 ఓడించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఏటా ఈ వేడుకలు జరుపుకొంటారు.

## 22న కలెక్టరేట్ల ముట్టడి: చాడ



**సాక్షి, హైదరాబాద్:** కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చాక రైతుల అణచివేతతో పాటు పోడు రైతులపై దాడులు పెరిగాయని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. భూప్రక్షాళన, ధరణి వెబ్‌సైట్‌లో లోపాల కారణంగా అనేక మంది రైతులకు అన్యాయం జరిగిందని వాపోయారు. రైతును రాజును చేస్తానన్న కేసీఆర్ రైతుల రుణమాఫీ ఊసే మరిచిపోయారని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి చేపడుతున్నట్లు వెల్లడించారు. శనివారం మఖ్దూం భవన్‌లో పార్టీ సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి రాష్ట్ర కార్యవర్గ భేటీలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఈ నెల 25న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు డా.రాజ్‌బహదూర్‌గౌర్ శత జయంతి ముగింపు ఉత్సవాలను హైదరాబాద్‌లో నిర్వహిస్తామని ప్రకటించారు. ఆగస్టు మూడో వారంలో పార్టీ నాయకులు ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని ప్రాజెక్టులను సందర్శిస్తారని చెప్పారు. నవంబర్ 24, 25, 26 తేదీల్లో మంచిర్యాలలో రాష్ట్ర నిర్మాణ మహాసభలు ఉంటాయని తెలిపారు.

**కరీంనగర్ జిల్లా కార్యదర్శిపై వేటు..**

పార్టీ అప్పగించిన బాధ్యతలు, క్రమశిక్షణను ఉల్లంఘించి బీజేపీ ఎంపీతో మెలుగుతున్న పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాంగోపాల్‌రెడ్డిని రాష్ట్ర కార్యవర్గం, ప్రాథమిక సభ్యత్వాల నుంచి తొలగించినట్లు చాడ వెల్లడించారు. పార్టీలో ఎవరు తప్పు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బీసీ బిల్లు పాస్ అయ్యే వరకు పోరాటం



**బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య**

**హైదరాబాద్:** రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన బీసీ బిల్లుకు ఓటింగ్ పెట్టకుండా సభ నిబంధనలకు విరుద్ధంగా ఉపసంహరించుకోవడం పట్ల బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బీసీ బిల్లు పాస్ అయ్యే వరకూ పోరాడతామని హెచ్చరించారు. శనివారం బీసీ భవన్‌లో బీసీ సంఘాల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీల కోసం బిల్లు పెడితే పాస్ చేయడానికి ముందుకు రాని కేంద్ర ప్రభుత్వం, అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెడితే ఒకే రోజులో రాజ్యసభ, లోక్‌సభలలో బిల్లు పాస్ చేసిందని గుర్తు చేశారు. బీసీ బిల్లుకు మద్దతుగా రాజ్యసభలో కాంగ్రెస్, డీఎంకే, అన్నాడీఎంకే, సమాజ్‌వాదీ, బీఎస్పీ, ఆర్జేడీ, 3 జనతాదళ్ పార్టీలు, మెజార్టీ బీజేపీ సభ్యులు మద్దతు ఇచ్చారని తెలిపారు. కానీ కేంద్ర మంత్రులు రవిశంకర్, తావర్ చాంద్ గెహ్లాట్ కలిసి బీసీ బిల్లుకు ఓటింగ్ పెట్టకుండా తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ జోక్యం చేసుకొని బీసీ బిల్లును అధికారికంగా ప్రవేశపెట్టాలని కోరారు. గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్ నేతృత్వం వహించిన ఈ సమావేశంలో కోట్ల శ్రీనివాస్, టి.నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 'సమర్థులనే వీసీలుగా నియమించాలి'

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో సమర్థులైన వారినే వైస్ చాన్స్‌లర్లుగా (వీసీ) నియమించాలని విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్ ప్రభుత్వాన్ని కోరారు. అవినీతిపరులు, పైరవీకారులకు అవకాశం ఇవ్వొద్దని పేర్కొన్నారు. కొందరు అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్లు రాజకీయ పలుకుబడితో వీసీలుగా అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారని, వారికి అవకాశమిస్తే వర్సిటీని టోకుగా అమ్ముకుంటారని దయాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సామాజికఅంశాలను ప్రాతిపదికన తీసుకుని నియామకాలు చేపట్టాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు.

## కొత్త మున్సిపల్ చట్టం తొందరపాటు చర్య



పద్మనాభరెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** కొత్త మున్సిపల్ చట్టాన్ని తీసుకొచ్చే విధానం తొందరపాటు చర్య అని, ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా చట్టాన్ని తేవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి జస్టిస్ పద్మనాభరెడ్డి అన్నారు. ఈ చట్టానికి సంబంధించి ముసాయిదా బిల్లు తయారు కాగానే దాన్ని జనబాహుల్యంలో ఉంచి పౌరుల సలహాలు, సూచనలు తీసుకుని వాటిని బిల్లులో పొందుపరిచి చట్టాన్ని తీసుకొస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, స్వచ్ఛంద సేవా సంస్థల సలహాలను పరిశీలించి చట్టాన్ని సవరణ చేయాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మీరు మరిన్ని సేవలు అందించాలి

**చంద్రయాన్–2 ప్రయోగంలో పాల్గొన్న శాస్త్రవేత్త సురేందర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు అభినందనలు**



**సాక్షి,హైదరాబాద్:** చంద్రయాన్–2 అంతరిక్ష ప్రయోగంలో పాల్గొంటున్న శాస్త్రవేత్త వీరబత్తిని సురేందర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు. 'భారతదేశ శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష విజ్ఞానానికి తలమానికంగా నిలిచే చంద్రయాన్ –2 ప్రయోగంలో పాలు పంచుకున్న సిద్దిపేట వాసి, అంతరిక్ష పరిశోధన శాస్త్రవేత్త వీరబత్తిని సురేందర్‌కు మనసారా అభినందనలు. దేశానికి గర్వకారణంగా నిలిచే ఈ ప్రయోగంలో మీరు భాగస్వాములు కావడం మా అందరికీ గర్వకారణం. భారత అంతరిక్ష ప్రయోగ రంగానికి మీరు మరిన్ని సేవలు అందించాలని అందుకు మీకు భగవంతుడు పూర్తి సహకారాన్ని కల్పించాలని ఆకాంక్షిస్తున్నా'అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

## యంగ్ ఉమెన్ ఫార్మర్‌కు అవార్డులు

**సాక్షి, హైదరాబాద్:** చదువుకుని వ్యవసాయం చేస్తున్న యువ మహిళలకు ''యంగ్ ఉమెన్ ఫార్మర్''అవార్డు కోసం గురు కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు ఆహ్వానం పలుకుతోందని ట్రస్ట్ చైర్మన్ కె.వి.వి.రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో మంది యువత బాగా చదువుకుని వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించి ఈ దేశానికి, రాష్ట్రాలకు సేవలను అందిస్తున్నారని, అందులో యువ మహిళలు కూడా ఈ రంగంలో రాణిస్తున్నందున వారిని ప్రోత్సహించి, మరింత మందిని ఈ వృత్తివైపు మరల్చాలన్న లక్ష్యంతో ఈ అవార్డులను వారికి అందివ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేదని, భూమి ఉండి, చదువుకుని వ్యవసాయం చేస్తున్న యువతీ, యువకులను ప్రోత్సహిస్తే వారి చదువు, టెక్నాలజీ ఈ వ్యవసాయానికి ఉపయోగపడి మన రాష్ట్రాలు ఆహారాన్ని ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతాయని అభిప్రాయపడ్డారు. ఆసక్తి ఉండి 35 ఏళ్లలోపు వయసు ఉన్న మహిళలు వారు చేస్తున్న వ్యవసాయ విధానాన్ని తెలుపుతూ, వారి పూర్తి చిరునామా, వివరాలతో గురు కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు, ప్లాట్ నెంబరు 318, ప్లాట్‌నెంబర్ 402, ఐకాన్ కాస్మోస్, మిథిలానగర్, గీతాంజలీ స్కూల్ వద్ద, ప్రగతినగర్, హైదరాబాద్:500090కు లేదా 9848022131ను సంప్రదించాలని సూచించారు.

# అన్ని వ్యవస్థలు విధ్వంసం

- ప్రజల తరఫున గొంతెత్తేందుకు ప్రత్యామ్నాయ పక్షం అవసరం
- కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రశ్నించే గొంతు లేకుండా చేస్తున్నారు
- టీజేఎస్ ప్రథమ ప్లీనరీలో ప్రముఖ సామాజికవేత్త యోగేంద్రయాదవ్

**సాక్షి, హైదరాబాద్:** 'దేశంలో అన్ని వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. అలా జరిగిన చోటే మళ్లీ విశ్వాసం కూడగట్టే ప్రయత్నం జరగాలి. ప్రజా సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వాలు ప్రచారతంత్రాన్ని ఎంచుకుని ముందుకెళ్తున్నాయి. ప్రశ్నించే గొంతు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధుల కొనుగోలు జరుగుతోంది. గోవా, కర్ణాటక, హరియాణాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా బీజేపీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. కేంద్రంలో మోదీ ఏంచేస్తున్నారో... రాష్ట్రంలో కేసీఆర్ అదే చేస్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం' అని ప్రముఖ సామాజిక కార్యకర్త, స్వరాజ్ అభియాన్ పార్టీ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్ అన్నారు. శనివారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన తెలంగాణ జన సమితి ప్రథమ ప్లీనరీకి ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో అంధకారం నెలకొందన్నారు. ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు వరుసగా ఓటమి చెందుతూ నిస్పృహలోకి వెళ్లాయన్నారు. నిరాశ చెందకుండా సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. విధ్వంసం జరిగిన చోటే విశ్వాసాన్ని కూడగట్టాలన్నారు. భారత దేశం విభిన్న సంస్కృతులకు కేంద్రమని, కానీ బీజేపీ ప్రభుత్వం దేశమంతా ఒకే సంస్కృతిని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. సమాజానికి మంచి జరిగే సిద్ధాంతాన్ని రూపొందించాలని, సరికొత్త కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. కోదండరాం జాతీయవాది అని, హరియాణా రాష్ట్రానికి చెందిన తనను టీజేఎస్ ప్లీనరీకి పిలిచి మాట్లాడించడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. తాను హైదరాబాద్ ఎప్పుడొచ్చినా కేశవరావు జాదవ్‌ను కలిసేవాడినన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ గురించి విన్నానని, కానీ తనను కలిసే అవకాశం రాలేదన్నారు.

**సమస్యలపై పోరాటం చేసేవారికే ప్రజల మద్దతు: కోదండరాం**

తెలంగాణ సమాజం ప్రజల సమస్యల కోసం పోరాడే వారికి మద్దతుగా నిలుస్తుందని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. టీజేఎస్ మొదటి ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీజేఎస్ ప్రజల మధ్యలో ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. తాజా ప్లీనరీలో వచ్చే ఏడాది చేపట్టాల్సిన కార్యక్రమాల కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. అమరుల త్యాగాలను, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. వాటిని సాధించేవరకు పోరాటం ఆగదన్నారు.

**ఏడు అంశాలపై తీర్మానాలు**

- తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేయాలని, అమరుల కోసం హైదరాబాద్‌లో స్మృతివనం ఏర్పాటు, తొలి,మలిదశ ఉద్యమకారుల గుర్తింపు, తెలంగాణ చరిత్ర సాహిత్యం, ఆడియో, వీడియో రికార్డులు, ఫొటోలతో లైబ్రరీ ఏర్పాటు, వీటితో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు, అమరుల కుటుంబ సభ్యులకు స్వయం ఉపాధి రంగాల్లో ప్రాధాన్యం
- సమగ్ర వ్యవసాయ విధానం, ప్రత్యేక బడ్జెట్, రైతుల ఆదాయ భద్రత కోసం రైతు కమిషన్, ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక వ్యవసాయ అధికారి నియామకం, ప్రతి నియోజకవర్గానికి ఒక కృషి విజ్ఞాన కేంద్రం, వాస్తవ రైతులకే పెట్టుబడి సాయం.
- ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేయాలి. ప్రతి నిరుద్యోగికి రూ.3,016 భృతి, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, ఉపాధి కల్పనపై ప్రత్యేక కార్యాచరణ
- విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తింపు, కామన్ స్కూల్ విధానం అమలు, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, అన్ని స్కూళ్లను గురుకులాలుగా అప్‌గ్రేడేషన్, విద్యా సంస్థల్లో ఖాళీల భర్తీ, కొత్త పోస్టుల మంజూరు.
- ప్రజలందరికీ ఉచిత వైద్యం, ప్రభుత్వ వైద్య సంస్థల అభివృద్ధి, ఖాళీల భర్తీ. మౌలికవసతుల కల్పన, మందుల కొరత లేకుండా చూడటం, అన్ని రోగాలకు ఉచిత వైద్యం, మందుల పంపిణీ
- పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు, అర్హులందరికీ ఆసరా, ఇళ్లులేని వారికి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు, పక్కాగా అమలు, మహిళా సాధికారత కార్యక్రమాలు, కార్మిక సంక్షేమం, నిర్వాసితుల సంక్షేమం పక్కాగా అమలు.
- టీజేఎస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల ఏర్పాటు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటాలు. దీని కోసం ఉద్యమ కమిటీల ఏర్పాటు.





శనివారం జరిగిన టీజేఎస్ మొదటి ప్లీనరీ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం.. ప్లీనరీలో మాట్లాడుతున్న యోగేంద్ర యాదవ్, సభలో పాల్గొన్న పార్టీ నేతలు

### రెండోసారి టీజేఎస్ అధ్యక్షుడిగా కోదండరాం

తెలంగాణ జనసమితి అధ్యక్షుడిగా (టీజేఎస్) ప్రొఫెసర్ కోదండరాం మరోసారి ఎన్నికయ్యారు. శనివారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఆ పార్టీ ప్లీనరీ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతేడాది టీజేఎస్ పార్టీ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన కోదండరాం.. వరుసగా రెండోసారి కూడా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తాజాగా రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక పూర్తి కావడంతో జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల ఏర్పాటుకు ఆ పార్టీ చర్యలు మొదలుపెట్టింది. నెలరోజుల్లోగా కిందిస్థాయి కమిటీల ఏర్పాటు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోదండరాం పిలుపునిచ్చారు. అధికార టీఆర్‌ఎస్ పార్టీ ఆస్తులు, కాంట్రాక్టు పనులపైనే దృష్టి పెట్టిందని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని గాలికొదిలేసిందని ఆరోపించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పార్టీ విధానాన్ని కార్యవర్గంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, తొందరపడి పొత్తులు పెట్టుకోమని తెలిపారు.

# డీఎస్, టీఆర్‌ఎస్.. దాగుడుమూతలు

- రాజ్యసభ సభ్యుడు డీఎస్ తీరుపై టీఆర్‌ఎస్ అధిష్టానం మల్లగుల్లాలు
- అమిత్ షాతో భేటీ వివరాలపై సీఎం కేసీఆర్ ఆరా
- డీఎస్, బీజేపీతో భేటీ అవుతున్న పార్టీ నేతలపై నజర్
- సస్పెన్షన్ కోసం డీఎస్.. అనర్హత కోసం టీఆర్‌ఎస్ ఎదురుచూపు



**సాక్షి, హైదరాబాద్:** రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్, టీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎత్తుకుపై ఎత్తు వేస్తున్నారు. వారి మధ్య దాగుడుమూతలు కొనసాగుతున్నాయి. ఒకరేమో సస్పెన్షన్ కోరుకుంటుండగా, మరొకరేమో అనర్హత వేటు వేయాలని కాచుకొని ఉన్నారు. ఈ నెల 10న ఢిల్లీలో జరిగిన టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరైన డీఎస్ మరుసటిరోజే బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ కావడంపై టీఆర్‌ఎస్ పలు విధాలుగా ఆరా తీస్తోంది. బీజేపీలో డీఎస్ చేరడం ఖాయమని భావిస్తున్న టీఆర్‌ఎస్.. తనతోపాటు ఎవరెవరిని వెంట తీసుకెళ్లే అవకాశం ఉందనే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే, తనంత తానుగా టీఆర్‌ఎస్‌ను వీడకుండా సస్పెండ్ చేసే వరకు పార్టీలో కొనసాగాలనే వ్యూహాన్ని డీఎస్ అమలు చేస్తున్నట్లు టీఆర్‌ఎస్ అంచనా వేస్తోంది. సస్పెన్షన్ వేటుపడే పక్షంలో తన రాజ్యసభ సభ్యత్వానికి ఎలాంటి ఢోకా ఉండదనే ఆలోచనలో డీఎస్ ఉన్నారు. పార్టీ మారకుండానే బీజేపీకి మద్దతు పలికే పక్షంలో ఎలాంటి వైఖరి అనుసరించాలనే అంశంపై కేసీఆర్ సమాలోచన చేస్తున్నారు.

**పార్టీని వీడే అవకాశమున్నవారిపై నజర్**

ఓ వైపు రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల సన్నాహాలు చురుగ్గా సాగుతుండగా, మరోవైపు నోటిఫికేషన్ వెలువడే నాటికి డీఎస్‌సహా కొందరు టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల కీలకనేతలు తమ పార్టీలో చేరతారంటూ బీజేపీ విస్తృత ప్రచారం చేస్తోంది. బీజేపీ నేతలది 'మైండ్‌గేమ్'గా అని టీఆర్‌ఎస్ అంటూనే, పార్టీని వీడే అవకాశమున్న నాయకులపై ఓ నజర్ వేసినట్లు సమాచారం. గతంలో కాంగ్రెస్ నుంచి టీఆర్‌ఎస్‌లో చేరిన నేతలు ఎవరైనా డీఎస్, బీజేపీ నేతలతో మంతనాలు జరుపుతున్నారా అనే కోణంలోనూ నిఘా పెట్టింది. కాగా, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీతోనూ డీఎస్ భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో డీఎస్ చేరినట్లు వార్తలు వచ్చినా అధికారికంగా ఆయన చేరికను ధ్రువీకరించలేదు.

**పార్టీ వైఖరి తెలుసుకునేందుకే..?**

నిజామాబాద్ మాజీ ఎంపీ, సీఎం కేసీఆర్ కూతురు కవితతో విభేదాలు తలెత్తడం, సీఎంకు ఫిర్యాదు చేయడం, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సీఎంను డీఎస్ సవాల్ చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఏడాదిన్నరగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న డీఎస్ పార్టీ పార్లమెంటరీ సమావేశానికి హాజరై అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే, ఆ సమావేశానికి సంబంధించిన సమాచారం టీఆర్‌ఎస్ ఎంపీలకు చేరవేసే క్రమంలో డీఎస్‌కు కూడా యథాలాపంగా వెళ్లి ఉంటుందని పలువురు ఎంపీలు చెప్తున్నారు.డీఎస్ మాత్రం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తనపై టీఆర్‌ఎస్ వైఖరి ఎలా ఉందో అంచనా వేసుకునేందుకే ఈ భేటీలో పాల్గొన్నట్లు తెలిసింది. డీఎస్ కేవలం 20 నిమిషాలు మాత్రమే తమతో ఉన్నారని, టీ తాగడం మినహా పార్టీ వ్యవహారాలపై ఎలాంటి చర్చ జరపలేదని ఆ పార్టీ ఎంపీ ఒకరు వెల్లడించారు.

# స్వైన్‌ఫ్లూను గుర్తించే పరిస్థితుల్లేవు

- హైకోర్టుకు అమికస్‌క్యూరీ నివేదిక
- స్వైన్‌ఫ్లూ నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలి
- తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు




**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో స్వైన్‌ఫ్లూను గుర్తించే పరిస్థితులు లేవని ఈ వ్యాధిపట్ల అవగాహన ఉన్న డాక్టర్లు కూడా పెద్దగా లేరని సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ప్రైవేటు వైద్యులకు కూడా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రజాహిత వ్యాజ్యంలో ధర్మాసనానికి సహాయకారిగా నియమితులైన అమికస్ క్యూరీగా ఉన్న నిరంజన్ రెడ్డి తన నివేదికలో తెలిపారు. పంజాబ్‌లో గత రెండేళ్లల్లో మలేరియా నివారణకు అమలు చేసిన సూక్ష్మ ప్రణాళిక మాదిరే తెలంగాణలో కూడా చర్యలు తీసుకోవాలని నిరంజన్‌రెడ్డి సూచించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల్ని గుర్తించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా రెండు కేంద్రాలు మాత్రమే ఉన్నాయని అందులో పేర్కొన్నారు. డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ వంటి రోగాలు వస్తే నివారణ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాస్పత్రులు విఫలం అవుతున్నాయని పేర్కొంటూ న్యాయవాది రాపోలు భాస్కర్ రాసిన లేఖను హైకోర్టు సుమోటోగా ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణించి విచారణ చేసింది. అమికస్‌క్యూరీ నివేదికను ఇటీవల పరిశీలించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం పరిశీలించి..దోమల వల్ల స్వైన్‌ఫ్లూ, విషజ్వరాలు, మలేరియా వంటివి వ్యాప్తి కాకుండా ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యల్ని వివరించాలని తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దోమకాటు వ్యాధుల నియంత్రణ సంస్థ, మలేరియా పరిశోధన సంస్థ సంయుక్తంగా జారీ చేసిన మార్గదర్శకాల అమలు ఏవిధంగా ఉందో వివరించాలని కూడా రాష్ట్రాన్ని కోరింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రభుత్వాలు ప్రణాళికల అమలుకు సిద్ధంగా ఉండాలని, ఇప్పుడు కాస్త జాప్యం జరిగిందని, వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలపై వివరాలు అందించాలని ధర్మాసనం కోరింది. వచ్చే నెల 2వ తేదీ నాటికి ప్రభుత్వం వివరాలు అందజేయాలని నోటీసులో కోరింది.

# వరదరాగానే.. ఎత్తిపోసుడే!

- మరో పది రోజుల్లో ఎగువ నుంచి జూరాలకు కృష్ణానదీ ప్రవాహాలు
- కోయిల్‌సాగర్, బీమా, నెట్టెంపాడు పంపులు సిద్ధం చేస్తున్న ఇంజనీర్లు
- వరద నీటిని వచ్చింది వచ్చినట్లుగా ఎత్తిపోసేలా నిర్ణయం
- 3.5 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా సిద్ధం.. 90 టీఎంసీలకు ఆల్మట్టి

**సాక్షి, హైదరాబాద్:** ఎగువ పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో కర్ణాటక ప్రాజెక్టులు నిండుతున్న నేపథ్యంలో దిగువ తెలంగాణ రాష్ట్రం అప్రమత్తమయింది. మరో 10 రోజుల్లోనే దిగువకు ప్రవాహాలు కొనసాగుతాయన్న అంచనాల నేపథ్యంలో జూరాల ప్రాజెక్టుపై ఆధారపడి చేపట్టిన ప్రాజెక్టుల ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లుగా ఒడిసిపట్టే చర్యలను ఆరంభించింది. వరద నీటిని తోడేలా జూరాలపై ఆధారపడ్డ బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పంప్‌హౌజ్‌లను సిద్ధం చేసే పనిలో నీటి పారుదల శాఖ నిమగ్నమైంది. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం)కు అవసరమైన నిధులు సమకూర్చాలని ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాసింది.

**జూన్ 24న కృష్ణమ్మ రాక...**

ప్రస్తుతం ఎగువ మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి ప్రాజెక్టుకు భారీగా నీటి ప్రవాహాలు వస్తున్నాయి. శనివారం ప్రాజెక్టుల్లోకి 1.11 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వ 129 టీఎంసీలకు గానూ 90 టీఎంసీలకు చేరింది. వర్షాలు కొనసాగుతాయన్న జాతీయ వాతావరణ కేంద్రం ప్రకటనల నేపథ్యంలో వరద ఇలాగే మరో పది రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఆల్మట్టిలో మరో 30 టీఎంసీలు చేరితే దిగువ నారాయణపూర్‌కు నీటి విడుదల జరగనుంది. ఇప్పటికే నారాయణపూర్‌లో 37 టీఎంసీలకు గానూ 20 టీఎంసీల నిల్వలున్నాయి. ఇక్కడ మరో 10 నుంచి 12 టీఎంసీల నీరు చేరితే దిగువ జూరాలకు నీటి విడుదల కొనసాగనుంది. ప్రస్తుతం వస్తున్న వరద ఆధారంగా చూస్తే ఈ నెల 21 నాటికి ఎగువ ప్రాజెక్టులు నిండుతాయని, అక్కడి నుంచి నీటి విడుదల జరిగాక 24 నాటికి జూరాలకు కృష్ణా జలాలు చేరే అవకాశం ఉందని నీటి పారుదల వర్గాలు అంటున్నాయి. ఇక తుంగభద్రకు సైతం 27వేల క్యూసెక్కుల వరద వస్తుండటం, అక్కడ నిల్వలు పెరుగుతుండటంతో దిగువ ప్రాజెక్టులకు నీటి ప్రవాహాలపై ఆశలు చిగురిస్తున్నాయి.



కోయిల్‌సాగర్ (ఫైల్)

**పంపులు తిప్పుడే..**

ఇక జూరాలకు వరద వచ్చిన వెంటనే నీటిని బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పంపుల ద్వారా ఎత్తిపోయాలని నిర్ణయించారు. బీమాలోని రెండు స్టేజ్‌ల లిఫ్టు వ్యవస్థల ద్వారా గత ఏడాది 12 టీఎంసీల నీటిని వినియోగించి 1.2 లక్షల ఎకరాలకు నీరందించారు. ఈ ఏడాది 1.7 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా ప్రణాళిక వేశారు. కనీసంగా 180 చెరువులను నింపాలని భావిస్తున్నారు. ఇక నెట్టెంపాడు కింద 2 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, గత ఏడాది 7 టీఎంసీల నీటితో 80 వేల ఎకరాలకు నీరందించారు. ఈ ఏడాది వచ్చే నీటి ఆధారంగా 1.5 లక్షల ఎకరాలకు నీరివ్వాలని, వందకు పైగా చెరువులు నింపాలని నిర్ణయించారు. ఇక కోయిల్‌సాగర్ ద్వారా సైతం 33,000 ఎకరాలకు నీరిచ్చేలా పంపుల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఏజెన్సీల ఓఅండ్‌ఎం గడువు ముగియడంతో కొత్త ఏజెన్సీలకు వాటిని అప్పగించాలని ప్రాజెక్టు అధికారులు భావిస్తున్నారు. వీటికై రూ.25 కోట్లతో ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సైతం పంపినట్లుగా తెలిసింది. వరద వచ్చే నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, వచ్చిన వరదను వచ్చినట్లుగా ఎత్తిపోసి మొత్తంగా దాదాపు 3.5 లక్షల ఎకరాలకు నీటిని సరఫరా చేసేలా పంపులను సిద్ధం చేస్తామని నీటి పారుదల ఇంజనీర్లు పేర్కొన్నారు.

# తేలియాడే వ్యవసాయం

## కష్టాల నుంచి గట్టెక్కేందుకు ఫ్లోటింగ్ వ్యవసాయం బాటపట్టిన మజూలి ద్వీపవాసులు



ఫ్లోటింగ్ వ్యవసాయంలో వరిసాగు

ఏడాది పొడవునా వరదలు. ఎటు చూసినా నీళ్లే. ప్రపంచంలోనే అతిపెద్ద నదీ 'ద్వీప'మది. మరి పంటలు పండేదెలా, కడుపు నిండేదెలా? అస్సాంలో బ్రహ్మపుత్ర నది తీర ప్రాంతంలోని మజూలి ద్వీపవాసులు ఎప్పట్నుంచో ఎదుర్కొంటున్న సమస్య ఇది. ఇప్పుడా సమస్య నీటి మబ్బులా తేలిపోయింది. హైడ్రోపానిక్ వ్యవసాయం అంటే తెలుసు కదా, అపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగిపోతున్న నగరాల్లో ఈ కొత్త తరహా వ్యవసాయం అందుబాటులోకి వచ్చింది. మట్టి అవసరం లేకుండా ఎంచక్కా మన రోజువారీ అవసరానికి తగ్గ కూరలు బాల్కనీల్లోనే పండించుకోవచ్చు. కానీ అది కాస్త ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. మజూలిలో అధికార యంత్రాం గం తమ బుర్రలకు మరింత పదునుపెట్టారు. హైడ్రోపానిక్ వ్యవసాయానికే మరింత మెరుగులు దిద్దారు. ఇంకా సహజపద్ధతుల్లో, తక్కువ ఖర్చుతో, స్థానికంగా దొరికే వనరులతో నీళ్లల్లో తేలియాడే వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నారు. దీంతో ఉపాధికి ఉపాధి, ఆదాయానికి ఆదాయం.

### హైడ్రోపానిక్ సాగు అంటే?

8 అడుగులు పొడవు, 8 అడుగుల వెడల్పులో వెదురు బొంగులతో వ్యవసాయానికి అవసరమయ్యే హైడ్రోపానిక్ ట్రేని రూపొందించి అందులో విత్తనాలు వేస్తారు. మట్టిలో ఉండే పోషకాలన్నీ ఆ నీటిలో కలుపుతారు. మొక్కలు ఎదగడానికి వర్మీ కంపోజ్డ్ నీళ్లను జల్లుతారు. ట్రేలన్నీ వెదురుబొంగులతో చేసినవి కావడంతో అవి నీళ్లలో తేలుతూ ఉంటాయి. వరదలు ముంచెత్తినా పంట నీటిపాలవుతుందన్న భయం లేదు. 'మాకున్న కాస్తో కూస్తో వ్యవసాయ భూమి నీళ్లల్లో మునిగిపోయింది. ఏం చేయాలో తెలీని స్థితి. అప్పుడే ఫ్లోటింగ్ వ్యవసాయం గురించి తెలిసింది. వర్షాలు కురిస్తే పంటలు నీట మునుగుతాయన్న బాధ లేదు. ఆ ట్రేలన్నీ హాయిగా నీళ్లల్లో తేలుతూ పచ్చగా కనువిందు చేస్తుంటాయి. ఇక మా బతుకులూ పచ్చగానే ఉన్నాయి' అని పవిత్ర హజారికా అనే రైతు చెప్పారు.

### ఎందుకీ అవసరం వచ్చింది?

బ్రహ్మపుత్ర నదీ తీర ప్రాంతంలో ఉన్న మజూలిలో భూ ప్రాంతం ఏడాదికేడాది నీళ్లల్లో కలిసిపోతోంది. 1250 చదరపు కి.మీ.లు ఉన్న ఈ ప్రాంతంలో 75శాతం భూమిని నీరు ఆక్రమించేసింది. దీంతో అక్కడ నివాసం ఉండే 2 లక్షల మంది స్థానికుల భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. 2016లో స్థానిక అధికారులు అక్కడ రైతులకు ఈ హైడ్రోపానిక్ వ్యవసాయాన్ని పరిచయం చేశారు. మొదట్లో రైతులకు ఈ వ్యవసాయమేంటో అర్థం కాలేదు. మట్టి లేకుండా మొక్కలు ఎలా పెరుగుతాయా? అని ఆశ్చర్యపోయారు. కానీ అవసరం వాళ్లకి అన్నీ నేర్పించింది. 'ఈ పద్ధతుల్ని అవగాహన చేసుకోవడానికి రైతులకు కొన్నాళ్లు పట్టింది. ప్రస్తుతం 620 మందిపైగా రైతులు 528 హైడ్రోపానిక్ ట్రేలలో వ్యవసాయం చేస్తున్నారు. వరి, బంగాళాదుంపలు, కంద, కూరగాయలు, మూలికలు, మిరప, కొత్తిమీర, పుదీనా, కేబేజీ పంటలు పండిస్తున్నారు.



వెదురుకర్రల ట్రేలో సాగు

### రైతులకు కాసుల పంట..

సంప్రదాయ వ్యవసాయంతో పోల్చి చూస్తే 3.58 రెట్లు అధికంగా లాభాలు వస్తున్నాయి. మొత్తం 10 ట్రేలలో 25 కేజీల వరకు పంట వస్తుంది. కూరగాయలు, ఆకుకూరల పంటలకు 2,500 రూపాయలు ఖర్చు అయితే 5 వేలవరకు తిరిగి వస్తుంది. అదే మూలికలు పెంచితే రూ.40 వేల వరకు ఆదాయం వస్తుందని ఈ ఫ్లోటింగ్ వ్యవసాయానికి మద్దతునిస్తున్న సౌత్ ఏషియా ఫోరమ్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ చైర్‌పర్సన్ దీపాయన్ దేవ్ చెప్పారు. రాష్ట్ర సీఎం సోనోవాల్ సొంత నియోజకవర్గం మజూలీ కావడంతో ఇక్కడ ఈ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. త్వరలోనే ఈ జిల్లా కాలుష్యరహిత జిల్లాగా మారనుంది.

# రేపే 'విశ్వాసం' పెట్టండి!

- సీఎం కుమారస్వామిని డిమాండ్ చేసిన కర్ణాటక బీజేపీ చీఫ్ యడ్యూరప్ప
- రెబెల్ ఎమ్మెల్యే నాగరాజ్‌తో కాంగ్రెస్ ముఖ్యనేతల భేటీ
- సుప్రీంకోర్టుకు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు

**బెంగళూరు/న్యూఢిల్లీ:** కర్ణాటక అసెంబ్లీలో బుధవారం బలపరీక్ష నిర్వహించాలని సీఎం కుమారస్వామి ప్రతిపాదించడంతో ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్–జేడీఎస్ నేతలు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. రెబెల్ ఎమ్మెల్యే ఎంటీబీ నాగరాజ్ ఇంటికి శనివారం వెళ్లిన కాంగ్రెస్ సీనియర్ నేత శివకుమార్, రాజీనామాను వెనక్కు తీసుకునేలా ఆయన్ను ఒప్పించారు. దీంతో కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వం బలం పుంజుకోకుండా బీజేపీ నేతలు అప్రమత్తమయ్యారు. కర్ణాటక సీఎం తన బలాన్ని అసెంబ్లీలో సోమవారం నిరూపించుకోవాలని రాష్ట్ర బీజేపీ చీఫ్ యడ్యూరప్ప డిమాండ్ చేశారు. బెంగళూరులో శనివారం యడ్యూరప్ప మీడియాతో మాట్లాడారు. 'సీఎం స్వయంగా సోమవారం విశ్వాస తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టాలి. సోమవారం జరగబోయే బీఏసీ సమావేశంలో ఈ మేరకు మేం సీఎంకు సూచిస్తాం. సీఎం పదవికి రాజీనామా చేసి కొత్త ప్రభుత్వానికి పరిపాలన బాధ్యతలు అప్పగించడం ఆయనకే మంచిది' అని తెలిపారు. కాంగ్రెస్–జేడీఎస్ కూటమి నుంచి ఎమ్మెల్యేల వలసలను ఆపేందుకే కుమారస్వామి 'విశ్వాసపరీక్ష' పేరుతో కొత్త కుట్రకు తెరలేపారని ఆరోపించారు. దమ్ముంటే సీఎం విశ్వాసపరీక్ష కోరాలనీ, ప్రస్తుతం పరిస్థితి తమకే అనుకూలంగా ఉందని చెప్పారు.

### స్పీకర్‌కు స్వతంత్ర ఎమ్మెల్యేల లేఖ..

కాంగ్రెస్–జేడీఎస్ సర్కారుకు మద్దతు ఉపసంహరించుకున్న ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు హెచ్.నగేశ్, ఆర్.శంకర్ శనివారం స్పీకర్ రమేశ్ కుమార్‌కు వేర్వేరుగా లేఖలు రాశారు. శాసనసభలో ప్రతిపక్షం(బీజేపీ)వైపు తమ స్థానాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రారంభమైన కర్ణాటక అసెంబ్లీ వర్షకాల సమావేశాలు జూలై 26 వరకూ కొనసాగనున్నాయి. కుమారస్వామి కేబినెట్‌లో నగేశ్ చిన్నతరహా పరిశ్రమల మంత్రిగా, శంకర్‌ల మున్సిపల్ శాఖ మంత్రిగా ఇటీవల నియమితులయ్యారు. కానీ అనూహ్యంగా ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకున్నారు. ఒకవేళ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు ముందుకొస్తే మద్దతిస్తామని ప్రకటించారు.



బెంగళూరులో రిసార్ట్‌లో ఎమ్మెల్యేలతో కలసి భోజనం చేస్తున్న యడ్యూరప్ప

### మా పిటిషన్లను కలిపి విచారించండి

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకకు చెందిన మరో ఐదుగురు రెబెల్ ఎమ్మెల్యేలు శనివారం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ తమ రాజీనామాలను కావాలనే ఆమోదించడం లేదని ఎమ్మెల్యేలు ఆనంద్ సింగ్, కె.సుధాకర్, ఎన్.నాగరాజ్, మునిరత్న, రోషన్‌బేగ్‌లు ఆరోపించారు. గతంలో 10 మంది రెబెల్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్‌తో తమ పిటిషన్‌ను కలిపి విచారించాలని కోర్టును కోరారు. 10 మంది ఎమ్మెల్యేల రాజీనామాలు, అనర్హత విషయంలో జూలై 16 వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని స్పీకర్‌ను కోర్టు ఇప్పటికే ఆదేశించింది.

### అనర్హతపై నిర్ణయం రిజర్వు: స్పీకర్

కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన రెబెల్ ఎమ్మెల్యేలు రమేశ్ జార్కిహోళి, మహేశ్ కుమటళ్లిపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ ఈ ఏడాది ఫిబ్రవరి 11న కోరిందని స్పీకర్ తెలిపారు. దీనిపై పలుమార్లు విచారణ జరిపామనీ, చివరికి నిర్ణయాన్ని రిజర్వులో ఉంచినట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో రమేశ్ కుమార్ ఈ విషయాన్ని ప్రస్తావించారు.

## ఆపరేషన్ 'నాగరాజ్' సఫలం



బెంగళూరులో సిద్ధరామయ్యను కలిసి వెళ్తున్న కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యే నాగరాజ్

ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు సొంత పార్టీకి చెందిన రెబెల్ ఎమ్మెల్యే నాగరాజ్‌ను తమవైపునకు తిప్పుకున్నారు. బెంగళూరులోని నాగరాజ్ నివాసానికి చేరుకున్న కాంగ్రెస్ మంత్రి శివకుమార్ ఆయనతో చర్చలు జరిపారు. రాజీనామాను వెనక్కు తీసుకుని పార్టీలోకి రావాలని కోరారు. ఈ సందర్భంగా నాగరాజ్ ఇంటికొచ్చిన డిప్యూటీ సీఎం పరమేశ్వర, రాజీనామాను వెనక్కు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మెత్తబడ్డ నాగరాజ్ రాజీనామాను వెనక్కు తీసుకునేందుకు చూచాయగా అంగీకరించారు. తర్వాత నాగరాజ్ మీడియాతో మాట్లాడారు. 'నా రాజీనామాను వెనక్కు తీసుకోవాలని సిద్దరామయ్య, దినేశ్‌గూండూరావులు ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకోవడానికి కొంత టైం అడిగా. చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే సుధాకర్‌తో మాట్లాడి ఆయన్ను కూడా రాజీనామా ఉపసంహరించుకునేలా ప్రయత్నిస్తానని చెప్పా' అని తెలిపారు. మరోవైపు రమడా రిసార్టులో బసచేసిన బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి యడ్యూరప్ప భోజనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెబెల్ ఎమ్మెల్యే నాగరాజ్ వెనక్కి వెళ్లబోరని తాను భావిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే రామలింగారెడ్డితో బీజేపీ ఎమ్మెల్యే విశ్వనాథ్, బెంగళూరు కార్పొరేటర్ పద్మనాభ రెడ్డి శనివారం భేటీ అయ్యారు. దీనిపై స్పందించేందుకు రామలింగారెడ్డి నిరాకరించారు.

## ఫిరాయింపులపై చర్యలేవి?

- నిర్వీర్యమవుతున్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం
- దేశంలో ఇప్పటివరకూ ఒక్క నేతకూ శిక్షపడని వైనం

కర్ణాటక, గోవాల్లో తలెత్తిన రాజకీయ సంక్షోభాలను నివారించేందుకు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఆయుధంగా వాడుకోవడానికి రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఈ చట్టాన్ని 1985లో నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ తీసుకొచ్చారు. ఈ చట్టం కింద ఒక్క ప్రజాప్రతినిధికి శిక్ష పడకపోవడం గమనార్హం.

### స్పీకర్ పాత్రే కీలకం..

1985లో వచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రచారం ఏ ప్రజాప్రతినిధి అయినా తమ పార్టీ విప్‌ను పాటించకపోయినా, స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేసినా అతను/ఆమె అనర్హులవుతారు. అయితే ఈ చట్టం ప్రజాస్వామ్య మౌలిక స్వరూపాన్ని దెబ్బతీస్తోందన్న వాదన కూడా ఉంది. ఎందుకంటే చాలా రాజకీయ పార్టీలు అంతర్గత విభేదాలను అణచివేయడానికి ఈ చట్టాన్ని ఓ ఆయుధంగా వాడుతున్నాయి. ఫిరాయింపుల నిరోధక చట్టం అమలులో స్పీకర్ పాత్రే కీలకం. స్పీకర్ ఈ విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే ఈ చట్టం ఉద్దేశమే నీరుగారిపోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 23 మంది వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అధికార పార్టీ కొనుగోలు చేసింది. వీరిలో నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టింది. ఈ సందర్భంగా ఫిరాయింపుదారులపై వేటేయాలని వైఎస్సార్‌కాంగ్రెస్ విజ్ఞప్తి చేసినప్పటికీ అప్పటి స్పీకర్ పట్టించుకోకపోవడాన్ని నిపుణులు గుర్తుచేస్తున్నారు. స్పీకర్ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నిష్ప్రయోజనమవుతుందని చెబుతున్నారు.



శనివారం షిర్డి సన్నిధిలో కర్ణాటక రెబెల్ ఎమ్మెల్యేలు

## బీజేపీలోకి 107 మంది ఎమ్మెల్యేలు

### బెంగాల్ బీజేపీ నేత ముకుల్ రాయ్ సంచలన వ్యాఖ్య

**కోల్‌కతా:** బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), కాంగ్రెస్, సీపీఎంలకు చెందిన 107 మంది ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ నేత ముకుల్ రాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని పలువురు టీఎంసీ నేతలు మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీపై నమ్మకాన్ని కోల్పోయారని, ఆ పార్టీ విధానాలతో వారు విసుగుచెందారని శనివారం ఆయన విలేకరులకు తెలిపారు. పలువురు టీఎంసీ కౌన్సిలర్లు బీజేపీలోకి వచ్చి, వెంటనే తిరిగి టీఎంసీలోకి వెళ్లిపోయిన నేపథ్యంలో ముకుల్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్, సీపీఎంల నుంచి ఒక్కొక్కరు చొప్పున బీజేపీలో చేరారు.

## బీజేపీ ప్రధానకార్యదర్శిగా తప్పుకున్న లాల్



**న్యూఢిల్లీ:** బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) పదవి నుంచి సీనియర్ నేత రామ్‌లాల్ తప్పుకున్నారు. వెంటనే ఆయన్ను అఖిల భారతీయ సహ సంపర్క్ ప్రముఖ్‌గా నియమిస్తూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) నిర్ణయం తీసుకుంది. బీజేపీలో రెండో అత్యున్నత పదవైన జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో రామ్‌లాల్ 2006 నుంచి 2019 వరకూ పనిచేశారు. కాగా, రామ్‌లాల్ స్థానంలో బీజేపీ సంయుక్త ప్రధాన కార్యదర్శి వి.సతీశ్ నియమితులయ్యే అవకాశముందని సమాచారం. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) పదవిని సాధారణంగా ఆరెస్సెస్ నుంచి వచ్చిన నేతలకు ఇస్తుంటారు.

## తమిళనాడులో ఉగ్రముఠా పట్టివేత

### కొనసాగుతున్న ఎన్‌ఐఏ బృందం విచారణ

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** భారత్‌లో ఇస్లామిక్ రాజ్యస్థాపన కోసం ఉగ్రదాడులకు పథకంవేసిన ఓ ముఠాను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) శనివారం చెన్నైలో పట్టుకుంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం జరిపేందుకు ఈ ముగ్గురు అనుమానితులు 'టెర్రరిస్ట్ గ్యాంగ్ అన్సరుల్లా' అనే సంస్థను ఏర్పాటు చేశారని ఎన్‌ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌లో ఇస్లామిక్ రాజ్య స్థాపన కోసం వీరు మరికొందరితో కలిసి నిధులు సేకరణ, దేశంలో దాడులకు ప్రయత్నాలు చేస్తున్నారు' అని తెలిపింది. ఈ ముగ్గురికి చెందిన చెన్నై, నాగపట్టణంలోని నివాసాల్లో జరిపిన సోదాల్లో 9 సెల్‌ఫోన్లు, 15 సిమ్ కార్డులు, 7 మెమొరీ కార్డులు, 3 ల్యాప్‌టాప్‌లు, 5 హార్డ్ డిస్కులు, 6 పెన్ డ్రైవ్‌లు, 2 టాబ్లెట్ పీసీలు, 3 సీడీలు, పలు పత్రాలు, పత్రికలు, పుస్తకాలు, పోస్టర్లు, ప్రకటనలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ముగ్గురినీ ప్రస్తుతం విచారిస్తున్నట్లు వెల్లడించింది.

## మన భూభాగంలోకి చైనా సైన్యం రాలేదు



**న్యూఢిల్లీ:** లడఖ్‌లో సరిహద్దులు దాటి చైనా సైన్యం చొచ్చుకువచ్చిందన్న వార్తలపై ఆర్మీ చీఫ్ జనరల్ ప్రదీప్ రావత్ స్పందించారు. ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక గురువు దలై లామా 84వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీన కొందరు టిబెటన్లు లడఖ్‌లోని డెమ్‌చోక్ సెక్టార్‌లో ఉత్సవాలు జరుపుకున్నారని, ఆ సందర్భంగా వారు టిబెటన్ పతాకాలను ఎగురవేశారని తెలిపారు. ఆ సమయంలో భారత్ భూభాగంలోని వాస్తవ నియంత్రణ రేఖను దాటేందుకు యత్నించిన చైనా సైనికులను తాము అడ్డుకున్నామన్నారు. దీంతో వారు అక్కడ జరుగుతున్న ఉత్సవాలను గమనించి, అర్థగంట తర్వాత వెనక్కి వెళ్లిపోయారన్నారు. అంతేతప్ప, చైనీయులు ఎటువంటి ఆక్రమణకు పాల్పడలేదన్నారు. పాకిస్తాన్ సైన్యం ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా గట్టిగా బదులిస్తామని, ఉగ్ర చర్యలకు పాల్పడితే శిక్ష తప్పదని జనరల్ బిపిన్ రావత్ అన్నారు. 'కార్గిల్ యుద్ధానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వేతర శక్తులు బలపడి ఉగ్ర చర్యలకు పాల్పడుతుండటం కొత్త పరిణామం అని అన్నారు.



నేపాల్‌లో ఖాట్మండూలో చిన్నారితో కలసి వరదనీటిని దాటుతున్న స్థానికుడు

## ఈశాన్యంలో వరదలు

### 16 మంది మృతి

**గువాహటి:** ఈశాన్యరాష్ట్రాలు భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమవుతున్నాయి. వరదలు, కొండచెరియలు విరిగిపడిన ఘటనల్లో అరుణాచల్, అస్సాం, మేఘాలయ, మిజోరం రాష్ట్రాల్లో 16 మంది చనిపోయారు. అస్సాంలోని 21 జిల్లాల్లోని 8.7 లక్షల మంది ప్రజలపై వరదల ప్రభావం పడింది. శనివారం నాటికి రాష్ట్రంలో మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. బ్రహ్మపుత్ర నది పొంగి ప్రవహిస్తోంది. 2,168 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా 51 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. లుండింగ్–బాదర్‌పూర్ పర్వత ప్రాంత రైల్వే లైను దెబ్బతినడంతో ఆ మార్గంలో రైళ్లు రద్దయ్యాయి. అస్సాం ప్రజలకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని హోం మంత్రి అమిత్ షా తెలిపారు. శనివారం ఆయన సీఎం సోనోవాల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నీటమునిగిన కజిరంగ నేషనల్ పార్క్ సమీపంలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో సాయపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, వరదల్లో మేఘాలయలో ఐదుగురు, అరుణాచల్ ప్రదేశ్, మిజోరంలలో ఇద్దరు చొప్పున మృతి చెందారు.

## సోమాలియాలో ఉగ్రదాడి

### 26 మంది మృతి

**మొగదిషు:** దక్షిణ సోమాలియాలోని సరిహద్దు పట్టణం కిస్మాయోలో జరిగిన ఉగ్ర దాడిలో 26 మంది చనిపోగా 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక మెదినా హోటల్‌లోకి సైనిక దుస్తులు ధరించిన కొందరు ఉగ్రవాదులు యథేచ్ఛగా కాల్పులు జరుపుతూ ప్రవేశించారు. అదే సమయంలో పేలుడు పదార్థాలతో కూడిన వాహనంపై మరో ఉగ్రవాది ప్రవేశించి తనను తాను పేల్చేసుకున్నాడు. అప్రమత్తమైన భద్రతా బలగాలు ఉగ్రవాదులతో తలపడ్డాయి. ఇరువర్గాల మధ్య కాల్పులు 12 గంటలపాటు కొనసాగాయి. ఈ కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు సహా కెన్యా, టాంజానియా, అమెరికా, బ్రిటన్, కెనడా దేశాలకు చెందిన పౌరులు కలిపి మొత్తం 26 మంది చనిపోయారని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు చైనీయులు కూడా గాయపడ్డారన్నారు.



దాడిలో ధ్వంసమైన హోటల్

పేలుడు ధాటికి హోటల్ భవనం ధ్వంసమయ్యింది. ఈ దుశ్చర్యకు తామే కారణమని అల్ షబాబ్ ప్రకటించుకుంది. సోమాలియా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అల్‌ఖైదా అనుబంధ ఉగ్ర సంస్థ అల్ షబాబ్ దశాబ్ద కాలంగా విధ్వంసక చర్యలకు పాల్పడుతోంది.

## తప్పదనుకుంటేనే కేసు వాయిదా

### రాష్ట్రపతి కోవింద్ హితవు



జడ్జి తహిళ్‌రమణికి గౌరవడాక్టరేట్ ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** న్యాయస్థానాల్లో కేసు విచారణ తప్పదనుకుంటేనే వాయిదా వేయాలని, వాయిదాలతో కక్షిదారుని ఖర్చు పెంచరాదని రాష్ట్రపతి కోవింద్ హితవు పలికారు. చెన్నైలోని తమిళనాడు డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్సిటీలో ప్రత్యేక కార్యక్రమంలో మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ తహిళ్‌రమణి సహా ముగ్గురు జడ్జిలకు కోవింద్ గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కోవింద్ మాట్లాడారు. 'దేశంలో న్యాయవిధానం ఎంతో ఖర్చు, జాప్యానికి కారణం అవుతుందనే విమర్శలున్నాయి. వాయిదా అనే విధానం తప్పనిసరి పరిస్థితుల్లోగాక కేసు విచారణను జాప్యం చేసేందుకు వినియోగిస్తున్నారు. దీంతో న్యాయం కోసం ఎదురుచూసేవారు అధికమొత్తాదులో ఖర్చు చేయాల్సి వస్తోంది. న్యాయస్థానాలు ధనికుల పట్ల ఒక విధంగా, పేదల పట్ల మరో విధంగా వ్యవహరిస్తే న్యాయశాస్త్రం పరిహాసంగా మారిపోగలదు. న్యాయశాఖ పరిధిలో పనిచేసే జడ్జీలు, లాయర్లు, అధికారులు, లా అధ్యాపకులు ఎవరైనాగానీ చట్టానికి అనుగుణంగా పాలన జరపడంలో వారు ప్రధాన భాధ్యులని గుర్తించాలి' అని అన్నారు.

## గోవా మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ

- బీజేపీలో చేరిన ముగ్గురికి పదవులు

**పణజి:** గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ శనివారం మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఇందులో భాగంగా కేబినెట్‌లో ఉన్న గోవా ఫార్వర్డ్ పార్టీ(జీఎఫ్‌పీ)కి చెందిన ముగ్గురు, స్వతంత్ర అభ్యర్థి ఒకరికి ఉద్వాసన పలికారు. వీరి స్థానంలో ఇటీవల కాషాయ కండువా కప్పుకున్న కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేల్లో ముగ్గురికి పదవులు దక్కాయి. శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మృదులా సిన్హా.. చంద్రకాంత్ కవ్లేకర్, జెన్నిఫర్ మొన్సరెట్, ఫిలిప్ నెరి రొడ్రిగ్స్‌తోపాటు బీజేపీకి చెందిన మైఖేల్ లోబోతో ప్రమాణం చేయించారు. 2017 ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం బీజేపీకి లేని సమయంలో మనోహర్ పారికర్ ప్రభుత్వం ఏర్పాటులో జీఎఫ్‌పీ కీలకంగా నిలిచింది.



పణజి ఎయిర్‌పోర్ట్‌కొచ్చిన సీఎం సావంత్

### బీజేపీపై జీఎఫ్‌పీ విమర్శలు

కేబినెట్ నుంచి తమను తప్పించడం ద్వారా బీజేపీ మోసానికి పాల్పడిందని జీఎఫ్‌పీ అధ్యక్షుడు, మంత్రివర్గం నుంచి వైదొలగిన డిప్యూటీ సీఎం విజయ్ సర్దేశాయ్ ఆరోపించారు. ఆయన శనివారం దివంగత సీఎం మనోహర్ పారికర్ మెమోరియల్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. 'పారికర్ రెండుసార్లు చనిపోయారు. భౌతికంగా మార్చి 17వ తేదీన ఒకసారి, రాజకీయ సిద్ధాంతాలను చంపడం ద్వారా నేడు మరోసారి' అని వ్యాఖ్యానించారు. కాగా, జీఎఫ్‌పీ విమర్శలను సీఎం తోసిపుచ్చారు.

## అక్రమ వలసదార్ల అరెస్టులు షురూ

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్

**వాషింగ్టన్:** దేశంలో వలసదార్లను పెద్ద సంఖ్యలో ఏరివేసేందుకు, వారిని దేశ బహిష్కారం చేసేందుకు అమెరికా సర్వసన్నద్ధమైంది. అక్రమ వలసదార్లను ఆదివారం నుంచి అరెస్టు చేయనున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ చేశారు. లక్షలాది అక్రమ వలసదార్లను అరెస్టు చేసేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. తగిన ఉత్తర్వులతో వారిని దేశ బహిష్కారం చేయనున్నట్టు ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ యాక్టింగ్ డైరెక్టర్ మాథ్యూ అల్బెన్స్ తెలిపారు. అరెస్టులు కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాబోవని, కేసుల దర్యాప్తును అనుసరించి అధికారులు ఎక్కడికంటే అక్కడికి పోతారని ఆయన చెప్పారు. అరెస్టు చేసిన వారిని వారి వారి దేశాలకు పంపుతామని, నేరాలకు పాల్పడిన వారిని ఇక్కడ లేదా వారి దేశాల్లోని జైళ్లకు పంపుతామని ట్రంప్ ప్రకటించారు. అధికారులు అందిస్తున్న వివరాల ప్రకారం – 2000 మందిని లక్ష్యంగా చేసుకుని సోదాలు నిర్వహించనున్నారు. గతంలో జరిగిన దాడులను బట్టి ఇప్పుడు కనీసం 200 మందిని అరెస్టు చేయవచ్చునని భావిస్తున్నారు. ట్రంప్ సర్కారు నిర్ణయాలు అగ్రరాజ్యంలో తీవ్ర రాజకీయ చర్చకు దారితీశాయి. ప్రభుత్వ చర్యలు అమానవీయమైనవంటూ డెమోక్రాట్లు విమర్శలు చేస్తున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. మధ్య అమెరికా నుంచి ఇంతకు ముందెన్నడూ లేనంత మంది ప్రజలు ఇటీవల యూఎస్ సరిహద్దులకు చేరుకున్న విషయం తెలిసిందే. వీరిలో పలువురు ఇమ్మిగ్రేషన్ కోర్టు కేసులను ఎదుర్కొంటున్నారు. 2016లో బరాక్ ఒబామా హయాంలోను, 2017లో ట్రంప్ హయాంలోను అక్రమ వలసదార్లపై ఇదే తరహా ఆపరేషన్ నిర్వహించారు.



## ఫేస్‌బుక్‌కు రూ.34 వేల కోట్ల జరిమానా!

### సిద్ధమవుతోన్న ఎఫ్‌టీసీ

**వాషింగ్టన్:** వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని లీక్ చేసిందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫేస్‌బుక్‌కు అమెరికా నియంత్రణ సంస్థలు భారీ జరిమానా విధించనున్నాయి. సోషల్ నెట్‌వర్క్‌ల గోప్యత, సమాచార రక్షణలో లోపాలు వంటి కారణాలకు గానూ ఫేస్‌బుక్‌పై జరిమానా విధించేందుకు ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) సిద్ధమవుతోంది. దర్యాప్తు సెటిల్‌మెంట్‌లో భాగంగా ఎఫ్‌టీసీ ఫేస్‌బుక్‌పై రూ.34,280 కోట్ల (5 బిలియన్ డాలర్లు) జరిమానా విధించనుంది. దీనికి సంబంధించిన వివరాలను వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ కథనంలో ప్రచురించింది. వ్యక్తిగత భద్రతా వైఫల్యాలకు ఓ సంస్థపై ఎఫ్‌టీసీ ఇంత భారీజరిమానా విధించడం ఇదే తొలిసారి. దీనికి అమెరికా న్యాయశాఖ ఇంకా ఆమోదించలేదు. సెటిల్‌మెంట్‌లో భాగంగా వినియోగదారుల వ్యక్తిగత భద్రతకు సంబంధించి ఫేస్‌బుక్‌కు కొన్ని కఠిన ఆంక్షలు విధించనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. వినియోగదారుల వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు 2011లో ఎఫ్‌టీసీ ఫేస్‌బుక్‌తో ప్రైవసీ సెటిల్‌మెంట్ చేసుకుంది. దీని ప్రకారం వినియోగదారుల సమాచారాన్ని తమ వ్యాపార భాగస్వామ్య సంస్థలకు అందించేటప్పుడు కొన్ని నియమాలు పాటించాలి. అలా చేయని పక్షంలో జరిమానా విధించే హక్కు ఉంటుంది.

# నవ్యాంధ్రలో 'నవ'శకం

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి



రాజకీయ పార్టీలకూ, రాజకీయ నాయకులకూ విశ్వసనీయతే ప్రాణం. అన్న మాటకు కట్టుబడి ఉండే నాయకులను ప్రజలు ఆరాధిస్తారు. మాటలకూ, చేతలకూ పొంతనలేని నాయకులను తిరస్కరిస్తారు. ఇది అత్యంత సరళమైన విషయం. ప్రజల కళ్ళు కప్పవచ్చుననీ, వారిని మభ్యపెట్టవచ్చుననీ, ప్రచార బలంతో నమ్మించవచ్చుననీ నాయకులు అనుకుంటే భంగపాటు తప్పదు. శుక్రవారంనాడు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అసెంబ్లీలో సమర్పించిన 2019–20 బడ్జెట్ ప్రతిపాదనలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికను నిజాయతీగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నదని సూచిస్తున్నాయి. ప్రభుత్వ ప్రాథమ్యాలను ఈ బడ్జెట్ వెల్లడిస్తుంది. ప్రభుత్వ భావజాలానికి ప్రతీకగా నిలుస్తుంది. జగన్ మోహన్‌రెడ్డి కనీవినీ ఎరుగని ఆధిక్యంతో ఎన్నికలలో విజయం సాధించడానికి ఒకానొక చారిత్రక నేపథ్యం ఉన్నది. దాదాపు పదేళ్ళపాటు కఠోర పరిశ్రమ, ప్రజలే కేంద్రంగా సాగిన ప్రజాసంకల్పయాత్ర, నవరత్నాలూ, బీసీ డిక్లరేషన్ వగైరా కార్యక్రమాలన్నీ వైఎస్‌ఆర్‌సీపీకి పేదల గుండెల్లో సుస్థిరమైన స్థానం కల్పించాయి.

రాజన్న రాజ్యం రూపంలో సంక్షేమ రాజ్యం నెలకొల్పుతానంటూ జగన్ మోహన్‌రెడ్డి బహిరంగసభలలో వాగ్దానం చేశారు. బడుగు బలహీన వర్గాలకు ఇతోధికంగా నిధులు కేటాయించాలనీ, వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనీ సంకల్పం చెప్పుకున్నారు. పాదయాత్రలో కోటిమందికిపైగా సాధారణ ప్రజలను కలుసుకొని వారి బాధలగాథలు ఆలకించి, ఆకళింపు చేసుకున్నట్టు బడ్జెట్ కేటాయింపులు చెబుతున్నాయి. కల్లబొల్లి కబుర్లు చెప్పకుండా చేసేది చెప్పడం, చెప్పిందే చేయడం అనే ధర్మాన్ని ప్రభుత్వాలు పాటిస్తే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాయి. ఆ బాటలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయాణిస్తున్నట్టు బడ్జెట్ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, బడ్జెట్ కేటాయింపులు వేరు, వాస్తవంగా ఖర్చు చేయడం వేరు. ఊహించిన ఆదాయం అందకపోయినా, ప్రభుత్వాల ప్రాథమ్యక్రమం మారిపోయినా కేటాయింపులు ఘనంగా ఉంటాయి కానీ నిధులు విడుదల కావు. బాధ్యతాయుతమైన రాజకీయ నేతలూ, పార్టీలూ ఎన్నికల ప్రచారంలో వినియోగించిన ప్రణాళికకు కట్టుబడి పరిపాలన సాగించాలని ప్రయత్నిస్తారు. వైఎస్‌ఆర్‌సీపీ సర్వసభ్య సమావేశం (ప్లీనరీ)లో ప్రకటించిన నవరత్నాలనూ, బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన అంశాలనూ సంపూర్ణంగా అమలు చేయాలనే పట్టుదల ప్రభుత్వానికి దండిగా ఉన్నట్టు బుగ్గన బడ్జెట్ స్పష్టం చేస్తున్నది.

## సామాజికస్పృహ

బుగ్గన బడ్జెట్ ప్రతిపాదనలలో సామాజిక సమతౌల్యం సాధించే ప్రయత్నం కనిపిస్తున్నది. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వర్గాలకు చేయూతనిచ్చి ఆ వర్గాలను వేగంగా ముందుకు నడిపించాలనే తాపత్రయం ఉన్నది. వివిధ వర్గాల సంక్షేమానికి ఏమేమి చేయాలని సంకల్పించారో పాదయాత్ర సందర్భంగా బహిరంగ సభలలో జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ప్రకటించిన అంశాలన్నింటినీ క్రమంగా, వేగంగా అమలు చేస్తూ వస్తున్నారు. వివిధ వర్గాలకు చెందిన ప్రజలను కలుసుకోవడం వల్ల, మాట్లాడటం వల్ల సమాజంలో ఎంతటి వైవిధ్యం ఉన్నదో, సమస్యల స్వభావం ఏమిటో, వందకుపైగా ఉన్న వెనుకబడిన కులాలవారికి మేలు చేయడం ఎలాగో ఒక స్పష్టమైన అవగాహన కలిగింది. మనసులో ఒక సామాజికన్యాయం సాధించేందుకు అనుసరించవలసిన వ్యూహం రూపు దిద్దుకొని ఉంటుంది. దాని ప్రభావం టిక్కెట్ల పంపిణీపైన ఉంది. ఆ తర్వాత మంత్రివర్గ నిర్మాణంలోనూ ఉంది. ఆ వ్యూహం ప్రాతిపదికగానే ప్రాథమ్యాలు నిర్ణయించుకొని ఉంటారు. అదే పద్ధతిలో బడ్జెట్ రూపకల్పన జరిగినట్టు కనిపిస్తున్నది.

సంక్షేమాన్నీ, అభివృద్ధినీ సమాంతరంగా సాగించాలన్నది ప్రాథమిక లక్ష్యం. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపప్రణాళికలకు కేటాయింపులు నిరుటి కంటే పెరిగాయి. రూ. 2,27,974 కోట్ల బడ్జెట్‌వ్యయంలో సంక్షేమ కార్యక్రమాలకోసం కేటాయించిన మొత్తం రూ. 75 వేల కోట్లు. దళితులలో మాలలకూ, మాదిగలకూ, రెల్లి కులస్తులకూ ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఎస్సీ ఉపప్రణాళికకు కేటాయించిన మొత్తం నిరుటి కేటాయింపు కంటే 33.60 శాతం అధికం. బీసీ ఉపప్రణాళికకు 15,000 కోట్లు కేటాయించడం కూడా విశేషం. నిరుటి కేటాయింపు కంటే ఇది 17.03 అధికం. బీసీలను ఓటు బ్యాంకుగా కాకుండా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలుగా గుర్తించి వారి అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్న స్పృహ జగన్‌మోహన్ రెడ్డికి ఉన్నది. టిక్కెట్ల కేటాయింపులోనూ, నిధుల మంజూరులోనూ బీసీలకు పెద్దపీట వేసి బీసీ డిక్లరేషన్‌లో చేసిన బాసలను నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. డిక్లరేషన్‌లో చెప్పినట్టే ఉపప్రణాళికకు నిధులు కేటాయించారు. అదే విధంగా నామినేషన్‌పైన ఇచ్చే చిన్న కాంట్రాక్టు పనులలో సగం బీసీలకు ఇస్తామంటూ జగన్‌మోహన్‌రెడ్డి వాగ్దానం చేశారు. కాపుల సంక్షేమం కోసం ఐదేళ్ళలో పదివేల కోట్లు కేటాయిస్తామంటూ చేసిన వాగ్దానానికి అనుగుణంగానే ఈ వార్షిక బడ్జెట్‌లో ఆ సామాజికవర్గానికి రెండు వేల కోట్లు ప్రత్యేకించారు. ఆయన సాధించిన అద్భుతమైన విజయంలో అన్ని కులాల, అన్ని ప్రాంతాల, అన్ని మతాల పాత్రా ఉన్నది. పైగా కులాలకూ, ప్రాంతాలకూ, మతాలకూ, రాజకీయాలకూ, పార్టీలకూ అతీతంగా సర్వజన సంక్షేమం ధ్యేయంగా పనిచేయాలన్నది వైఎస్‌ఆర్‌సీపీ అధినేత అభీష్టం. అందుకే అందరినీ సంతృప్తి పరచాలని ప్రయత్నం. మొత్తం 139 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ప్రకటించారు.

## మేనిఫెస్టోనే మంత్రం

ఇవన్నీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న అంశాలే. ఇచ్చిన వాగ్దానాలను మసిపూసి మారేడుకాయ చేయకుండా, షరతులు విధించి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే కుటిల యత్నాలకు ఒడిగట్టకుండా చెప్పినవి చెప్పినట్టు చేసే సంకల్పాన్ని బడ్జెట్ ప్రతిపాదనలు సూచిస్తున్నాయి. నేలవిడిచి సాము చేయకుండా ఉన్న ఆర్థిక పరిమితులలోనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు అవసరమైన కేటాయింపులు సముచితంగా జరిగాయి. సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో మూడు ప్రాంతాల ప్రయోజనాలనూ దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతిగ్రామానికీ తాగునీరు ఇవ్వాలని ప్రయత్నం. పింఛన్లకు కేటాయింపులను మూడు రెట్లు పెంచారు. ఆటో డ్రైవర్లకూ, నాయీ బ్రాహ్మణులకూ, రజకులకూ, మత్స్యకారులకూ, దర్జీలకూ, చేనేత కార్మికులకూ, బ్రాహ్మణులకూ, యువన్యాయవాదులకూ చేసిన వాగ్దానాలను విస్మరించలేదు. ప్రతి చేనేత కుటుంబానికీ సంవత్సరానికి రూ. 24వేలు ఇవ్వడానికి ఏర్పాటు చేశారు. దీని వల్ల 98 వేల చేనేత కుటుంబాలు లబ్ధిపొందుతాయని అంచనా. ఆరోగ్యశ్రీ, 108 వంటి ఆరోగ్య పథకాలను పునరుద్ధరించి వైఎస్ హయాంలో ఎంత సమర్థంగా వినియోగించారో అంతే సమర్థంగా ప్రజలకు ఆరోగ్యసేవలు అందించాలన్న తపన బుగ్గన బడ్జెట్‌లో కనిపిస్తున్నది.

డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీతో రుణాలు కల్పించేందుకు అవసరమైన కేటాయింపులు కూడా చేశారు. అదే విధంగా ఉచిత విద్యుచ్ఛక్తి సరఫరా కార్యక్రమంలో విద్యుత్ వినియోగం పరిమితిని 200 యూనిట్ల వరకూ పెంచడం వల్ల అదనంగా 3.42 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఎంత కేటాయించారన్నది కాదు ప్రశ్న. ఎంత ఖర్చు చేశారన్నది ముఖ్యం. నిగూఢ లక్ష్యాలు ఏమైనా ఉన్నాయా, కొన్ని వర్గాలకు మాత్రమే ప్రయోజనం కలిగించే దురుద్దేశాలు ఉన్నాయా, నిధులు దారిమళ్లాయా అనేవి బడ్జెట్ ప్రతిపాదనలలో నిశితంగా గమనించ వలసిన అంశాలు. ఈ బడ్జెట్‌లో అటువంటి నిగూఢమైన కోణాలు ఏవీ ఉన్నట్టు లేదు. బుగ్గన చెప్పినట్టు సింగపూర్ అంతర్జాతీయ విమానాలకు లోటుభర్తీ (వయబిలిటీ గ్యాప్ ఫండ్) సమకూర్చాలా లేక వేలాది తల్లులకూ, పిల్లలకూ పోషకాహారం అందించాలా అనే ప్రశ్నే ఉదయించకూడదు. సింగపూర్ వ్యామోహంతో టీడీపీ సర్కార్ చేసిన తప్పులను సరిదిద్దవలసిన బాధ్యత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంపైన ఉన్నది. విభజన కారణంగా నష్టపోయిన రాష్ట్రం, ఆర్థిక వనరులు పరిమితంగా ఉన్న రాష్ట్రం. రుణభారం అధికంగా ఉన్న రాష్ట్రం. ఈ పరిమితులకు లోబడి పొదుపు చర్యలు తీసుకుంటూనే బడుగు వర్గాలకు పెద్ద పీట వేసే ప్రయత్నం బుగ్గన చేశారు.

## రైతన్నకు వెన్నుదన్ను

మంత్రి బొత్స సత్యనారాయణ సమర్పించిన వ్యవసాయ బడ్జెట్ సైతం అన్నదాతలకు పాదయాత్రలో ఇచ్చిన హామీలకు తగినట్టుగానే ఉంది. మొత్తం బడ్జెట్ వ్యయంలో 12.66 శాతం వ్యవసాయరంగానికి కేటాయించడం విశేషం. ఈ బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి కేటాయించిన రూ. 28,866 కోట్లు నిరుటి కంటే రూ. 9,796 కోట్లు అధికం. పెట్టుబడి సాయం రైతు కుటుంబానికి వైఎస్‌ఆర్ రైతుభరోసా పథకం కింద రూ. 12,500ల వంతున రూ. 8,796 కోట్లు అవసరం. కౌలురైతులకు సైతం ఇది వర్తిస్తుంది. రైతులకు వడ్డీలేని రుణాలు ఇవ్వడంపైనా శాసనసభలో ముఖ్యమంత్రికీ, ప్రతిపక్ష నాయకుడికీ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. సున్నా వడ్డీ రుణం తన హయాంలో ఇప్పించామంటూ చంద్రబాబునాయుడు ప్రకటిస్తే, సత్యదూరమంటూ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వ్యవసాయరంగం వృద్ధిరేటు మైనస్ 4.12 శాతం ఉన్నదంటూ ఆర్థికశాఖ విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకటిస్తే వ్యవసాయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ అంటూ మాజీ ముఖ్యమంత్రి బిగ్గరగా చెప్పుకున్నారు.

రెండు పక్షాలు భిన్నమైన ప్రకటనలు చేసినప్పుడు నిజం నిగ్గు తేల్చడానికి స్వతంత్ర వేదిక ఉంటే బాగుంటుంది. వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పథకం కోసం రూ. 100 కోట్లు మాత్రమే కేటాయించారనీ, ఇందుకు కనీసం నాలుగు వేల కోట్ల రూపాయలు అవసరం ఉంటుందనీ చంద్రబాబు వ్యాఖ్యానించారు. కొత్త చెల్లింపులు ఏప్రిల్, మే మాసాలలో జరుగుతాయి కనుక ఆ భారం వచ్చే బడ్జెట్‌పైన ఉంటుందనీ, ఇప్పుడు రుణాలు తిరిగి చెల్లించేవారు ఎక్కువమంది ఉండరు కనుక కేటాయించిన చిన్న మొత్తం సరిపోతుందనీ ప్రభుత్వ వర్గాల వివరణ. వడ్డీలేని రుణం, పంట ధరల స్థిరీకరణ, కౌలు రైతులకు పంటరుణాలు ఇవ్వాలన్న ప్రతిపాదనలు వ్యవసాయరంగంలో నెలకొన్న సంక్షోభాన్ని చాలా వరకూ పరిష్కరిస్తాయి. అప్పుల ఊబిలో చిక్కుకొని దిక్కుతోచక ఆత్మహత్యను ఆశ్రయించిన రైతుల కుటుంబాలకు ఏడు లక్షల వంతున పరిహారం ఇవ్వాలన్న నిర్ణయం కూడా స్వాగతించదగినదే. కడచిన అయిదు సంవత్సరాలలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలలో పరిహారం అందని కుటుంబాలకు తన ప్రభుత్వం కుటుంబానికి ఏడు లక్షల రూపాయల వంతున చెల్లిస్తుందంటూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయం. రైతును కాపాడుకునేందుకు ఎంత ఖర్చు చేసినా, ఎంత దూరం వెళ్ళినా తప్పులేదు. సమాజంలో వివిధ వర్గాలకూ, దాదాపు అన్ని వర్గాలకూ ఉద్దేశించిన సంక్షేమ కార్యక్రమాలు నూటికి నూరుపాళ్ళూ అమలు చేయడానికి అవసరమైన భారీ నిధులు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నిస్తున్నవారు ఉన్నారు.

'వేర్ దేర్ ఈజ్ ఎ విల్, దేర్ ఈజ్ ఎ వే', సంకల్పం ఉంటే మార్గం ఉంటుందనే సామెత ఉంది. ఇంతకు మునుపు వైఎస్ రాజశేఖరరెడ్డి ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి కానీ విశ్వసనీయత కలిగిన నాయకులుగా పేరు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికలలో వైఎస్‌ఆర్‌సీపీ చారిత్రక విజయం వెనుక విశ్వసనీయత ప్రధానమైన హేతువు. జగన్‌మోహన్‌రెడ్డి యూఎస్‌పీ (యునీక్ సెల్లింగ్ పాయింట్–ఆయనకే ప్రత్యేకమైన ఆకర్షణీయమైన లక్షణం) అదే. వాగ్దానాలు చేసే ముందే వాటి అమలు సాధ్యాసాధ్యాల గురించి లోతుగా ఆలోచించి ఉంటారు. ఇప్పుడు గెలిపించిందీ, మున్ముందు గెలిపించేదీ ఆ విశ్వసనీయతే కనుక యూఎస్‌పీ దెబ్బతినకుండా కాపాడుకోవాలన్న సంగతి ముఖ్యమంత్రికి తెలుసు. ముఖ్యమంత్రి వ్యక్తిత్వానికీ, ఆచరణశీలతకూ, వాస్తవిక దృష్టికీ అద్దం పట్టే విధంగా బుగ్గన బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి. రాజ్యాంగం లాగానే బడ్జెట్ కూడా సదుద్దేశాలతో నిర్మించుకున్నది. దాని అమలులోనే సాఫల్య వైఫల్యాలు ఉంటాయి. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం క్రమశిక్షణతో బడ్జెట్‌లో ప్రతిపాదించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఆరోగ్య రంగాల లక్ష్యాలను సాధించగలిగితే నవ్యాంధ్రలో నవశకానికి నవరత్నాలతో శ్రీకారం చుట్టినట్టే.

---

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం
ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి శు.త్రయోదశి రా.1.11 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం జ్యేష్ఠ సా.6.43 వరకు, తదుపరి మూల
వర్జ్యం రా.2.57 నుంచి 4.36 వరకు
దుర్ముహూర్తం సా.4.47 నుంచి 5.40 వరకు, అమృతఘడియలు... ఉ.9.49 నుంచి 11.04 వరకు.

సూర్యోదయం : 5.36
సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

---

ఎం.ఎస్.కె. ప్రసాద్ (సెలక్టర్)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

లండన్ నుంచి ఇండియా బయల్దేరాం. ఫ్లయిట్ ఎక్కేముందు ఇండియా నుంచి వినోద్ రాయ్ ఫోన్ చేశారు. వెంటనే లిఫ్ట్ చేసి, "గుడ్ మార్నింగ్ సర్" అన్నాను.

రాయ్ పెద్దగా నవ్వారు. "క్యాచ్ పట్టినట్టుగా పట్టావ్ కదయ్యా" అన్నారు.

"ఏంట్సార్ పట్టేది!! అన్నాను.

"అదేనయ్యా.. దినేష్ కార్తీక్ కొట్టిన బంతిని నీషమ్ అద్భుతంగా క్యాచ్ పట్టేశాడు కదా. అలా నువ్వు నా కాల్‌ని పట్టేశావు. నేను కదా ముందుగా నీకు గుడ్ మార్నింగ్ చెప్పాల్సింది. నేను నీకు ఫోన్ చేశాను. నువ్వు నాకు ఫోన్ చెయ్యలేదు.. హాహాహా.." అన్నారు!

ముందు పంపాల్సిన ప్లేయర్‌ని ముందు పంపి, వెనుక పంపాల్సిన ప్లేయర్‌ని వెనుక పంపి వుంటే ఇప్పుడు మేమంతా ఇండియా ఫ్లయిట్ ఎక్కేందుకు ముందూవెనుకా ఆలోచించే పని ఉండేది కాదని రాయ్ నాకు చెప్పదలచుకున్నారని అర్థమైంది. ఆయన నాకు చెప్పదలచుకున్నారని నేను అర్థం చేసుకున్న ఇంకో విషయం.. సెమీస్‌లో మ్యాచ్ పోయాక ఈ రెండు మూడు రోజుల్లో ఒక్కసారి కూడా నేను ఆయనకు ఫోన్ చెయ్యలేదని నాకు గుర్తు చేయడం.

"సారీ సర్. చెయ్యాల్సింది" అన్నాను.

"చెయ్యలేకపోయావ్ సరే, 'చెయ్యలేకపోయాను' అనైనా చెయ్యాల్సింది" అన్నారు! ఆయన ఇగో బాగా హర్ట్ అయినట్లుంది. ఇండియా హర్ట్ అయినా పర్వాలేదు. ఇగోలు హర్ట్ కాకూడదు. వినోద్ రాయ్ ఇగోను అసలే హర్ట్ కానీయకూడదు. క్రికెట్ బాగోగుల కమిటీ ఛైర్మన్ ఆయన.

"చేద్దామనుకున్నాను సర్. ఓడిపోయాక చేసి చెప్పేది, చెప్పి చేసేదీ ఏముంటుందని చెయ్యలేదు" అన్నాను.

"గెలిస్తే 'కంగ్రాట్స్' అని నేనే ముందుగా ఫోన్ చెయ్యడం కామన్. ఓడిపోతే 'సారీ' అని



నీకై నువ్వే ముందుగా ఫోన్ చెయ్యకపోవడం అన్‌కామన్. పిటీ ఏంటంటే.. ఓడిపోయినా నేనే నీకు ఫోన్ చేసి నీ చేత సారీ చెప్పించుకోవడం" అని మళ్లీ 'హాహాహా..' అన్నారు.

ఇండియా న్యూజిలాండ్‌పై ఓడిపోడానికి కారణం నేనేనని ఆయన అనుకుంటున్నట్లున్నారు! అలాగైతే ఇండియా దక్షిణాఫ్రికా మీద, ఆస్ట్రేలియా మీద, పాకిస్తాన్ మీద, ఆఫ్ఘనిస్తాన్ మీద, వెస్టిండీస్ మీద, బంగ్లాదేశ్ మీద గెలవడానికి కూడా నేనే కారణం అని ఆయన అనుకోవాలి. కెప్టెన్ ఉండగా, కోచ్ ఉండగా, మ్యాచ్ మట్టిపాలవడానికి కారణం సెలక్టర్స్ కమిటీ ఛైర్మన్ మాత్రమే అయితే.. అంతమంది ఉండగా గెలిచిన మ్యాచ్‌లన్నిటిలోనూ గెలుపుకు సెలక్టర్స్ కమిటీ ఛైర్మనే కారణం అవ్వాలి కదా!

"గెలుపు ఓటములకు కారణం నేనేనని మీరు అనుకుంటున్నట్లయితే కనుక నేను నా తప్పుల్ని సరిదిద్దుకుంటాను సర్" అన్నాను.

"ఓటమికి మాత్రమే కారణాలు ఉంటాయి మిస్టర్ ఎమెస్కే. గెలుపుకు కారణమేంటని ఎవరూ చూడరు. తప్పుల్ని దిద్దుకుంటానని అంటున్నావ్. దిద్దుకోలేని తప్పేదైనా చేసి ఉంటే మాత్రం నిన్ను ఇంకొకరు దిద్దవలసి వస్తుంది. నిన్ను నువ్వు దిద్దుకోడానికి ఉండదు" అన్నారు!

అంబటి రాయుడిని టీమ్‌లోకి తీసుకోనందుకు ఈయన ఇలా అనడం లేదు కదా అని ఒక్కక్షణం అనిపించింది.

"మీరంతా ఇండియా రాగానే చిన్న మీటింగ్ ఉంటుంది ఎమెస్కే. కెప్టెన్ కోహ్లీకి, కోచ్ రవిశాస్త్రికి కలిపి ఒక మీటింగ్. నీకొక్కడికే సపరేట్‌గా ఒక మీటింగ్. ఆ సంగతి చెప్పడానికే ఫోన్ చేశాను" అన్నారు వినోద్ రాయ్!

నాకొక్కడికే సపరేట్‌గా ఒక మీటింగా!

నాకేదో అర్థమవుతోంది.

"సర్.. మా నేటివ్ ప్లేస్ గుంటూరుకు వెళ్లి కొన్ని యుగాలు అవుతోంది. ముంబైలో ఫ్లయిట్ దిగ్గానే ఒకసారి గుంటూరు వెళ్లొస్తాను సర్" అన్నాను.

"గుంటూరా! అంబటి రాయుడిది కూడా గుంటూరే కదా" అన్నారు సడన్‌గా ఆయన.

---

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!





## సోషల్ మీడియా

### జారుడు మెట్లు



"మొదట మహారాష్ట్రకు చెందిన రాధాకృష్ణ విక్కీ పాటిల్, తరువాత గోవాకు చెందిన చంద్రకాంత్ కవ్లేకర్..ఇద్దరు కాంగ్రెస్ నేతలూ హఠాత్తుగా బీజేపీ ప్రభుత్వాల్లో మంత్రులైపోయారు. నా ఉద్దేశంలో ఒకసారి పార్టీ మారితే ఐదేళ్లపాటు మంత్రి పదవిని తిరస్కరించాలి. గోవాలో బీజేపీలో చేరిన పదిమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 8మంది కేథలిక్కులు. అధికార దాహం ముందు మతపరమైన అడ్డంకులు ఏవీ పనిచేయవనడానికి ఇదే మంచి ఉదాహరణ"

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

### పోలీస్ సేవ



"అత్తివరదార్ పండుగ సందర్భంగా తమిళ నాడు పోలీసులు అందించిన సేవలు అద్భుతం. ప్రజలను తోసివేశారనీ, లాఠీలతో కొట్టారనీ, త్వరగా స్పందించరనీ వారిపై ఆరోపణలు చేస్తాం. కానీ, ఎటువంటి నియమ నిబంధనలు పాటించని, క్రమశిక్షణ లేని భక్తులతో వాళ్లు జాగ్రత్తగా వ్యవహరించారు"

– సుమంత్ రామన్, యాంకర్

### స్వచ్ఛ భారత్



"అనురాగ్ ఠాకూర్, హేమమాలినితో సహా పలువురు బీజేపీ ఎంపీలు స్వచ్ఛ భారత్ అభియాన్ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ ప్రారంభించిన ఐదేళ్ల తర్వాత, పార్లమెంట్ లోపలి రోడ్డుపై ఇంత చెత్త ఉందంటే ఆ కార్యక్రమం ఎంత విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు"

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

### చిహ్నాలు



"బొట్టు, మంగళ సూత్రాలు పెళ్లయిన మహిళకు చిహ్నాలు. మరి, మగవారు ఎందుకు మంగళ సూత్రం ధరించరు? బొట్టు పెట్టుకోరు? పోనీ వాటికి బదులుగా వేరేవైనా వాడరు. ఎప్పుడైతే ఇవన్నీ మగవారు ధరించడానికి పనికిరావో, అవన్నీ మహిళపై పురుషుడికి ఉండే హక్కుకు చిహ్నాలు మాత్రమే అవుతాయి"

– నీరజ్ గొగోయ్, ఫెమినిస్ట్

### గ్రాఫిక్ సిటీ



"ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ప్రపంచంలోనే ఐదో పెద్ద సిటీ చేస్తామన్న అమరావతి గ్రాఫిక్స్ దశలోనే ఉంది. విచ్చలవిడిగా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని దివాలా తీయించారు చంద్రబాబు. కార్పొరేషన్లు, ప్రభుత్వ సంస్థల ద్వారా రుణంగా తెచ్చిన లక్ష కోట్లు ఏమయ్యాయో అంతుబట్టడం లేదు"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

---

## ట్రంప్‌కు వార్నింగ్

ప్రపంచంలో ఎప్పుడూ మహోద్రిక్తంగా ఉండే ప్రాంతం పశ్చిమాసియా. అక్కడ ఇజ్రాయెల్‌కు అటు పాలస్తీనా వాసులతోనూ, ఇటు లెబనాన్‌కి చెందిన హిజ్బుల్లాతోనూ తరచు వివాదాలు రివాజు. కొన్నిసార్లు అవి కట్టుదాటి బాంబు దాడుల వరకూ పోతాయి. ఇరాన్‌పై దాడులకు కయ్యానికి కాలు దువ్వుతున్న అమెరికా తీరుపై పశ్చిమాసియా ఇప్పుడు కుతకుత ఉడుకుతోంది. అమెరికా అందుకు తెగిస్తే ఇజ్రాయెల్ క్షేమంగా ఉండటం సాధ్యం కాదని హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లా హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధభేరి మోగించిన మరుక్షణం ఇజ్రాయెల్ కనుమరుగవుతుందని, ఆ సంగతి అమెరికన్లు గుర్తుంచుకోవాలని ఆయనన్నారు. ఇరాన్‌పై దాడి చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఉన్న అధికారాలకు పరిమితి విధిస్తూ ప్రతినిధుల సభ శుక్రవారం తీర్మానించింది. ఈ దాడి అనవసర యుద్ధానికి దారితీస్తుందన్న ఆందోళనే ఇందుకు కారణం. 1975 నుంచి 15 ఏళ్లపాటు కొనసాగిన అంతర్యుద్ధం తర్వాత 1990లో వివిధ గ్రూపుల మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఇతర గ్రూపులు ఆయుధాలు అప్పగించి జనజీవనస్రవంతిలో కలిసినా, హిజ్బుల్లా అందుకు నిరాకరించింది. ఆ చిన్న దేశంలో హిజ్బుల్లా నిరుడు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 13 స్థానాలు గెల్చుకుని ప్రస్తుత కేబినెట్‌లో 3 పదవులు దక్కించుకుంది.

---

# ఉట్టికెక్కనున్న ఉపాధ్యాయ విద్య

అభిప్రాయం



నాగటి నారాయణ

మన దేశ విద్యారంగం ముఖ్యంగా పాఠశాల విద్య నాణ్యత లేనిదనే ముద్రను మూటగట్టుకున్న విషయం తెలిసిందే. జాతీయ విద్యా విధానం 2019 ముసాయిదాలో పాఠశాల ఉపాధ్యాయుల గురించి పెద్ద చర్చే చేశారు. ఉపాధ్యాయులకు ఉండాల్సిన విద్యార్హతలు, నియామకాల విధానం, ప్రమోషన్ అవకాశాలు, పని పద్ధతులు వగైరా చాలా విషయాలు క్రోడీకరించారు. ముసాయిదా నివేదికలో చెప్పిన విషయాలు, చేసిన సిఫార్సులు చూస్తుంటే ఉపాధ్యాయుల గురించి చాలా గొప్ప శ్రద్ధాసక్తులు కనబరుస్తున్నట్లు వుంది. కానీ నర్సరీ, కేజీ, ప్రైమరీ తరగతులకు, సెకండరీ క్లాసులకు ఒకే విద్యార్హతలు, ఒకే స్థాయి కల్గిన వారిని ఉపాధ్యాయులుగా నియమించడం సమంజసమేనా? బీఈడీలో ఫౌండేషనల్, ప్రిపరేటరీ, మిడిల్, సెకండరీ సబ్జెక్టులు ప్రత్యేకంగా ఉన్నా విద్యార్హత (నాలుగేళ్ళ బీఈడీ) స్థాయి ఒకటే. క్వాలిఫికేషన్ ఒకటే అయినా హోదాల్లో తేడాలు (జనరల్ టీచర్, సబ్జెక్ట్ టీచర్ వగైరా) చూపించారు. ఆర్ట్స్, క్రాఫ్ట్స్, మ్యూజిక్, ఒకేషనల్ టీచర్స్ నియామకాలకు కూడా బీఈడీ విద్యార్హతనే ప్రపోజ్ చేయడం అతిగా ఉంది. ప్రాథమిక తరగతులకు కూడా నాలుగేళ్ళ డిగ్రీ అర్హత గలవారే పాఠాలు చెప్పగలరనడం తర్క విరుద్ధం. అవసరమైన క్వాలిఫికేషన్స్, ట్రైనింగ్ కావాల్సిందే, వాటితోపాటు పరిపాలనా సామర్థ్యాన్ని బట్టే ఉపాధ్యాయుల పనివిధానం, నాణ్యమైన బోధన సాధ్యమవుతుందనే వాస్తవాన్ని గుర్తించాలి. కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో పనిచేస్తున్న టీచర్స్, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల విద్యార్హతలు ఒకటే. కానీ వారిపైన ప్రశంసలు వీరిపైన విమర్శలు ఎందుకని?

నాలుగేళ్ళ బీఈడీ అర్హతగల వారినే పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించాలనే రికమండేషన్ అమల్లోకి వస్తే లాభాలకంటే నష్టాలు ఎక్కువ జరిగే అవకాశం వుంది. ఒకటి. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ప్రతిభ గలవారి ప్రవేశం తగ్గిపోగలదు. నాలుగేళ్ళ డిగ్రీలుగా ఉన్న ఇంజనీరింగ్ తదితర ప్రొఫెషనల్ కోర్సులకు వుండే డిమాండ్ ఉపాధ్యాయ వృత్తికి వుండదు. ఒక ఏడాదిగా వుండే డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్ (టీటీసి) కోర్సును రెండేళ్లకు పెంచినపుడే ప్రవేశాలు తగ్గిపోయిన విషయం తెలిసిందే. రెండు. దళితులు, గిరిజనులు, బలహీన తరగతుల వారిలో అత్యధికులు డిగ్రీ దాకా చదవలేక పదో తరగతి, పన్నెండో తరగతితోనే డ్రాపవుట్ అవుతున్నారు. అందువలన ఉపాధ్యాయ నియామకాల్లో రిజర్వుడ్ కేటగిరి వారి సంఖ్య తగ్గిపోవచ్చు. మూడు. నాలుగేళ్ళ బీఈడీతోనే సరిపోదు, టెట్, ఎన్టీఏ స్కోరింగ్ ఉంటేనే ఉపాధ్యాయ ఉద్యోగానికి అప్లై చేసే అర్హత లభిస్తుంది. టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష రాయాలి, క్లాస్ రూమ్ డెమోలో పాల్గొనాలి, ఇంటర్వ్యూని ఎదుర్కోవాలి. డిగ్రీతోనే వయసు ఇరవైరెండేళ్లు దాటుతుంది. ఆపైన టెట్, ఎన్టీఏ, రిక్రూట్‌మెంట్ పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ అన్నీ ఒక సంవత్సరంలోనే పూర్తవుతాయని చెప్పలేము. అంతకాలం ఆగలేక వేరే వృత్తుల్లోకి జారుకునే అవకాశం ఉంటుంది. నాలుగు. అన్ని స్థాయిల ఉపాధ్యాయ ఉద్యోగార్థులు బహుళ విభాగాలు గల విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లోని నాలుగేళ్ళ బీఈడీ కోర్సులే చదవాల్సి వస్తే దేశవ్యాప్తంగా వున్న బీఈడీ, డైట్, పండిట్, పీఈటీ తదితర ఉపాధ్యాయ విద్యాసంస్థలన్నీ మూతబడినట్లే. నాలుగేళ్ళ బీఈడీ కోర్సును యూనివర్సిటీలు, మల్టీ డిసిప్లైన్ కాలేజీల్లోనే నిర్వహించాలనే సిఫార్సును కూడా ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలే ఎగరేసుకుపోగలవు. కనుక ప్రక్షాళన వంకతో, నాణ్యత పేరుతో ఉపాధ్యాయ విద్యను ఉట్టికెక్కించి సరికొత్త సమస్యలను సృష్టించడం అనవసరం. ప్రభుత్వరంగంలోని ఉపాధ్యాయ విద్యాసంస్థలను సకల సదుపాయాలతో ఆధునీకరించి, అవసరమైనంత ఫ్యాకల్టీతో బలోపేతం చేస్తే సరిపోతుంది. ప్రీ ప్రైమరీ నుంచి సెకండరీ వరకు ఉపాధ్యాయులను నాలుగు కేడర్లుగా నియమిస్తే బాగుంటుంది.

ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేటర్సుగా, టీచర్ ఎడ్యుకేటర్సుగా ప్రమోట్ కావచ్చనే నివేదికలోని సూచన వలన చాలా కొద్దిమందికే అవకాశం రావచ్చు. అలాంటి అరుదయిన ప్రమోషన్లను, ఉపాధ్యాయుల జీతాల పెరుగుదలను మెరిట్ ప్రాతిపదికన నిర్ణయించాలనే సిఫార్సు కూడా ప్రశ్నార్థకంగానే ఉంది. టీచర్ల నియామకాలు, పని విధానంకు సంబంధించిన మరి కొన్ని సిఫార్సులను కూడా పరిశీలించి వెంటనే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకోసం ఉపాధ్యాయులు, విద్యారంగ శ్రేయోభిలాషులు ఎంత త్వరగా స్పందిస్తే అంత మంచిది. లేకపోతే ముసాయిదాలోని సిఫార్సులు యథాతథంగా అమల్లోకి వస్తే పాఠశాల విద్య మరింత పతనం కాక తప్పదు.

వ్యాసకర్త విద్యారంగ విశ్లేషకులు
మొబైల్ : 94903 00577

---

# చందమామతో ఒక మాట చెప్పాలి

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ గగనంలో మరో ఘనత సాధించేందుకు సిద్ధమవుతోంది. అనేక ప్రతిష్ఠాత్మక ప్రయోగాలతో దేశ ఖ్యాతిని ఆకాశమంత ఎత్తుకు చేర్చిన షార్.. మంగళ్‌యాన్, చంద్రయాన్–1 వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను సైతం విజయవంతం చేసిన ఆత్మవిశ్వాసంతో.. చంద్రయాన్–2 ప్రయోగానికి సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. చంద్రయాన్–1 లో చంద్రుడిపై మంచు ఉందని కనుగొన్న ఇస్రో... ఇప్పుడు మరిన్ని రహస్యాలను ఛేదించడానికి సిద్ధమవుతోంది. చంద్రుడిపై మట్టి, రాళ్లను చంద్రయాన్–2లో పరిశీలించనున్నారు. ఇస్రో 2009లో చంద్రయాన్–1ను విజయవంతంగా ప్రయోగించిన తర్వాత పదేళ్ళకు ఇస్రో చంద్రయాన్–2 చేపట్టింది. చంద్ర మండలాన్ని శోధించటానికి ఇస్రో, రష్యన్ అంతరిక్షసంస్థ కలసి సంయుక్త కార్యక్రమంగా చంద్రయాన్–2పై పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించవచ్చు, కొత్త ప్రయోగాలూ చేయవచ్చు అని ఇస్రో భావిస్తోంది. చక్రాలు కలిగిన రోవర్ యంత్రం చంద్రుని ఉపరితలం అంతా తిరిగి అక్కడి మట్టి, రాళ్ల నమూనాలను సేకరించి అక్కడే రసాయన విశ్లేషణ చేస్తుంది.

చంద్రయాన్–2 ప్రయోగ పనులు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లో వడివడిగా జరుగుతున్నాయి. గత ఆదివారం ఈ వాహకనౌకను రెండో ప్రయోగ వేదికకు తీసుకొచ్చి పూర్తి స్థాయిలో అనుసంధానం చేసి గ్లోబల్ చెక్స్, ఫేజ్–3, లెవెల్ 1, 2 చెకింగ్స్ చేశారు. రెండో ప్రయోగవేదికపైనే వారం రోజులపాటు పలు రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. దీని ద్వారా చంద్రగ్రహం పైకి ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రయోగం ద్వారా మొత్తం 13 ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లనున్నారు. ఇందులో భారత్‌కు చెందిన 6, యూరోప్‌కు చెందిన 3, అమెరికాకు చెందిన 2 పేలోడ్స్ ఉన్నాయి. జూలై 15న వేకువ జామున 2 గంటల 51 నిమిషాలకు చంద్రయాన్–2 రాకెట్ ప్రయోగం చేయాలని నిర్ణయించారు. ప్రయోగం జరిగిన 52 రోజుల తరువాత సెప్టెంబరు 6, 7 తేదీల్లో చంద్రుడిపై దక్షిణ ధృవం దగ్గరగా ఉపగ్రహం అడుగుపెట్టనుంది.

చంద్రుడి మీదకు అడుగుపెట్టగానే ల్యాండర్‌లో నుంచి రోవర్ బయటకు వచ్చి చంద్రుడి ఉపరితలపై పయనిస్తుంది. ల్యాండర్, రోవర్ చంద్రుడిపై 14 రోజులపాటు ఉండి వివిధ పరిశోధనలు చేయనుంది. ఒక ఏడాదిపాటు చంద్రుడి ఉపరితలాన్ని వివిధ కోణాల్లో పరిశీలించి డేటా, చిత్రాలను ఎప్పటికప్పుడు 15 నిమిషాల్లో పంపిస్తుంది. వాటిని విశ్లేషించి చంద్రుడి గురించి విశేషాలను శాస్త్రవేత్తల బృందం ఒక అంచనాకు రావడానికి వీలవుతుంది. ప్రతిష్టాత్మక చంద్రయాన్–2 ప్రయోగానికి సంబంధించిన ఫొటోలను ఇస్రో విడుదల చేసింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్‌ఎల్వీ ఎంకే–ఐఐఐ వాహన నౌక ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారత ప్రభుత్వం చంద్రయాన్–2 ప్రాజెక్టుకు దాదాపు వెయ్యి కోట్లు ఖర్చు చేసింది. అన్ని అనుకున్నట్టు జరిగి చంద్రయాన్–2 విజయవంతం అయి భారత్ కీర్తి పతాకను ఎగురవేయాలని కోరుకుందాం.

కాళంరాజు వేణుగోపాల్, గణిత ఉపాధ్యాయుడు, మార్కాపురం, ప్రకాశం జిల్లా । మొబైల్ : 81062 04412

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ ఆదివారం
14-7-2019



# నగ్న సత్యాలు

**నగ్నంగా కనిపించింది..**
**సంచలనానికి దారి తీసింది.**
**వివాదానికి తెర లేపింది.**
**స్క్రీన్ మీద మగవాడు కత్తి దూస్తాడు.. తుపాకీ పేల్చుతాడు.**
**మోరాలిటీ వదులుతాడు..**
**కానీ స్క్రీన్ కోసం స్త్రీ వస్త్రం విప్పితే**
**'టాక్ ఆఫ్ ది టౌన్'.**
**'ఆమె'లో అమలాపాల్ న్యూడ్‌గా కనిపించబోతోంది.**
**బోలెడన్ని 'నగ్నసత్యాలు' ఈ ఇంటర్వ్యూలో పంచుకుంది.**

సాక్షి ఎక్స్‌క్లూజివ్

అమలాపాల్

**● 'ఆడై' (తెలుగులో 'ఆమె') టీజర్‌లో నగ్నంగా కనిపించి, సంచలనం సృష్టించారు. ఇలాంటి పాత్ర అంగీకరించడానికి కారణం ఏదైనా?**

ఈ మధ్య కాలంలో నా దగ్గరకు వస్తున్న స్క్రిప్ట్స్ అన్నీ సహజత్వానికి దూరంగా అబద్ధాలతో నిండినవే. లేదా అన్నీ రెగ్యులర్ మసాలా సినిమాలే వస్తున్నాయి. విసిగిపోయాను. కంటెంట్ ఉన్న సినిమాలు చేయాలి, లేకపోతే మానేయాలని బలంగా నిర్ణయించుకున్నాను. సాధారణంగా మా మేనేజర్ రోజుకు రెండు స్క్రిప్ట్స్ నాకు పంపుతుండేవారు. అవన్నీ మహిళా సాధికారత కథలు లేదా త్యాగాలు చేసే భార్య పాత్రలు, రేప్ విక్టిమ్ కథలు. ఇలాంటి ఎన్నని చూస్తాం? నిజం చెప్పడమే ఆర్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం అయ్యుండాలి. అలాంటి ఓ స్క్రిప్ట్ కావాలని నేను బలంగా కోరుకోవడం వల్లనో ఏమో 'ఆమె' నా దగ్గరకు వచ్చింది. స్క్రిప్ట్ ఒక్క పేజీ చదివి 'వావ్' అనుకున్నాను. కొత్త ఎనర్జీ వచ్చింది. వెంటనే మేనేజర్‌తో ఇది ఇంగ్లీష్ సినిమానా? అని అడిగాను, కాదన్నారు. పోనీ హిందీ సినిమానా? కాదు, తమిళ సినిమానే అని చెప్పారు. డైరెక్టర్ ఎవరు? అనడిగితే రత్నకుమార్ అన్నారు. అప్పుడు నేను ఢిల్లీలో ఉన్నాను. వెంటనే తనను ఇక్కడికి రమ్మనండి అని చెప్పాను. స్క్రిప్ట్ చాలా మోడ్రన్‌గా, ఫ్రెష్‌గా, ఒరిజినల్‌గా అనిపించింది. ఫుల్ గెడ్డంతో రత్నకుమార్ ఢిల్లీ వచ్చారు. ఫస్ట్‌సారి చూడగానే ఈ కథ ఇతనే రాశాడా? అనిపించింది. ఏదో ఇంగ్లీష్ సినిమా నుంచి కాపీ చేశారేమో? రీమేక్ సినిమానేమో అనుకున్నాను. అతన్ని అడిగితే 'ఒరిజినల్ ఐడియా' అని చెప్పారు. కథ మొత్తం విన్న తర్వాత 'ఈ సినిమా నేను చేస్తే మాత్రం యాక్టర్‌గా చాలా పెద్ద స్టెప్ తీసుకుంటున్నట్టే' అని రత్నతో అన్నాను. అయితే చేయాలా వద్దా? అనే సందిగ్ధంలో పడ్డాను. ఇండస్ట్రీ ఎలా తీసుకుంటుంది? అని చాలా ఆలోచనలు. ఫైనల్లీ ఫలితం గురించి అస్సలు ఆలోచించలేదు. సినిమా చేసేవాళ్లకు, చూసేవాళ్లకు ఓ కొత్త ఎక్స్‌పీరియన్స్ మిగులుతుంది.

**● ఈ సినిమా ఫస్ట్ లుక్‌లో ఒంటికి కేవలం టిష్యూ పేపర్లు చుట్టుకుని కనిపించడం కొంచెం వివాదం అయింది కదా?**

సినిమా రిలీజ్ కాలేదు కాబట్టి ఎక్కువ చెప్పలేను. ఫస్ట్ లుక్ చూసే ఉంటారు. ఒంటికి టిష్యూ పేపర్లు చుట్టుకొని ఏడుస్తూ ఉంటాను. ఐరన్ రాడ్ పట్టుకొని సీరియస్‌గా ఉండే లుక్‌ని ముందు రిలీజ్ చేద్దామనుకున్నాం. అయితే స్త్రీ ఎప్పుడూ బాధితురాలిగా కనిపించాలని చాలామంది అనుకుంటారు. అందుకే ఏడుస్తున్న ఫొటోను రిలీజ్ చేశాం. ఆ స్టిల్ కొంచెం కాంట్రవర్సీ అయినా బాగా రిజిస్టర్ అయింది. అలాగే టీజర్‌లో నేల మీద బట్టలు లేకుండా స్పృహ లేకుండా ఉంటాను. సడన్‌గా తేరుకుంటాను. ఇది చూసి, అత్యాచారానికి గురైన అమ్మాయి కథ అని కొందరు సినిమా కథ అల్లేశారు. ఆ తర్వాత ట్రైలర్ వచ్చింది. స్టోరీ లైన్ ఎవ్వరూ ఊహించలేదు. రివెంజ్ డ్రామానా? అసలేంటి సినిమా కథ అనుకుంటున్నారు.

**● సినిమాలో మీ క్యారెక్టర్ ఏంటి?**

ఇందులో నేను బ్యాడ్ గాళ్ అని చెప్పను. ప్రస్తుతం సొసైటీలో అమ్మాయిలు ఎలా ఉన్నారో అలానే నా పాత్ర ఉంటుంది. ఇండిపెండెంట్ గాళ్‌ని. మన రెగ్యులర్ సినిమాల్లో చూసే హీరోయిన్ లాంటి అమ్మాయి అయితే కాదు. జనరల్‌గా హీరోయిన్ అంటే మంచి పనులే చేస్తుంది, మంచి మాటలే మాట్లాడుతుంది. ఇలాంటి అమ్మాయే నాకు కావాలని అబ్బాయిలందరూ అనుకునేలా ఉంటుంది. కానీ ఈ సినిమాలో కామిని (అమలా పాల్ పాత్ర పేరు) ఆ టైప్ కాదు. డామినేట్ చేస్తుంది, ఇరిటేట్ చేస్తుంది. ప్రపంచానికి ఎదురు వెళ్లయినా సరే అనుకున్నది సాధిస్తుంది. తనకో డార్క్ సైడ్ కూడా ఉంటుంది. మోరల్‌గా కరెక్ట్‌గా ఉంటుందని కూడా చెప్పను. అందరిలోనూ గ్రే షేడ్స్ ఉంటాయి కదా. అందుకే ఇది రియలిస్టిక్ క్యారెక్టర్ అని నా అభిప్రాయం. ఇందాక అన్నాను కదా.. ఆర్ట్ ముఖ్యోద్దేశం నిజానికి దగ్గరగా ఉండటం అని. కామిని పాత్ర అలాంటిదే.

**● కానీ 'మంచి' హీరోయిన్ల పాత్రలనే చూడ్డానికి అలవాటుపడ్డ ప్రేక్షకులు 'డార్క్ సైడ్' అంగీకరిస్తారంటారా?**



**■ మీ కెరీర్‌ని చూసి పేరెంట్స్ ఎలా ఫీల్ అవుతారు?**

'ఆమె' కథ చెప్పగానే ఎలా షూట్ చేయబోతున్నారు? అని అడిగారు. నా పేరెంట్స్ నా చాయిస్‌ని ఎప్పుడూ గౌరవించారు. ప్రస్తుతం చాలామంది పేరెంట్స్ పిల్లల్ని సొంతంగా నిర్ణయాలు తీసుకోనివ్వడం లేదు. ప్రతీదాంట్లో వాళ్లే ఉంటున్నారు. పిల్లల లైఫ్‌ని కంట్రోల్ చేస్తున్నాం అనుకుంటున్నారు. కాదు వాళ్లే పాడు చేస్తున్నారు. పిల్లల్ని ఎదగనివ్వాలి. ఎప్పుడూ తల్లిదండ్రుల మీద ఆధారపడేవాళ్లలాగా పెంచకూడదు. మా అమ్మానాన్న నన్ను ఇండిపెండెంట్ ఉమెన్‌గా ఉండనిచ్చారు. మా నాన్నగారు 'ఆమె' టీజర్ చూశారు. వాళ్లు హిపోక్రైట్స్ కాదు. మామూలు సినిమాలు చూసి ఎంజాయ్ చేసి వాళ్ల అమ్మాయి ఇలాంటి సినిమా చేయకూడదు అనుకోరు. నేను చేసే సినిమాల విషయంలో అమ్మానాన్న హ్యాపీ.

ఇలాంటి మూస పద్ధతులను ఎవరో ఒకరు బ్రేక్ చేయాల్సిందే. ఈ ప్రాసెస్‌లో కాంట్రవర్సీలు కూడా ఎదురవుతాయి. వాటికి నేను సిద్ధంగానే ఉన్నాను. బాలీవుడ్‌లో అనురాగ్ కశ్యప్ తనకు నచ్చిన సినిమాలే చేస్తారు. ఎవరేమన్నా పట్టించుకోరు. మన ఇండస్ట్రీలు కూడా నిజమైన కథలు చెప్పాలి. హీరోయిన్ అంటే ఉమెన్ ఎంపవర్‌మెంట్ కథలేనా? ఇంకెన్నాళ్ళు స్క్రీన్ మీద అబద్ధాలే చూపిస్తాం. నెట్‌ఫ్లిక్స్, అమేజాన్‌లో రకరకాల కంటెంట్ వస్తోంది. సినిమాలు చూసి పాడైపోతున్నారనుకోవడం కరెక్ట్ కాదు. మనమెంత నిజం చెబితే అది అంత ఇంపాక్ట్ చూపిస్తుంది. స్క్రీన్ మీద పర్ఫెక్ట్ అమ్మాయి పాత్రను చూసి అలాంటి అమ్మాయి కోసమే అబ్బాయిలు ఎదురు చూస్తుంటారు. నేను పర్ఫెక్ట్‌గా లేను అనుకునే అమ్మాయిలు కూడా బాధ పడాల్సిన అవసరం లేదు. ఎవరు ఎలా ఉన్నారో అలానే అంగీకరిద్దాం. అందరికీ ఏదో ఓ అసంపూర్ణత ఉంటుంది. ఈ ప్రపంచంలో ఎవరూ పర్ఫెక్ట్ కాదు.

**● కామిని పాత్రకు, అమలాపాల్‌కు పోలికలు ఉన్నాయా?**

ఒకప్పటి అమలాపాల్‌కి, ఈ కామినీకి చాలా దగ్గర పోలికలున్నాయి. టీనేజ్‌లో ఉండే చాలా మంది అమ్మాయిలు కామినీలానే ఉంటారు, ఆలోచిస్తారు. స్వార్థం, అభద్రతాభావం, హైపర్‌గా ఉండటం, డబ్బు సంపాదించాలనుకోవడం.. ఇలా వాళ్ల ఆలోచనలు చాలా వాటి మీద ఉంటాయి. అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ ఒకటే. ఎక్కువతక్కువలు లేవు అనుకునే మనస్తత్వం కామినిది. తనలానే నేను రెబల్ పర్సన్‌ని. అయితే ఒకప్పుడు. జీవితంలో జరిగిన సంఘటనలు, యోగా ఇవన్నీ నన్ను ప్రశాంతమైన వ్యక్తిని చేసేశాయి. ఈ పాత్ర చేస్తుంటే నా టీనేజ్ రోజుల్ని మళ్లీ గుర్తు చేసుకున్నట్టుంది. ఈ సినిమా కోసం జిమ్‌కి వెళ్లాల్సి వచ్చింది. హైపర్‌గా ఉండాల్సి వచ్చింది. ఫిజికల్‌గా స్ట్రెయిన్ చేసిన పాత్ర ఇది. ఎప్పుడో వదిలేసిన నాలో కొంత భాగాన్ని వెనక్కి వెళ్లి చూసుకొని వచ్చినట్టుంది.

**● 'మసాలా' సినిమాలు చేయడం ఇష్టం లేదన్నారు. మరి 'ఆమె'లో న్యూడ్‌గా కనిపించడం మసాలా కింద రాదా?**

ప్లీజ్.. దీన్ని గ్లామర్ సినిమా, మసాలా సినిమా అనొద్దు. రత్నలాంటి ధైర్యం ఉన్న డైరెక్టర్‌తో పని చేయడం సంతోషంగా ఉంది. ఇదే అతని ఫస్ట్ స్క్రిప్ట్. ఫస్ట్ సినిమానే ఇలాంటి స్క్రిప్ట్ చేస్తే తన మీద ట్యాగ్ వేస్తారని 'మేయాద మాన్' అనే రొమాంటిక్ కామెడీ మూవీ చేశారు. మంచి హిట్ అయింది. చాలామంది హీరోలు తనతో వర్క్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అవన్నీ వదిలేసి ఈ సినిమా చేశాడు. అది నిజమైన ప్యాషన్.

**● న్యూడ్ సీన్స్‌ని డూప్‌తో తీయాలనుకోలేదా?**

లేదు. మిగతా సీన్స్ మేమే చేస్తాం కదా. దీనికి మాత్రం డూప్ ఎందుకు? ఈ సీన్స్ షూట్ అప్పుడు 15 మంది టీమ్ మాత్రమే లొకేషన్లో ఉన్నారు. వాళ్ల చూపులు కూడా నన్ను ఇబ్బంది పెట్టలేదు. వాళ్ల కళ్లలో నా పట్ల జాలి ఉన్నా నేను సరిగ్గా చేయలేకపోయేదాన్నేమో? ఆర్ట్ మీద వాళ్లకున్న రెస్పెక్ట్ అది. సినిమా చూస్తే కావాలని అతికించిన సీన్స్‌లా ఉండవు. స్క్రిప్టే దాని చుట్టూ తిరుగుతుంది. ప్రేక్షకులు అర్థం చేసుకుంటారనుకుంటున్నాను.

**● దీనివల్ల మీ ఇమేజ్‌కు ఏదైనా ప్రాబ్లమ్ వస్తుందని అనుకుంటున్నారా?**

ఇమేజ్ నా చేతుల్లో ఉండదు. అయితే యాక్టర్‌గా నన్ను అభినందిస్తారనుకుంటున్నాను. ఈ స్క్రిప్ట్‌ని ఈజీగా 50 సార్లు చదివి ఉంటాను. ఆ న్యూడ్ సీన్స్ ఎందుకు పెట్టాం అనేదానికి జస్టిఫికేషన్ ఉంటుంది. ఇక సినిమా ఫలితం గురించి ఆలోచించిన క్షణం నుంచి ఇన్‌సెక్యూర్ అయిపోతాం. నేను కొన్ని సినిమాలను చూడటానికి ఇష్టపడతాను. ఆ సినిమాలను నేను చేయగలిగితే ఆర్ట్‌కి న్యాయం చేసినట్టు అనుకుంటున్నాను. ఒకవేళ ప్రేక్షకులు రిసీవ్ చేసుకోకపోయినా మనం కొత్తగా ట్రై చేశాం అనే సంతృప్తి ఉంటుంది.

కపిల్ చిట్స్ మీ వెంట
ఆనందం మీ ఇంట
KAPIL GROUP
39 YEARS Safeguarding Trust
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం
sricharanamedia.com

**■ విజయ్ సేతుపతి సినిమాలో హీరోయిన్‌గా మిమ్మల్ని తప్పించారు. అసలు కారణం ఏంటి?**

నేనేదో ప్రొడక్షన్ ఫ్రెండ్లీ కాదని, రెమ్యూనరేషన్ బాగా డిమాండ్ చేశానని ఆ యూనిట్ ప్రచారం చేస్తోంది. కానీ అది నిజం కాదు. అందుకే పెద్ద పోస్ట్ పెట్టాను. వాళ్లు సినిమా నుంచి తప్పించినా ఏం మాట్లాడలేకపోతున్నావు అని ఎవరైనా అంటారేమో అని భయం. పిరికిదానివి అంటారని భయం. అందుకే సోషల్ మీడియా ద్వారా నా ఫీలింగ్‌ని షేర్ చేసుకున్నాను.

**● ఈ మధ్య మీ దగ్గరకు వచ్చిన చాలా స్క్రిప్ట్స్ నచ్చలేదన్నారు. ఇప్పుడు యాక్టర్‌గా మెచ్యూరిటీ రావడం వల్లనేనా?**

అవును. నేను చేసే సినిమాలు ఆ సమయానికి నా మానసిక స్థితి ఎలా ఉందో చెప్పడానికి ఉదాహరణలు. కెరీర్ స్టార్టింగ్‌లో ఇన్‌సెక్యూరిటీతో, ఫైనాన్షియల్‌గా సర్వైవ్ అవ్వడం కోసమో సినిమాలు చేశాను. ప్రస్తుతం చాలా స్టేబుల్‌గా ఉన్నాను. అందుకే కొత్త సినిమాలు చేయగలుగుతున్నాను. నా బెస్ట్ ఇవ్వాలనుకుంటున్నాను.

**● యంగ్ ఏజ్‌లోనే హీరోయిన్‌గా వచ్చి, సక్సెస్ అయ్యారు. వ్యక్తిగతంగా 23 ఏళ్లకే పెళ్లి. ఆ తర్వాత బ్రేకప్... మరి జీవితం మీకేం నేర్పించింది?**

ఐ లవ్ హార్ట్‌బ్రేక్. నాకు బాధ అంటే చాలా ఇష్టం. ఎందుకంటే జీవితాన్ని చాలా లోతుగా చూడటానికి ట్రాజెడీలే ఉపయోగపడతాయి. మనలోకి మనం డీప్‌గా వెళ్లగలం. 17 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చాను. 23 ఏళ్లకే పెళ్లి చేసుకున్నాను. 25 ఏళ్లకు సెపరేట్ అయిపోయాం. ఈ జర్నీలో చాలా ఒత్తిడి, బాధలు చూశాను. ఇప్పుడు నేనింత ధైర్యంగా ఉండటానికి అవన్నీ కారణం. జగమే మాయ అంటారు కదా. ఇండస్ట్రీ కూడా ఓ మాయే. ఒక ఆర్టిస్ట్‌కి స్పిర్చువాలిటీ చాలా ముఖ్యం అని నమ్ముతాను. అది లేకపోతే ఈ ఫేమ్, కంఫర్ట్ అన్నీ తలకి ఎక్కేస్తాయి. అప్పుడు మనిషిగా స్థిరంగా ఉండలేం. ఏదో ఓ దానికి అడిక్ట్ అయిపోవడం చూస్తుంటాం. నా ప్రాబ్లమ్స్, నా ట్రాజెడీల వల్ల నేనో కొత్త మనిషిని అయ్యాను. స్పిర్చువాలిటీ మంచి దారి అనుకుని, అటువైపుగా వెళ్లాను. ఇప్పుడు స్థిరంగా ఉంటున్నాను. బాహ్య ప్రపంచంలో జరిగే హంగూ ఆర్భాటాలను కూడా మామూలుగా చూసేంత స్థిరత్వం వచ్చింది.

**● ఇప్పుడు మీరు ఫ్రీ బర్డ్‌లా ఉంటున్నారనుకోవచ్చా?**

యస్. ప్రస్తుతం నన్ను నేను జడ్జ్ చేసుకోగలుగుతున్నాను. ఇతరులను కూడా జడ్జ్ చేయగలుగుతున్నాను. ఇదో క్రేజీ ఇండస్ట్రీ. ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఆర్ట్ ద్వారా మనల్ని మనం ఎక్స్‌ప్రెస్ చేసుకోవాలనే ఉద్దేశంతో వస్తాం. కానీ మెల్లిగా చుట్టూ ఉన్నవాళ్లు మనల్ని మార్చేస్తారు. స్టార్ మెటీరియల్‌లో చిక్కుకుపోతాం. వాటిని దాటడానికి నాకు యోగా ఉపయోగపడుతోంది. నేను పాండిచెరీలో ఉంటాను. నా వర్క్ అయిపోయిన తర్వాత పూర్తిగా కట్ అయిపోతా. నా పెట్స్ ఉన్నాయి. నా ఫ్రెండ్స్ ఉన్నారు. నా బైక్ మీద ఫ్రీగా తిరుగుతాను. అదో డిఫరెంట్ లైఫ్.

**● ఫ్రెండ్స్, పెట్స్ అన్నీ ఓకే. లైఫ్ పార్ట్‌నర్ లేరు అనే వెలితి ఉండటం సహజం కదా?**

**■ 'కడవేర్' అనే తమిళ సినిమా నిర్మిస్తున్నారు. సినిమా నిర్మాణం అంటే టఫ్ కదా?**

నిర్మాణం అంటే ఓన్లీ డబ్బు పెట్టడం మాత్రమే కాదు. చాలా మందిని డీల్ చేయాల్సి ఉంటుంది. యాక్టర్స్‌ని పిలవాల్సి ఉంటుంది. బేరాలు ఆడాల్సి ఉంటుంది. హీరోయిన్‌గా ఉన్నప్పుడు ప్యాకప్ అయిన వెంటనే వెళ్లిపోవచ్చు. కానీ నిర్మాతగా చాలా పనులు ఉంటాయి. 16 గంటలు పని చేస్తున్నాను. ఓ టీమ్ లీడర్ అందర్నీ మోటివేట్ చేయాలి. క్రియేటివ్ పీపుల్స్‌ని ఒకలా, మేనేజర్స్‌ని ఒకలా డీల్ చేయాలి. ఈ ప్రాసెస్‌ని ఎంజాయ్ చేస్తున్నాను. ఈ సినిమా తెలుగులో 'భద్ర' పేరుతో విడుదలవుతుంది.



అవన్నీ మనం నిర్ణయించలేం. మనం ఎవర్ని పెళ్ళి చేసుకోవాలో మన చేతుల్లో ఉండదు. అవన్నీ దేవుడి ప్లాన్స్ అని నమ్ముతాను. నేను యాక్టర్ అవ్వాలనుకోలేదు. అయ్యాను. మా ఫ్యామిలీకి ఇండస్ట్రీతో సంబంధం లేదు. ఇదంతా దేవుడు ఇచ్చాడనుకుంటాను. వీటన్నింటినీ మనం స్వీకరించాలి. ఆనందించాలి. లైఫ్‌పార్ట్‌నర్ కంటే కూడా మనతో మనం కనెక్ట్ అయ్యుండాలి. అప్పుడే లైఫ్ బ్యూటిఫుల్‌గా ఉంటుంది. మనల్ని మనం ప్రేమించుకుంటే చాలు. మనల్ని ఎవరో ప్రేమించాల్సిన అవసరం లేదు. అయినా ఇప్పుడు నా లైఫ్‌లోనూ ఓ వ్యక్తి ఉన్నారు. లవ్‌లో ఉన్నాను.

**● మీ మనసులో ఉన్న ఆ వ్యక్తి సినిమా ఫీల్డ్‌కి సంబంధించినవారేనా?**

కాదు. బయటి వ్యక్తే. ఇప్పటికి ఇంతే చెప్పగలుగుతాను.

**● దర్శకుడు ఏఎల్ విజయ్ నుంచి విడాకులు తీసుకున్నాక చాన్సులు తగ్గాయా? కెరీర్‌లో మార్పు ఏదైనా వచ్చిందా?**

లేదు. అయితే నా కెరీర్‌ని ఎఫెక్ట్ చేస్తుందేమో? అనే ఆలోచన ఉండేది. పెళ్లి తర్వాత కెరీర్ అయిపోతుంది. సెపరేట్ అయిన తర్వాత ఆంటీ పాత్రలే, సీరియల్సే అని చుట్టూ ఉన్నవాళ్లు భయపెడతారు. మనలో టాలెంట్ ఉన్నంత వరకూ, మనం ప్రొఫెషనల్‌గా ఉన్నంత వరకూ మనకు అవకాశాలు వస్తూనే ఉంటాయి. విడిపోయాక చాలా సీరియస్‌గా సినిమాలు చేస్తూ వస్తున్నాను. మధ్యలో చిన్న గ్యాప్ వచ్చింది. అప్పటి నుంచి ఇంకా సీరియస్ ఎఫర్ట్స్ పెట్టాను. ఆ ఫైరే ఇంకా బెటర్ ప్రాజెక్ట్స్ తెచ్చి పెట్టింది.

**● విజయ్ పెళ్లి చేసుకున్నారు.. ఏం చెబుతారు?**

విజయ్ చాలా స్వీట్ పర్సన్. అమేజింగ్ సోల్. అతని లైఫ్ బ్యూటిఫుల్‌గా ఉండాలని కోరుకుంటున్నాను. ఆ దంపతులకు ఎక్కువమంది పిల్లలు పుట్టాలి. హ్యాపీగా ఉండాలి.

**● ప్రస్తుతం మీరు చేస్తున్న చిత్రాల్లో 'అదో అంద పరవై పోల' అనే తమిళ సినిమా ఒకటి. ఈ షూటింగ్‌లో గాయపడ్డారు. అంత రిస్క్ తీసుకోవడం అవసరమా?**

గాయాలు లేనీ హీరో లేరు కదా (నవ్వుతూ). యాక్షన్ అనేది కేవలం హీరోలకే అనేది ఉంది. సినిమా డబ్బంతా హీరో మీద ఉంటుంది కాబట్టి యాక్షన్ చేయాలనుకుంటారు. నేను ఈ సినిమాలో మార్షల్ ఆర్ట్స్ చేశాను. యాక్షన్ సీన్స్ చేస్తున్నప్పుడు టీమ్ అంతా ఫుల్ రెస్పెక్ట్‌తో చూస్తుంది. స్టంట్స్ కేవలం హీరోలకే కాదు అనే దాన్ని బ్రేక్ చేస్తున్నప్పుడు చాలా సంతృప్తి లభిస్తోంది.

**● జనరల్‌గా అమ్మాయి ఫైట్ చేస్తే మగాడిలా చేశావంటారు. ఆ పోలిక ఎందుకు?**

మా ట్రైనర్ కూడా స్టంట్స్ సమయంలో అబ్బాయిలా ఫీల్ అవ్వు అని మోటివేట్ చేస్తుంటారు. 'నేను అబ్బాయిలా ఎందుకు ఫీల్ అవ్వాలి? నేను స్త్రీలానే ఉంటాను. మగాళ్లలా నాకు మజిల్ పవర్ ఉండకపోవచ్చు. అయితే ఇన్నర్ పవర్ తెచ్చుకుంటాను' అని చెప్పాను. ఈ పోలికను మెల్లిగా పోగొట్టాలి.

**● మంచి కథలు రాకపోవడంవల్ల సినిమాలు మానేద్దాం అనుకున్నా అన్నారు. ఏం చేద్దామనుకున్నారు?**

తెలియదు. బట్ ఏం చేసినా బోరింగ్ పని మాత్రం చేయను.

**● కథలు రాయాలనుకుంటున్నారా?**

లేదు. చిన్న చిన్న ఐడియాలు చెబుతుంటాను. కానీ ఎప్పుడూ స్క్రిప్ట్ రాయలేదు. నా సోషల్ మీడియా అకౌంట్స్‌లో చిన్నచిన్న కవితలు రాస్తుంటాను. జర్నల్స్ రాస్తుంటాను. హిమాలయాలకు ట్రెకింగ్ వెళ్లినప్పుడు రాస్తుంటా.

**● ట్రెకింగ్ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?**

అద్భుతం. అందరూ ఓసారి తప్పకుండా హిమాలయాలను చూడాలన్నది నా అభిప్రాయం. సిటీలో ఎప్పుడూ ఉరుకుల పరుగుల జీవితాన్ని లీడ్ చేస్తుంటాం. హిమాలయాల్లో పరిగెత్తం. కేవలం నడుస్తాం. చాలా కామ్‌గా ఉంటాం. ప్రశాంతమైన వాతావరణంలో ఉంటాం. ఫోన్‌కి దూరంగా ఉంటాం. చిన్నప్పుడు ఎలా ఉండేవాళ్లమో అలానే మారిపోతాం. బాల్యంలో ఉన్నట్లుగానే ఫీలవుతాం.

**● ఫైనల్లీ.. లవ్‌లో ఉన్నాను అన్నారు. ఆ ప్రేమను పెళ్లితో నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లాలనుకుంటున్నారా?**

ప్రస్తుతానికి ప్రేమలో ఉన్నాం. దాన్ని అలానే ఉండనిస్తాం. దేని గురించీ ఎక్కువ ఆలోచించడం లేదు. అయితే జీవితం చాలా హాయిగా ఉంది.

**– డి.జి. భవాని**

---

## డియర్ వీకెండ్



కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ

# ఖాళీగా లేను వచ్చేవారం రా!

**స్మృ**తీ ఇరానీ కేంద్ర మంత్రి. కొత్తగా ఏర్పడిన మంత్రివర్గంలో స్మృతి ఇప్పుడు స్త్రీ, శిశు సంక్షేమ శాఖను చూస్తున్నారు. తగిన శాఖే అనిపిస్తుంది. ఆమె ఎప్పుడూ ప్రసన్నవదనంతో చిరునవ్వులు చిందిస్తూ ఉంటారు. సమస్యను సీరియస్‌గా తీసుకోరు. కానీ సీరియస్‌గా సాల్వ్ చేస్తారు. సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువ. ఇన్‌స్టాగ్రామ్‌లో తరచు ఆమె పెడుతుండే పోస్టులు పొట్ట చెక్కలు చేస్తుంటాయి. ఎట్ ద సేమ్ టైమ్.. ఒక జీవిత సత్యాన్ని చెబుతుంటాయి. లేటెస్టుగా నిన్న శనివారం స్మృతి హాయిగా నవ్వించే పోస్టు ఒకటి పెట్టారు. ఆమె పెట్టిన పోస్టు వీకెండ్స్ కూడా పనిచేస్తుండే వారి మీద! ఆ పోస్టుకు కొద్ది గంటల్లోనే పదివేల లైక్స్ వచ్చాయి. 'దంగల్' సినిమాలో ఆమిర్ ఖాన్ ఓ సన్నివేశంలో 'శభాష్' అంటాడు. అది బాగా పాపులర్ అయిన సీన్. అలా అంటున్నప్పుడు ఆమిర్ పెట్టిన ఫీలింగ్స్ చూడాల్సిందే. ఆ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి.. కింద ఇలా కామెంట్ రాశారు స్మృతి.

''ఖాళీగా లేను వచ్చేవారం రా.. అని మీరు మీ వీకెండ్‌తో అన్నప్పుడు..'' అని రాశారు. వీకెండ్‌ని సింబలైజ్ చేస్తూ పైన ఆమిర్ ఫొటో.. శభాష్ అంటూ ఉంటుంది. వీకెండ్‌లో కూడా బిజీగా ఉండే వాళ్లపై వేసిన ఈ సున్నితమైన సెటైర్ వాళ్లను అర్థం చేసుకుంటూనే, లైఫ్‌కి అంత అవసరం లేదు అని చెప్పినట్లూ ఉంది.

''మీరు మీ ఇన్‌స్టా అకౌంట్‌ని గొప్పగా హ్యాండిల్ చేస్తున్నారు స్మృతీ. ఐ లవ్ ఇట్'' అని ఒకరు. ''యు ఆర్ సో ఫన్నీ మేమ్'' అని ఇంకొకరు. ''మీ హాస్య చతురత చంపేస్తోంది'' అని మరొకరు.. స్మృతి పోస్ట్‌కి కామెంట్స్ పెట్టారు. ప్రొడ్యూజర్ ఏక్తా కపూర్, నటి దివ్యాసేథ్ షా కూడా లైక్ కొట్టారు. ఈ పోస్ట్‌ని చూశాక ఎవరికి మాత్రం వీకెండ్‌ని ఎంజాయ్ చేయాలనిపించదు చెప్పండి. పని కూడా ఎంజాయ్‌మెంటే అనుకునేవాళ్లకు అసలు ప్రాబ్లమే లేదు.




స్మృతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఆమిర్ ఫొటో

సాక్షి
# ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ ఆదివారం
14-7-2019

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్ చేయ్...దాచేయ్...

**పల్లవి :**

ప్రేమించే ప్రేమవా ఊరించే ఊహవా
ప్రేమించే ప్రేమవా పూవల్లే పుష్పించే
నే నేనా అడిగా నన్ను నేనే
నే నీవే హృదయం అన్నదే
॥ప్రేమించే॥
రంగు రంగోళీ గోరింటే నువ్వు పెట్టి
రంగే పెట్టిన రేఖలు మెరిసి గాజుల సవ్వడి ఘల్ ఘల్
॥రంగు॥
సుందరి కన్నుల చందనమద్దిన చల్లని పున్నమి వెన్నెల ముందు

**చరణం : 1**

పూవైనా పూస్తున్నా నీ పరువంగానే పుడతా
మధుమాసపు మాలల
మంటలు రగిలించే ఉసురై
నీవే నా మదిలో ఆడ
నేనే నీ నటనై రాగా
నా నాడుల నీడకు నడకలు
నీ శబ్దం ఉందే హో
తోడే దొరకని నాడు
విలవిలలాడే ఒంటరి నేను
॥ప్రేమించే॥

**చరణం : 2**

నెల నెల వాడుక అడిగి నెలవంకల గుడి కడ దామా
నా పొదరింటికి వేరే అతిథులు రా తరమా
తుమ్మెద తేనెలు తేలే నీ మదిలో చోటిస్తావా
నే ఒదిగే ఎదపై ఎవరో నిదురించ తరమా
నీవు సంద్రం చేరి గలగల పారే నది తెలుసా
॥ప్రేమించే॥ ॥రంగు॥

**చిత్రం : నువ్వు నేను ప్రేమ (2006)**
**రచన : వేటూరి**
**సంగీతం : ఎ.ఆర్.రెహమాన్**
**గానం : నరేష్ అయ్యర్, శ్రేయా ఘోషల్**

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | | | | | | 2 | 4 | 6 |
| 5 | 2 | 9 | 4 | | | 1 | | |
| | | | | 7 | 8 | | 3 | |
| | | | 7 | | | | 6 | |
| | 3 | | 5 | | 6 | | 9 | |
| | 4 | | | | 2 | | | |
| | 9 | | 8 | 1 | | | | |
| | | 4 | | | 7 | 9 | 2 | 1 |
| 1 | 7 | 5 | | | | | | 3 |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3×3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 1 | 3 | 9 | 7 | 8 | 2 | 6 | 4 |
| 4 | 9 | 8 | 2 | 6 | 5 | 1 | 7 | 3 |
| 7 | 6 | 2 | 4 | 3 | 1 | 8 | 9 | 5 |
| 1 | 5 | 4 | 8 | 9 | 7 | 6 | 3 | 2 |
| 8 | 7 | 6 | 5 | 2 | 3 | 9 | 4 | 1 |
| 3 | 2 | 9 | 6 | 1 | 4 | 7 | 5 | 8 |
| 2 | 4 | 5 | 7 | 8 | 9 | 3 | 1 | 6 |
| 9 | 8 | 1 | 3 | 5 | 6 | 4 | 2 | 7 |
| 6 | 3 | 7 | 1 | 4 | 2 | 5 | 8 | 9 |

## భార్య భయపెడితే?

భార్యాభర్తల మధ్య ప్రస్తుతం ట్రెండ్‌లో ఉన్న ప్రేమ, అసూయ, ద్వేషాలు, ఎప్పటికో కనిపించే ప్రేమ. దానిలో నుంచి పొంగుకొచ్చే రొమాన్స్... ఇవన్నీ మించితే వారి జీవితాలు ఎలా ఉంటాయి అనే పాయింట్‌తో 'వైఫ్.ఐ' చిత్రాన్ని తెరకెక్కించాం అని చిత్రబృందం తెలిపింది. 'ఏడు



● సాక్షి నిదియా, అభిషేక్ రెడ్డి

చేపల కథ' సినిమాతో టెంప్ట్ రవిగా ఫేమస్ అయిన అభిషేక్ రెడ్డి, సాక్షి నిదియా జంటగా నటించిన చిత్రం 'వైఫ్.ఐ'. జి.ఎస్.ఎస్.పి కల్యాణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి జి.చరితా రెడ్డి నిర్మాత. ''మనిషి అనే ప్రతి ఒక్కరూ తప్పులు చేస్తారు. ఆ తప్పు ఏంటో తెలుసుకుంటే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. మా సినిమా ఫస్ట్ లుక్ అందర్నీ ఆకట్టుకుంది. సినిమా విజయంపై యూనిట్ ధీమాగా ఉన్నాం'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం:వినోద్ యాజమాన్య.

## ఇట్స్ ఫైటింగ్ టైమ్



● రవితేజ

విలన్స్‌పై వీరవిహారం చేస్తున్నారు రాజా. తప్పు చేసిన వారి తుక్కు రేగ్గొడుతున్నారు. మరి.. రాజాకు కోపం వచ్చేలా విలన్స్ ఏం చేశారు? ఆ ఫైట్ విజువల్‌గా ఆడియన్స్‌కు ఎంత కిక్ ఇవ్వనుంది? అనే అంశాలను వెండితెరపై చూడాలి. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా, ఒక్క క్షణం' వంటి విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన వీఐ ఆనంద్ దర్శకత్వంలో రవితేజ హీరోగా తెరకెక్కుతున్న సినిమా 'డిస్కోరాజా'. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, నభా నటేష్, తాన్యా హోప్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. దిలీప్ సుబ్రరాయన్ నేతృత్వంలో పోరాట సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ నలభై శాతం పూర్తయిందని తెలిసింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

## సినిమా అదిరింది అంటున్నారు

**- సందీప్ కిషన్**

''కంటినిండా నిద్రపోయి సుమారు వారమైంది. ఎంతో నమ్మి 'నిను వీడని నీడను నేనే' సినిమా తీశాం. ప్రేక్షకులు ఎలా స్పందిస్తారోనని టెన్షన్ పడ్డాను. మొన్న మేమంతా తిరుమలకు వెళ్లాక, టెన్షన్ తట్టుకోలేక ఫోన్ స్విచ్ఛాఫ్ చేశా. శుక్రవారం ఉదయం ఆట పడ్డాక ఫోన్ ఆన్ చేశా'' అని సందీప్ కిషన్ అన్నారు. కార్తీక్ రాజు దర్శకత్వంలో సందీప్ కిషన్, అనన్యాసింగ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'నిను వీడని నీడను నేనే'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో దయా పన్నెం, సందీప్ కిషన్, విజి సుబ్రహ్మణ్యన్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. తొలి ఆట నుంచి సినిమాకు హిట్ టాక్ రావడంతో టపాసులు కాల్చి సక్సెస్‌ను సెలబ్రేట్ చేసుకున్నారు యూనిట్. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''శుక్రవారం ఒంటిగంటకు ఫోన్ స్విచ్చాన్ చేశా. చాలామందికి ఫోన్లు చేశా.. 'చాలా మంచి సినిమా తీశారు భయ్యా. ఫస్టాఫ్ అదిరింది. లాస్ట్‌లో ఎమోషన్ అదిరిపోయింది, సినిమా సూపర్‌గా ఉంది.. చివరలో ఏడ్చాం' అంటూ చాలా పాజిటివ్‌గా చెబుతుంటే సంతోషంగా అనిపించింది. చాలా రోజుల తర్వాత డిస్ట్రిబ్యూటర్లు ఫోన్లు చేసి, కలెక్షన్లు బావున్నాయని చెబుతున్నారు. ఈ సక్సెస్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి సోమవారం నుంచి సక్సెస్ టూర్ ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ''మా బ్యానర్‌లో తీసిన తొలి చిత్రం సక్సెస్‌ఫుల్ అయింది. షోలన్నీ హౌస్‌ఫుల్ అవుతున్నాయి. మరికొన్ని షోలు పెంచమని అడుగుతున్నారు'' అని దయా పన్నెం అన్నారు. ''నా తొలి తెలుగు సినిమా హిట్ కావడంతో సంతోషంగా ఉన్నా. సందీప్ కిషన్ ఈజ్ బ్యాక్ విత్ ఎ బ్యాంగ్. మా టీమ్ అందరికీ థ్యాంక్స్'' అన్నారు అనన్యా సింగ్. నిర్మాత సుప్రియ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు శివ చెర్రి, సీతారామ్ పాల్గొన్నారు.



● అనన్యా సింగ్, సందీప్ కిషన్, దయా పన్నెం, శివ చెర్రి

## పన్నెండు కిలోలు తగ్గానోచ్



● నితిన్

వరుస సినిమాలను లైన్లో పెట్టి ఈ సారి మస్త్ ప్రీ ప్లాన్డ్‌గా ముందుకెళుతున్నారు హీరో నితిన్. ఈ క్రమంలో ఫిట్‌నెస్‌పై కూడా ఫోకస్ పెట్టిన ఆయన రెండు నెలల్లో పన్నెండు కేజీల బరువు తగ్గారు. ''కొన్ని నెలల క్రితం నా భుజానికి గాయమైంది. ఈ గాయం నుంచి కోలుకునే లోపే అనుకోకుండా నా చేయి కాలింది. ఇక ఆ సమయంలో చేసేది ఏమీ లేక బాగా విశ్రాంతి తీసుకున్నాను. ఫలితంగా బరువు పెరిగాను. దీంతో మళ్లీ వర్కౌట్స్‌పై దృష్టి పెట్టి రెండు నెలల్లో 12 కేజీల బరువు తగ్గాను. నా జిమ్ ట్రైనర్ వంశీకృష్ణకు థ్యాంక్స్'' అని నితిన్ అన్నారు. ప్రస్తుతం చంద్రశేఖర్ ఏలేటి, వెంకీ కుడుముల, వెంకీ అట్లూరి,కృష్ణ చైతన్య దర్శకత్వాల్లో తెరకెక్కనున్న సినిమాల్లో హీరోగా నటించనున్నారు నితిన్.

## స్వచ్ఛమైన ప్రేమకథను కాలుష్యం చేయలేదు



● యష్ రంగినేని, 'మధుర' శ్రీధర్

''మనకు థియేటర్స్ ఎక్కువైపోయాయి.. ఫీడింగ్ తక్కువైంది. చిన్న సినిమాలకు మంచి రోజులొచ్చాయి. ఎగ్జిబిటర్స్ అందరూ చిన్న సినిమాలవైపే చూస్తున్నారు. పెద్ద నిర్మాతలు కూడా చిన్న సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు'' అని నిర్మాత 'మధుర' శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆనంద్ దేవరకొండ, శివాత్మిక జంటగా కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దొరసాని'. సురేశ్ బాబు సమర్పణలో 'మధుర' శ్రీధర్, యష్ రంగినేని నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''పొయెటిక్, మ్యూజికల్ లవ్‌స్టోరీగా ఈ సినిమాను తెరకెక్కించాం. 1980లో తెలంగాణ ఎలా ఉంది? గడి సంస్కృతి ఏంటి? అనే విషయాలను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. సినిమాలో అచ్చం తెలంగాణ వాతావరణం కనిపించిందంటున్నారు. పాత కాలాన్ని సృష్టించడానికి చాలా కష్టపడ్డాం. పౌడర్ డబ్బా కోసమే 4–5 నెలలు తిరిగాం. 14లక్షలు పెట్టి గడిని బాగుచేయించి షూట్ చేశాం. మరో 5 లక్షలు ఆ ఊరి అభివృద్ధి కోసం అందించాం. ఈ చిత్రంతో 60 మంది కొత్తవాళ్లను పరిచయం చేశాం. ఓపెనింగ్ తక్కువగా ఉన్నప్పటికీ మ్యాట్నీ నుంచి కలెక్షన్లు పెరిగాయి. ఇంతకుముందు వచ్చిన తెలుగు గొప్ప ప్రేమ కథలు తీసుకుంటే తెలుగు దర్శకులు తీసినవి తక్కువ. ఆనంద్, శివాత్మిక కావాలనుకుంటే మంచి గ్లామర్ ఉన్న సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకోవచ్చు. కానీ, ఇలాంటి సబ్జెక్ట్‌ను ఎంచుకోవడంలోనే ఆర్టిస్ట్‌గా వాళ్ల నిబద్ధత, నిజాయతీ తెలుస్తోంది. కమర్షియల్ అంశాలు జోడించి ఈ స్వచ్ఛమైన ప్రేమకథను కాలుష్యం చేయలేదు. ప్రేక్షకుల్లో టాక్ బాగుంది. పాజిటివ్ టాక్‌ని మించిన ప్రమోషన్ ఏంటి? సోషల్ మీడియాలో కవిత్వాలు రాస్తున్నారు. నాలుగు వారాలుగా మంచి సినిమాలు రావడం శుభ పరిణామం. కొత్త సినిమా ఆగస్ట్‌లో స్టార్ట్ అవుతుంది. ఆనంద్ దేవరకొండతో మరో సినిమా, మహేంద్రతో ఓ సినిమా చేస్తాం'' అన్నారు.

## అంతా ఆశ్చర్యమే!

''పూర్వకాలంలో రాజులు అంత భారీ కిరీటాలు, బరువైన అభరణాలు ఎలా ధరించారా? అని నాకు ఆశ్చర్యంగా ఉంది. సినిమా కోసం ఆభరణాలు ధరించడానికే నాకు సుమారు గంటాగంటన్నర సమయం పట్టేది'' అంటున్నారు సోనూసూద్. కన్నడ చిత్రం 'కురుక్షేత్ర'లో ఆయన అర్జునుడి పాత్రను పోషిస్తున్నారు. దర్శన్ ముఖ్య పాత్రలో నటించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ పాత్ర గురించి సోనూ సూద్ మాట్లాడుతూ – ''పౌరాణిక సినిమాలో నటించడం నాకు సరికొత్త అనుభవం. ఈ సినిమా కోసం ఏర్పాటు చేసిన సెట్లు, గుర్రాలు, యుద్ధ వాతావరణంలో 600 మంది ఆర్టిస్టులను చూసి ఆశ్చర్యపోయాను. ఇలాంటి సినిమా చేయడం మర్చిపోలేని అనుభూతి'' అన్నారు. 'కురుక్షేత్ర' చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లోనూ రిలీజ్ కానుంది.



● సోనూ సూద్

## విశ్రాంతి లేదు



● కీర్తి సురేశ్

కీర్తి సురేశ్ అండ్ టీమ్ యూరప్ నుంచి ఇండియాకి రిటర్న్ అయ్యారు. అక్కడి షెడ్యూల్ ముగించుకుని వచ్చారు కదా! కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుంటారేమో? అంటే నో రెస్ట్ అట. మరో వారం నుంచి మళ్లీ పనిలో పడిపోతారట. కీర్తి సురేశ్ ముఖ్య పాత్రలో నూతన దర్శకుడు నరేంద్రనాథ్ ఓ లేడీ ఓరియంటెడ్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మహేశ్ కోనేరు నిర్మాత. ఈ చిత్రానికి 'సఖి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఇటీవలే స్పెయిన్‌లో నెల రోజులు చిత్రీకరణ జరిపారు యూనిట్. వారం రోజుల్లో హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ స్టార్ట్ చేయనున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించనున్నారు. రాజేంద్రప్రసాద్, నదియా, నరేశ్, కమల్ కామరాజు కీలక పాత్రలో నటించనున్న ఈ చిత్రాన్ని దసరాకు రిలీజ్ చేయనుంది చిత్ర యూనిట్.

## నిర్మాణం అంటే రోజుకో పెళ్లి చేసినట్టే



● వివేక్ కూచిభొట్ల, సునీత తాటి

''నిర్మాణంలో ముగ్గురు, నలుగురు ఇన్వాల్వ్ అయినప్పుడు వ్యత్యాసాలు రావడం సహజం. కానీ, మా అందరిలో ఒకరి బలం ఏంటో మరొకరికి తెలుసు. అలా అందరం కలసి సాఫీగా వర్క్ చేశాం. మా అందరి రథసారథి సురేశ్‌బాబు'' అని సునీత తాటి, వివేక్ కూచిభొట్ల అన్నారు. సమంత లీడ్ రోల్‌లో లక్ష్మి, రాజేంద్రప్రసాద్, రావు రమేశ్, నాగ శౌర్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ బేబీ'. నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. సురేశ్ బాబు, సునీతా తాటి, వివేక్ కూచిభొట్ల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలైంది. ఈ సందర్భంగా సునీత తాటి మాట్లాడుతూ– ''ఇంతకు ముందు 'కొరియర్ బాయ్, సాహసం శ్వాసగా సాగిపో' వంటి సినిమాలకు నిర్మాతగా వ్యవహరించాను. 2017లో 'ఓ బేబీ' సినిమా మొదలైంది. ఈ పాత్రకు లక్ష్మీగారు బావుంటారన్నది నందినీరెడ్డి ఐడియా. రాజేంద్రప్రసాద్ లుక్ బాగా సెట్ అయింది. ఆయన లుక్‌ని అల్లు అర్జున్ కూడా బాగా అభినందించారు. 'ఓ బేబీ'ను హిందీలో రీమేక్ చేస్తాం. ఆలియా భట్ హీరోయిన్ అయితే బాగుంటుందనుకుంటున్నాం. వచ్చే ఏడాది సెట్స్ మీదకు వెళ్తుంది. కన్నడ, బెంగాలీలోనూ రీమేక్ కోసం అడుగుతున్నారు. చైనాలో రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమాను బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తీసుకెళ్తున్నాం. ఇంత మంచి కథ ఇచ్చినందుకు మేం వాళ్లకు ఇవ్వబోయే గౌరవం అది'' అన్నారు సునీత.

**వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ–** ''మా సినిమా విడుదలైన తొమ్మిదో రోజు కూడా బుక్ మై షోలో ట్రెండింగ్‌లో ఉంది. ఓవర్సీస్‌లో కూడా బాగా ఆడుతోంది. సినిమా నిర్మాణం అంటే రోజుకో పెళ్లి చేసినట్టే. ఫిల్మ్ మేకింగ్ చాలా ఈజీగా అనిపించేట్టు సురేశ్‌బాబు చేశారు. ఆయన సినిమాల్లో ప్రాఫిట్స్ ఇచ్చి మాకు పాఠాలు నేర్పారు. ప్రస్తుతం మేం చేస్తున్న 'వెంకీ మామ' సినిమా 70శాతం పూర్తయింది. దసరాకు రిలీజ్ చేద్దామనుకుంటున్నాం. మా ముగ్గురి కాంబినేషన్‌లో మూడు సినిమాలు రెడీ అవుతున్నాయి. త్వరలోనే వివరాలు చెబుతాం'' అన్నారు.

## ఫలితాన్ని ప్రేక్షకులే నిర్ణయిస్తారు



● పరిణీతి చోప్రా

యాక్టర్స్ జర్నీలో హిట్‌లు, ఫ్లాప్‌లు సహజం. కానీ, వారి కొత్త సినిమా విడుదలయ్యే ప్రతిసారి ఎంతో కొంత ఆందోళన చెందుతుంటారు కొందరు హీరోహీరోయిన్లు. ఈ విషయంపై మీ ఆలోచనలు ఎలా ఉంటాయి? అని బాలీవుడ్ భామ పరిణీతి చోప్రాను అడిగినప్పుడు...''ఒక సినిమా ఫస్ట్ కాపీ చూసిన తర్వాత ఈ సినిమా ఆడుతుందా? లేదా? అనే విషయం నాకు తెలిసిపోతుంది. కానీ, అన్నివేళల మన ఊహ నిజం కాకపోవచ్చు. అందుకే ఆడియన్స్ నిర్ణయం కోసం ఎదురుచూడాలి. సినిమాల గురించి ఆడియన్స్‌ను మించిన విమర్శకులు లేరని నా అభిప్రాయం'' అన్నారు పరిణీతి. మరి షూటింగ్ లొకేషన్‌లో సినిమా రిజల్ట్‌ని గెస్ చేయగలరా మీరు? అన్న ప్రశ్నను ఆమె ముందు ఉంచితే..''కొన్ని సార్లు తెలిసిపోతుంది. కానీ నటిగా నా పాత్రకు పూర్తి న్యాయం చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. దానిపైన ఎక్కువగా ఫోకస్ పెడతాను. అందు కోసం ప్లాన్స్ వేస్తాను. ఇక సినిమా రిజల్ట్‌ను ఆడియన్స్ డిసైడ్ చేస్తారు'' అన్నారు పరిణీతి. ప్రస్తుతం 'ద గాళ్ ఆన్ ది' ట్రైన్ సినిమా కోసం ఆగస్టులో లండన్ వెళ్లనున్నారీ బ్యూటీ. అలాగే బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ బయోపిక్ 'సైనా' ను సెప్టెంబర్‌లో స్టార్ట్ చేయనున్నట్లు చెప్పారామె.

## జాన్ ఎటాక్



● జాన్ అబ్రహాం

బాలీవుడ్ యాక్షన్ హీరోల జాబితాలో జాన్ అబ్రహాం పేరు ముందు వరుసలో ఉంటుంది. వెండితెరపై యాక్షన్ హీరోగా ఆడియన్స్ చేత మంచి మార్కులు వేయించుకున్న జాన్ ఇప్పుడు మరో యాక్షన్ సినిమాతో వచ్చే ఏడాది బాక్సాఫీస్‌పై ఎటాక్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఆయన నటించనున్న తర్వాతి చిత్రానికి 'ఎటాక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ధీరజ్ వాధవన్, అజయ్ కపూర్‌లతో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు జాన్. ఈ సినిమాతో లక్ష్యరాజ్ ఆనంద్ దర్శకునిగా పరిచయం కానున్నారు. డిసెంబర్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు. ''కొన్ని వాస్తవ సంఘటనలకు కల్పిత అంశాలను జోడించి ఈ సినిమాను తెరకెక్కించ నున్నాం. ఈ ప్రాజెక్ట్ కోసం ఎగ్జైటెడ్‌గా ఉన్నాను'' అన్నారు జాన్ అబ్రహాం. 'ఎటాక్' చిత్రాన్ని ఓ ఫ్రాంచైజీలా కొనసాగించాలని టీమ్ భావిస్తోందని టాక్.

## ఆగస్టులో ఎవరు



● 'ఎవరు' ఫస్ట్‌లుక్

అడివి శేష్ కథానాయకుడిగా నటించిన థ్రిల్లర్ మూవీ 'ఎవరు'. ఇందులో రెజీనా కథానాయికగా నటిస్తున్నారు. వెంకట్ రామ్ జీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పెరల్ వి. పొట్లూరి, పరమ్ వి. పొట్లూరి, కెవిన్ అన్నె నిర్మించారు. నవీన్ చంద్ర కీలక పాత్ర చేశారు. అడివి శేష్ పోలీసాఫీసర్‌గా నటిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. రక్తం అంటిన అద్దాన్ని అడివి శేష్‌కు చూపిస్తూ ఏదో చెప్పాలని రెజీనా ప్రయత్నిస్తున్నట్లు ఫస్ట్ లుక్‌లో కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 23న విడుదల చేయాలనుకుంటున్నారు చిత్ర యూనిట్. ఈ సినిమాకు సంగీతం: శ్రీచరణ్ పాకాల.

## బాలీవుడ్ కాదు కాపీవుడ్



● బాబా సైగల్

''బాలీవుడ్‌లో రీమిక్స్ పాటల సంస్కృతి ఎక్కువైపోయింది. దీన్ని ఆపేస్తే బెటర్. క్లాసిక్ పాటల్ని రీమిక్స్ చేస్తే ఎటువంటి తప్పు లేదు. కానీ ఇటీవల వస్తున్న రీమిక్స్ సాంగ్స్‌లో క్వాలిటీ చాలా దారుణంగా ఉంది'' అని సింగర్ బాబా సైగల్ అన్నారు. ఈ విషయంలో తన అభిప్రాయాన్ని పంచుకుంటూ – ''కొత్త ట్యూన్స్ తయారు చేసే క్రియేటివిటీ అయిపోయిందా లేకపోతే పాత పాటల పాపులారిటీని క్యాష్ చేసుకోవాలనుకుంటున్నారా? మన దగ్గర చాలా ప్రతిభ ఉంది. దాన్ని సరిగ్గా వినియోగించుకోవడం మానేసి ఒరిజినల్ పాటల్ని పాడు చేస్తున్నాం. ప్రస్తుతం బాలీవుడ్ కాపీవుడ్‌లా మారిపోయింది'' అన్నారు.



● రజిత్

## అది మా అందరి వైఫల్యం

సంజయ్ దత్, మాధురీ దీక్షిత్, వరుణ్ ధావన్, ఆలియా భట్, సోనాక్షీ సిన్హా ముఖ్య పాత్రల్లో అభిషేక్ వర్మన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కళంక్'. ఎన్నో అంచనాలతో ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలయిన ఈ చిత్రం నిరాశపరచింది. ఈ చిత్ర వైఫల్యం గురించి వరుణ్ ధావన్ స్పందించారు. ''కళంక్' సినిమాను ప్రేక్షకులు ఆదరించలేదంటే అది బ్యాడ్ ఫిల్మ్ అని అర్థం. ఎక్కడో మా టీమ్ అందరూ ఫెయిల్ అయ్యాం. సినిమా అనేది టీమ్ అందరి కష్టం. కేవలం దర్శకుడినో, నిర్మాతనో తప్పుబట్టడం సరికాదు. టీమ్‌లో భాగమైనందుకు నేను కూడా నిందని తీసుకుంటున్నాను. ఫెయిల్యూర్‌ని మన కచ్చితంగా ప్రభావం చూపాలి. లేదంటే మనం చేస్తున్న పనిని ప్రేమతో చేస్తున్నట్టు కాదని నా ఉద్దేశం'' అన్నారు.

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
14-7-2019

# గురుబ్రహ్మ గురువిష్ణు

**గురు స్థానం పరమ పవిత్రమైనది. అజ్ఞానపు చీకటి నుండి జ్ఞానమనే వెలుగును నాలుగు వైపులకు ప్రసరింపజేసే శక్తి ఒక్క గురువుకే వుంది. అటువంటి గురువును పూజించడం మన సంప్రదాయం. ప్రతి సంవత్సరం హిందువులు ఆషాఢ పౌర్ణమి నాడు వేద వ్యాసుని జయంతిని గురుపౌర్ణమిగా జరుపుకుంటూ, గురువులను పూజించడం సంప్రదాయం.**



నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

16 మంగళవారం గురు పౌర్ణమి

బ్రహ్మ మానస పుత్రుడు వశిష్ట మహాముని, ఆతని కుమారుడు శక్తి. శక్తి కుమారుడు పరాశరుడు. పరాశర మునీంద్రుడికి, సత్యవతికి జన్మించినవాడు వ్యాసుడు. సత్యవతి అసలు పేరు కాళి. మత్స్యగంధి అని కూడా అంటారు.

ఏక రాశిగా వున్న వేదాన్ని ఋక్, యజు, సామ, అధర్వణ అనే నాలుగు భాగాలుగా చేసినందుకు ఆతడు వేద వ్యాసుడు అయ్యాడు. నావ యందు (ద్వైపాయనం) జన్మించాడు కాబట్టి, నలుపు రంగులో వున్నాడు కాబట్టి కృష్ణ ద్వైపాయనుడు అని పేరుగాంచాడు. పద్దెనిమిది పురాణాలను, పద్దెనిమిది ఉప పురాణాలను, విజ్ఞాన సర్వస్వమైన మహాభారతాన్ని, బ్రహ్మసూత్రాలను, ఆధ్యాత్మ రామాయణాన్ని రచించి, మానవాళికి కర్మ, భక్తి, జ్ఞానమార్గాలను ఉపదేశించాడు. ప్రాపంచిక, ఆధ్యాత్మిక జీవన విధానాలను సమన్వయం చేసుకోవడంలోనే మానవ జీవిత వికాసం ఉందని వ్యాస మహర్షి బోధించాడు.

### రామకృష్ణ పరమహంస



**అధునాతన సమాజంలో సనాతన ధర్మాన్ని నిలబెట్టి, హేతువాదిగా ఉన్న నరేంద్రుని దృష్టికోణం మార్చి వివేకానందునిగా అందించిన మహాప్రవక్త, పరమరుషి రామకృష్ణపరమహంస. ఆధ్యాత్మ చింతనకే జీవితాన్ని అంకితం చేసిన వాడు, ఆలిలోనూ అమ్మను చూడగలిగిన పరమభక్తి పరిపూర్ణుడు రామకృష్ణులు.**

**బోధలు:** ● అన్ని జీవులలో దైవత్వం ఒక్కడే భగవంతుడు, అన్నిమతాల సారాంశం ఒక్కటే ● మానవ జీవితంలో దాస్య కారకాలు కామం, స్వార్థం. కామం, కాంచనం ● వీటినుండి విడివడితే భగవంతున్ని పొందవచ్చు ● మానవ సేవే మాధవ సేవ ఒక గమ్యానికి ఎన్నోమార్గాలున్నట్లే భగవంతున్ని చేరడానికి మతాలు కూడా మార్గాలే ● అలాగే స్వామి వివేకానంద బోధలలో చాలా భాగం రామకృష్ణులవే.

### బుద్ధ భగవానుడు



**సకల సుఖాలను అనుభవించగలిగే రాజకుటుంబంలో పుట్టినా, సర్వమానవ సంక్షేమం కోసం, మానవులందరినీ దుఃఖ విముక్తులను చేయడం కోసం వాటన్నింటినీ తృణప్రాయంగా త్యజించిన త్యాగశీలత, తనలో నిండిన జ్ఞానజ్యోతులను అందరిలోనూ వెలిగించాలనే తృష్ణ ఆయనను భగవానుడిగా మార్చాయి.**

**బోధలు:** ● తోటి మానవులను ప్రేమించటం, దుఃఖాలకు మూలమైన కోరికలను విడనాడటం, జీవహింస, అబద్ధాలు, దొంగతనాలు, మత్తుపదార్థాల జోలికి వెళ్లనని ప్రతిజ్ఞ చేయడం వల్ల మానవాళి వెలుగుబాటలోకి పయనించగలదని, ఆయన నమ్మాడు, ఆచరించాడు, బోధించాడు ● శాంతంతో కోపాన్ని, సాత్వికతతో హింసను, దానంతో లోభాన్ని, ప్రేమతో ద్వేషాన్ని సత్యంతో అసత్యాన్ని జయించండి, సర్వప్రాణుల పట్ల సానుభూతి కలిగి ఉండటటమే నిజమైన ధర్మం లేక మతం అని ఆయన బోధించాడు.

### ఆదిశంకరులు



**సమకాలీన హిందూ మతం ఆలోచనా సరళిపై అత్యంత ప్రభావం కలిగిన సిద్ధాంతవేత్త హిందూమతాన్ని ఉద్ధరించిన త్రిమతాచార్యులలో ప్రథములు. గురువు, మహాకవి ఆది శంకరాచార్యులు. ఈయనకే శంకర భగవత్పాదులు అని కూడా పేరు. శంకరులు ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని అద్వైతం అంటారు**

**బోధలు:** ● బ్రహ్మమే సత్యం, జగత్తు మిథ్య ● జీవుడికి, బ్రహ్మనికి భేదం లేదు ● అద్వైతం ప్రకారం జీవన మార్గంలో జన్మం మొదలు మరణం వరకు సాధన ద్వారా 'తత్వమసి' అనే సత్యాన్ని గ్రహించాలి ● అనుభవించేవాడికి, అనుభవానికి భేదం లేదని సాధన ద్వారా తెలుస్తుంది. ఇలా బ్రహ్మజ్ఞానాన్ని తెలిసికొన్నవారే జీవన్ముక్తులు, మహాత్ములు.

### రామానుజాచార్యులు



**వీరిని సాక్షాత్తూ ఆదిశేషుని అవతారంగా పేర్కొంటారు. విశిష్టాద్వైత మతాన్ని వ్యాప్తిలోకి తెచ్చిన యతి ఆయన.**

**బోధలు:** ● దేవుడిని పూజించటం, మోక్షాన్ని సాధించటం, మానవుడిగా జన్మించిన ప్రతి ఒక్కరి హక్కు ● ఆ హక్కును ధిక్కరించే అధికారం ఎవ్వరికీ లేదు ● దేవుని దృష్టిలో అందరూ సమానమే ● కుల మత తారతమ్యాలను పరిశీలించి అర్థం చేసుకోవటం మహత్వం ● వైషమ్యాలను పెంచుకోవటం మూర్ఖత్వం ● మునుపు గురువులు చెప్పినదంతా నిజమేనని గుడ్డిగా నమ్మవలసిన అవసరం లేదు ● వారు చెప్పినదాన్ని తర్కానికి గురిచేసి అది ఒప్పో, తప్పో నిర్ణయించుకోవటం పాపం కాదు ● ఈ విషయంలో అధైర్యపడవలసిన పనిలేదు ● ఒక పనివల్ల పదిమందికి మేలు జరుగుతున్నప్పుడు, తమకు కీడు జరిగినా, పదిమందికి జరిగే మేలుకై, తమ కీడును లెక్క చేయవలసిన అవసరం లేదు ● సమాజ శ్రేయస్సు ముఖ్యం కానీ వ్యక్తిగత శ్రేయస్సు కాదు.

### మధ్వాచార్యులు



**ద్వైత వేదాంతాన్ని బోధించిన మతాచార్యులు, వాయుదేవుని అవతారంగా పేర్కొంటారు వీరిని.**

**బోధలు:** ● జీవుడు వేరు, బ్రహ్మము వేరు ● జీవుడు మిథ్య కాదు. అలాగే జడ జగత్తు కూడా మిథ్య కాదు ● ఈశ్వరుడు ఎంత సత్యమో జీవజగత్తులు కూడా అంత సత్యం ● భక్తి ఒక్కటే ముక్తిదాయకం. అది జ్ఞానపురస్కృతమైన భక్తి అయి ఉండాలి.

### గురు నానక్



**పది మంది సిక్కు గురువులలో మొదటి వాడు. ఇతను హిందూ, ఇస్లామియా మత గ్రంథాలు చదివాడు కానీ ఇతను ఈ రెండు మతాలకి భిన్నమైన సిక్కు మతాన్ని స్థాపించాడు. సిక్కు మతం ఏకేశ్వరోపాసక మతం.**

● గురువంటే భగవంతుడి గొంతుకే. జ్ఞానానికి, సంతృప్తికి గురువే మూలం ● అహం, ఆగ్రహం, అత్యాశ, అంటిపెట్టుకుని ఉండడం, లోభం, కామం అనేవి శత్రువులు. వీటిని ఎప్పుడూ దరిచేరనీయరాదు ● వివక్ష, అస్పృశ్యత అనేవి నేరాలుగా, వాటిని పాటించేవారిని నేరస్థులుగా పరిగణించాలి ● నీకున్నదానిని ఇతరులతో పంచుకోవడం, అవసరంలో ఉన్న వారిని ఆదుకోవడం, నిజాయితీగా, ధర్మబద్ధంగా, ఆత్మవంచన, అవినీతికి దూరంగా జీవించ డం ఉత్తమ మానవుల ధర్మం.

### వర్ధమాన మహావీరుడు



**జైనమత స్థాపకుడు, తీర్థంకరులలో 24వ వాడు.**

**బోధలు:** ● సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ జీవనం అనేవి మోక్షమార్గాలు. వీటినే త్రిరత్నాలు అంటారు ● పార్శ్వనాథుడు ప్రతిపాదించిన అహింస, సత్యం, అపరిగ్రహం, అస్తేయం అనే నాలుగింటికి బ్రహ్మచర్యం అనే దానిని వర్ధమానుడు కలిపాడు. ఈ ఐదింటిని పంచవ్రతాలు అంటారు ● వీటిని పాటిస్తూ త్రిరత్నాలతో జీవించిన వారికి కైవల్యం లభిస్తుందని జైనం బోధిస్తుంది ● కులాలతో సంబంధం లేకుండా పవిత్రమైన జీవనం గడుపుతూ, తపస్సు చేస్తే ఎవరైనా కైవల్యం పొందవచ్చును.

### దత్తాత్రేయుడు



**అత్రి, అనసూయల కుమారుడు, త్రిమూర్తుల అంశతో జన్మించిన దత్తాత్రేయుడు గురువులలో ప్రథముడు.**

**బోధలు:** ● 'కావాలి' అనే కోరికను విడనాడి, సర్వగతుడైన దైవం మీద మనస్సు నిలిపితే గమ్యం చేరతారు ● ఇతర గురువులు ఎంత గొప్పవారైనా, నీ గురువు ప్రతిభ ఎంత తక్కువైనా, చలనం లేని విశ్వాసంతో సద్గురువు చరణారవిందాలనే అంటిపెట్టుకో. అదే నిన్ను దరి చేరుస్తుంది ● ఏ పని చేసినా సంపూర్ణంగా చెయ్యి. అలా కాని పక్షంలో ఆ పని చేయడానికి ఒప్పుకోవద్దు ● 'నన్ను సరిగ్గా వినియోగిస్తే నీకు చక్కగా సేవ చేస్తా' అంటుంది ధనం. 'నన్ను సరిగ్గా వండితే నీకు బాగా ఉపయోగపడతాను' అంటుంది అన్నం. దేవుని సేవకు వెళ్లేటప్పుడు ఆడంబరం పనికి రాదు.

### సద్గురుసాయినాథుని బోధనలు



● ఈ బాధలు, సంతోషాలు, సుఖాలు దుఃఖాలు అన్నీ మాయ ● అలాగే కష్టసుఖాలు, బాధా సంతోషాలు– వీటి గురించి ఆలోచించినంతసేపు అవి మనల్ని పట్టి పీడిస్తాయి, బాధిస్తాయి. వాటి గురించి ఆలోచించకుండా ఉంటే ఏ ఒక్క బాధా ఏమీ చేయదు ● ప్రతి కోరికకు ఒక కారణం ఉంటుంది. కోరికలు లేకపోతే ఈ జీవితం ఎంతో సుఖమయంగా ఉంటుంది ● అవసరమైన వారిని కాపాడకుండా, అనర్హులకిచ్చే దానం అనర్థాలకు దారితీస్తుంది ● భగవంతుని భక్తితో జయించాలి తప్ప అహంకారం అణుమాత్రం పనికిరాదు ● ప్రతి మనిషిలోనూ పరమాత్ముడున్నాడనే సత్యాన్ని ఎవరైతే మరువకుండా ఉంటారో వారికి శత్రువులుండరు. కాబట్టి ప్రతి ఒక్కరినీ దైవస్వరూపులుగా భావించి గౌరవించు.

### భగవాన్ సత్యసాయిబాబా



**దత్తాత్రేయుడి పరంపరలోని వారిలో సత్యసాయిని కూడా ఒకరేనని విశ్వసిస్తారు భక్తులు. ఎన్నో మహిమలతో పాటు దానధర్మాలు కూడా చేసి అశేష భక్త ప్రజానీకం ఆదరణను చూరగొన్న వారు సత్యసాయి.**

**బోధలు:** ● మంచిరోజు కోసం ఎదురు చూడవలసిన పనిలేదు. భగవంతునిపై తీవ్రమైన భక్తి ఏ రోజు ఉంటుందో, ఆ రోజే మంచి రోజు ● భగవంతునిపై భారం వేసి పని చేస్తే, దాని మంచి చెడులు ఆయనే చూసుకుంటాడు ● మన సుఖానికి, కష్టానికి మనం చేసిన కర్మలే కారణం ● కర్మఫలం పునర్జన్మకు కారణం అవుతుంది ● కర్మఫలం అనుభవించి తీరాల్సిందే ● భక్తి అంటే పూల హారం వేసి, పళ్లు పాదాల దగ్గర పెట్టి, నమస్కారం చేయడం కాదు ● మనస్సును, బుద్ధిని సమర్పించి, ద్వేషం లేకుండా సదా సంతోషం, తృప్తి, నిర్మల మనస్సు, సమత్వం కలిగి సమర్పణ భావం కలిగి ఉండడం ●నీ దృష్టిలో దోషం లేకుండా చూసుకోవడమే నీ కర్తవ్యం ● పరుల దృష్టిని ఆధారం చేసుకుని బాధపడనక్కరలేదు.

### భగవాన్ రమణ మహర్షి



**భగవంతుణ్ణి నీ అంతర్నేత్రంలో దర్శించడానికి నిన్ను నీవు తెలుసుకునే ఎరుకకు సరళమైన ఆధ్యాత్మికమార్గం మౌనమే అని తనజీవితం ద్వారా మనకు చూపించిన ఆధ్యాత్మిక సంపన్నులు భగవాన్ రమణ మహర్షి.**

**బోధలు:** ● మౌనంలో విశ్రమించు, మనస్సు మూలాల్ని అన్వేషించు, 'నేను'అనే భావం ఎక్కడి నుంచి వస్తుందో చింతన చేస్తూ పరిశీలిస్తే మనస్సు అందులో లీనమైపోతుంది ● అదే మౌన తపస్సు ● గురువు అనుగ్రహానికి ఉత్తమోత్తమరూపం మౌనమే ● అదే అత్యుత్తమ ఉపదేశం కూడా ● మౌనంలోనే సాధకుని ప్రార్థన సైతం పరాకాష్ఠకు చేరుతుంది ● అన్ని దీక్షలకంటే మౌనదీక్ష ప్రశస్తమైంది ● అదే అన్ని దీక్షలకు మూలం ● గురువు మౌనంలో ప్రతిష్ఠితుడైతే, సాధకుని మనస్సు దానంతట అదే విశుద్ధిని పొందుతుంది.

– కృష్ణకార్తీక, శ్రీలేఖ

## ధర్మజిజ్ఞాస

**ఈ నెల 16, మంగళవారం చంద్రగ్రహణం అంటున్నారు. ఈ వేళ ఆలయాలు ఎందుకని మూసివేస్తారు? అశుభ రాశులవారు పాటించవలసిన నియమాలేంటి?**

**– పోతాప్రగడ మణి, హైదరాబాద్**

గ్రహణం అంటే గ్రహించడం అని అర్థం. గ్రహణకాలం చాలా పవిత్రమైనది, విశిష్టమైనది. యోగులకు, సాధకులకు, ఆధ్యాత్మిక ఉన్నతి సాధించాలనుకునే వారికి ఇది సువర్ణకాలం. తంత్రశాస్త్రం ప్రకారం గ్రహణకాలం మంత్రదీక్షను స్వీకరించడానికి అనువైన కాలం. మామూలుగా చేసే జపతపాలు, దానధర్మాలు గ్రహణ సమయంలో చేస్తే లక్షరెట్లు అధికఫలం కలుగుతుందని శాస్త్రోక్తి.

**గ్రహణకాలంలో చేయవలసిన పనులు**

పంచాంగం ద్వారా లేదా శాస్త్రాల ద్వారా గ్రహణ స్పర్శ – మోక్ష కాలాలు తెలుసుకుని స్నానం చేయాలి.

● గ్రహణ స్నానాన్ని కట్టుకున్న వస్త్రాలతోనే చేయాలి. ●గ్రహణకాలంలో చేసే జపం, దానం, హోమం, ధర్మం మొదలయినవన్నీ అధికఫలాన్నిస్తాయి. కాబట్టి ఆయా పుణ్యకార్యాలను ఆచరించాలి. ● హోమం చేయలేనప్పుడు జపం, జపం చేయలేకపోతే ఇష్టదేవతారాధన చేయాలి. ●గ్రహణం విడువగానే పుణ్యనదులు, సరోవరాలు, కాలువలు, బావులు లేదా కనీసం కుళాయి నీటితో అయినా స్నానం చేయాలి.

**అశుభరాశుల వారు ఏం చేయాలి?**

అశుభ రాశుల వారు అంటే గ్రహణం ఏయే నక్షత్రాల మీదుగా వస్తుందో, ఆయా నక్షత్రాలకు సంబంధించిన రాశులవారు సమీపంలోని నవగ్రహాలయానికి వెళ్లి రాగితో చేసిన చంద్రబింబాన్ని నేతి కుండలో వేసి వస్త్రదక్షిణలతో నవగ్రహ ధ్యానశ్లోకాలను పఠిస్తూ పండితులు, యాచకులు, వికలాంగులు, పేదసాదలు లేదా యోగ్యులైన వారికి దానం చేయాలి.మిగిలిన వారు కూడా దాన ధర్మాలు చేస్తే సత్ఫలితాలు పొందవచ్చు.

గ్రహణం సందర్భంగా ఆలయాలను ఎందుకు మూసివేస్తారని అడిగారు కదా...

సూర్యచంద్రులతో భూమికి గల సంబంధాన్ని బట్టే కాలగణన జరుగుతుంది. అటువంటి సూర్య చంద్రులకు గ్రహణం కలిగిందంటే అది దుర్దినమేకదా! సామాన్య భాషలో చెప్పాలంటే లోకానికి వెలుగు, వేడిని ప్రసాదించే సూర్యచంద్రులను క్రూరగ్రహాలైన రాహుకేతువులు మింగడమంటే అది లోకానికంతటికీ కష్టకాలమే కదా! కాబట్టి సమాజమంతటినీ కలిపే కేంద్రమైన దేవాలయాలను గ్రహణ కాలంలో మూసివేసి, గ్రహణం వీడిన తరువాత శుద్ధి చేసిన తర్వాతనే పూజాకాదికాలు ప్రారంభిస్తారు.

గ్రహణం ఏ నక్షత్రంలో– ఏ రాశిలో సంభవించినప్పటికీ అన్ని నక్షత్రాలు, అన్నిరాశుల వారూ శివాలయంలోఏకాదశ రుద్రాభిషేకం చేయించడం చెప్పదగిన సూచన. గ్రహణం ముగిసిన తర్వాత ఇంట్లోని పూజామందిరాన్ని, పూజా సామగ్రిని, భోజన పాత్రలను శుద్ధి చేసుకోవాలి.

## ఆలయం.. ఆగమం

# విమానం.. దైవసమానం

ఆలయం పైన బోర్లించిన గుమ్మటం వంటి ఆకారమే విమానం. వివిధ మానము(కొలత)లతో నిర్మిస్తారు కనుక విమానం అని అంటారు. దీనికే విమానశిఖరం, ఆలయశిఖరం అని కూడా పేర్లున్నాయి. ఇది విమానం, స్తూపి అనే రెండు భాగాల కలయిక. స్తూపిని శిఖగా భావించడం వలన ఆ శిఖను కలిగి ఉన్నది కనుక శిఖరం అనే పేరొచ్చింది. ఇది ఆలయపురుషుడి ముఖంతో సమానం. గర్భగుడిలో కొలువైన భగవంతుని ముఖదర్శనం. ఆలయంపై ఉన్న విమాన దర్శనం రెండూ ఒకటే. అదేవిధంగా మూల మూర్తి, విమానం, గోపురం, బలిపీఠం, అర్చకుడు ఈ ఐదింటిలో దేవుని పంచప్రాణాలు కొలువుతీరి ఉంటాయని శైవాగమం తెలుపుతోంది. విమానంతో కలిసి ఉంటేనే అది



ఆలయం. లేకపోతే అది మందిరమే. ఆలయ విమానానికి నాలుగువైపులా నాలుగు నాసికలు ఉంటాయి. ఇది దేవతలు కొలువుదీరి నిలిచే స్థానం. తూర్పుదిక్కున నాసిక పెద్దది కాబట్టి మహానాసికగా పిలుస్తారు. ఈ మహానాసికలో మహాలక్ష్మి తామరపై కూర్చుని రెండు ఏనుగులతో అభిషేకించుకునే గజలక్ష్మి ఉంటుంది. అలాగే ఈ విమానం కంఠభాగంలో నాలుగు దిక్కులా నలుగురు దేవతలను ప్రతిష్ఠిస్తారు. వారిని విమానదేవతలంటారు. ఈ దేవతలకు దిక్కులకుంటే మూలల్లో శివాలయాల్లో వృషభం ఒకే ముఖంతో రెండు శరీరాలతో పడుకుని ఉంటుంది. విష్ణ్వాలయాలలో అంజలి బద్ధుడైన గరుత్మంతుడు, అమ్మవారి ఆలయంలో సింహాలుంటాయి. విమానం పిరమిడ్ ఆకారంలో, అనేక అంతస్తులతో అలరారుతుంది. పదహారు అంతస్తులవరకూ నిర్మించుకోవచ్చని కాశ్యప శిల్పశాస్త్రం చెబుతోంది. విమానం ఒక్కో అంతస్తునూ తమ భుజాలపై మోసే కొందరి విగ్రహాలను కూడా మనం చూస్తుంటాం. వారిని గోపన ్దారులు అంటారు. వీరందరినీ భగవంతుని ఉపాసిస్తూ ఆయాదశలలో పరిణితి సాధించిన వారిగా తెలుసుకోవాలి. భక్తుడు విమానాన్ని దర్శించి భగవద్ధామాన్ని చేరుకునే ప్రయత్నం మొదలుపెట్టాలి.

– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

## సువార్త

# క్రైస్తవం సారాంశం బర్నబా జీవితం!!



అంతా ఈసడించుకొంటున్న ఒక వ్యక్తిని ప్రేమించి దగ్గరికి తీసుకోవడం అందరికీ సాధ్యమయ్యేది కాదు. యెరూషలేము విశ్వాసులపై కరడుగట్టిన క్రైస్తవ వ్యతిరేకిగా ఎంతో దమనకాండకు పాల్పడి, దమస్కు వెళ్లే మార్గంలో యేసు ప్రభువు సాక్షాత్కారంతో పరివర్తన చెంది క్రైస్తవుడిగా మారిన పౌలును నమ్మడానికి, క్షమించడానికి, చర్చిలో చేర్చుకోవడానికి యెరూషలేము విశ్వాసులు ససేమిరా అన్నారు. 'పౌలు మారలేదు, అతని క్రై స్తవమంతా బూటకం' అన్నారు వాళ్లంతా. క్రైస్తవులను ఊచకోత కోసి, ఇపుడొచ్చి నేనూ క్రైస్తవుడినే, మీలో ఒకడినే అంటే ఎవరు మాత్రం ఎలా నమ్ముతారు? ఆ పరిస్థితుల్లో యెరూషలేము చర్చి పెద్దల్లో ఒకరైన బర్నబా ఒక్కడే పౌలు పక్షంగా నిలబడ్డాడు. ఆదరణ, ప్రోత్సాహం అనే పదాలకు మారుపేరు బర్నబా!! పౌలుకున్న పాండిత్యం, మేధోశక్తి బర్నబాకు లేకపోవచ్చు. కాని బలహీనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఊతమివ్వాలన్న క్రైస్తవ మూలాంశాన్ని జీర్ణించుకొని ఆచరణలో పెట్టిన నిజమైన విశ్వాసి బర్నబా. క్రైస్తవులంతా పౌలును శత్రువుగా చూస్తున్నపుడు బర్నబా పౌలును సమర్థిస్తూ ఆయన పక్షం వహించాడు. సిరియాలో పౌలు పొందిన యేసు సాక్షాత్కారానుభవాన్ని అందరికన్నా ముందు బర్నబా నమ్మాడు. బర్నబా మంచితనాన్ని, ఔదార్యాన్ని, ప్రోత్సాహక తత్వాన్ని బాగా ఎరిగిన చర్చి ఆయన్ను బట్టి ఇపుడు పౌలును నమ్మి దగ్గరికి తీసింది. అంతా 'ఆదరణ పుత్రుడు' అని పిలిచే ఆ బర్నబా ఇపుడు పౌలు భావి పరిచర్యకు పునాది అయ్యాడు. క్రైస్తవుడిగా పౌలు మహా ప్రస్థానం ఇలా బర్నబా ప్రోత్సాహంతోనే ఆరంభమైంది(అపో.కా.9:26–30).

అదే నిజమైన పరిచర్య అంటే. వ్యతిరేకించే చోట వ్యతిరేకించాలి, ప్రోత్సహించే చోట ముందుండి ప్రోత్సహించాలి. ఎక్కడ ప్రోత్సాహం అవసరమో అక్కడ బర్నబా ప్రత్యక్షమవుతాడు. యెరూషలేములో చర్చికి ఆర్థిక ప్రోత్సాహం అవసరమైనపుడు, తన జన్మస్థలమైన సైప్రస్‌లోని భూమినంతా అమ్మి తెచ్చి ఆ డబ్బంతా చర్చికిచ్చేశాడు (అపో.కా 4:26,27). ఇపుడు ఎంతో ప్రతికూలత నెదుర్కొంటున్న పౌలుకు ప్రోత్సాహాన్నిచ్చి అతన్ని పరిచర్యలో నిలబెట్టాడు. సిరియాలోని అంతియొకయలో ఏర్పడిన కొత్త చర్చిని ప్రోత్సహించేందుకు బర్నబా పౌలును కూడా వెంట తీసుకొని వెళ్లి ఇద్దరూ కలిసి అక్కడ గొప్ప పరిచర్య చేశారు (అపో.కా.11:19–26). పౌలు మిషనరీ ప్రయాణాలకు, చర్చిల స్థాపనకు అంతియొకయలోనే పునాది పడింది. ఇలా కట్టడమే తప్ప పడగొట్టడం తెలియని అత్యంత సంయమనాత్మక క్రైస్తవ పరిచర్య బర్నబాది. కొందరి సంభాషణ, జీవితం కూడా అనుమానాలతోనే ఆరంభమై, వాటితోనే ముగుస్తుంది. ఎంతసేపూ ఖండించడం, ముక్కలుగా చీల్చడంతోనే సాగే పరిచర్య వారిది. యేసు ప్రబోధాల సారాంశమైన క్షమాపణ, పరస్పర ప్రేమ, ప్రోత్సాహం, సంయమనాన్ని తీసేస్తే క్రైస్తవంలో ఇక ఏమీ మిగలదు. కొన్ని సరైన, సహేతుకమైన కారణాలను బట్టే క్రైస్తవం పెద్దల నేతృత్వంలో కొన్ని శాఖలుగా విడిపోయినా, ఇప్పటికీ పరస్పర సహకారానికే తప్ప వాటి మధ్య శత్రుత్వానికి తావు లేదు. విశ్వాసుల మధ్య అడ్డ గోడలు కట్టే అవకాశవాదులు కాదు, వంతెనలు కట్టే బర్నబాల్లాంటి పరిచారకులు ఇపుడు కావాలి. క్రై స్తవం, చర్చిలు ముందు తమలో శాంతిని నెలకొల్పుకొని, ఆ తర్వాత, ఆ శాంతినే లోకానికి ప్రకటించాలి.

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

## ప్రశ్నోత్తర భారతం



282. భీష్ముడు తల్లితో ఏమని పలికాడు?
283. భీష్ముని మాటలు సత్యవతి ఏం చేసింది?
284. సత్యవతి మాటలకు భీష్ముడు ఏమన్నాడు?
285. భీష్ముని మాటలకు సత్యవతి ఏం చేసింది?
286. వేదవ్యాసుని రూపం ఏ విధంగా ఉంది?
287. వ్యాసునితో సత్యవతి ఏమని పలికింది?
288. తల్లి మాటలకు వ్యాసుడు ఏమన్నాడు?
289. వ్యాసుని మాటలకు సత్యవతి ఏమంది?

– నిర్వహణ: డా. పురాణపండ వైజయంతి

**జవాబులు:** 282) తల్లీ! ధర్మశాస్త్రాలు ఆమోదించిన పద్ధతిలో విచిత్రవీర్యుని భార్యలకు సంతానం కలగాలి. అందుకు మనం ఒక మంచి బ్రాహ్మణుడిని ఉంచుకోవాలి' అన్నాడు. 283) సత్యవతికి పూర్వజన్మ వృత్తాంతం గుర్తుకు వచ్చింది. పరాశరుని నది దాటించడం, వ్యాసుని జననం, వ్యాసుడు ఇచ్చిన వరం ఒక్కటొక్కటిగా భీష్ముడికి వివరించింది. 284) తల్లీ! నీవు ధన్యురాలివి. వేదవ్యాసుని కాన్నవు. ఆయన బ్రహ్మతో సమానమైనవాడు. కౌరవ వంశాన్ని నిలపటానికి ఆయనను అందరూ సమ్మతిస్తారు' అన్నాడు. 285) సత్యవతి వేదవ్యాసుని మనసులో స్మరించింది. ఆయన ప్రత్యక్షమయ్యాడు. 286) ఆయన శిరస్సు పర్వత శిఖరం, ఆయన జడలు బంగారు తీవెలు, ఆయన వాక్యం వేదవాక్కు. 287) నాయనా! నీకు తెలియని ధర్మం లేదు. నిన్ను ఒక సత్కార్యం కోసం నియమిస్తున్నాను. నీవు నిర్వర్తించాలి. భరతవంశం అంతరించనుంది. నీవు దేవరన్యాయం అవలంబించి, అంబికకు, అంబాలికకు సంతానం ప్రసాదించు. ఇది నీ ధర్మం' అంది. 288) అమ్మా! నీ మాటను శిరసావహించడం నా ధర్మం. అంబిక, అంబాలికలను ఒక సంవత్సర కాలం వ్రతం ఆచరించటం మంచిది అన్నాడు. 289) నాయనా సంవత్సరం నిరీక్షించడం కష్టం. వారికి తక్షణమే సంతానం కలగాలి అంది. వ్యాసుడు అంగీకరించాడు.

## సంగీత సాహిత్యం

# అవే మన ఉన్నతికి మార్గదర్శకాలు

భక్తరామదాసు చివరిరోజులలో నడవలేక ఇంటి ముంగిట్లోనే కూర్చొని ఆలయశిఖరం వంక చూస్తూ కీర్తనలు చేసుకుంటూండగా... విమానం భద్రాచలంలో దిగింది. వైకుంఠంనుంచి దూతలొచ్చి రామదాసు చెయ్యిపట్టుకుని పైకి ఎక్కించుకుంటున్నారు. అప్పుడు దాని మెట్లమీద నిలబడి రామదాసు ప్రజల చేత సంకీర్తన చేయించారు. అందరూ నమస్కరిస్తూండగా తాను విమానంలోకి వెళ్ళిపోతూ భార్యను 'నువ్వూ.. రా' అని పిలిచారు. ఎప్పుడూ 'రాముడొచ్చాడు, రాముడొచ్చాడు..' అని అంటూండే ఆయన ఇప్పుడు కూడా అట్లానే అంటూన్నాడను కొని 'ఇప్పుడు రాను. పనిలో ఉన్నాను. మీరు వెళ్ళండి.'' అన్నది. ఎవరి ప్రాప్తం వారిదనుకుని ఆయన ఎక్కేసారు. విమానం ఎగిరిపోయింది. 'రామచంద్రమూర్తికీ జై, రామదాసుకీ జై' అంటూ ప్రజలు పెద్దగా అరుస్తుంటే అదేదో చూద్దామనుకుని భార్య బయటికొచ్చింది. భర్త ధ్యానం చేసుకుంటూ విమానంలో వెళ్ళిపోతున్నారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అంతటి మహాపురుషుడిని సేవించాను, ఆయన రమ్మన్నా వెళ్లలేక పోయాను.. అని భద్రాచలం కొండెక్కి రాముని సన్నిధిలో కన్నీరు మున్నీరవుతూ రామనామ సంకీర్తనం చేసింది. రామచంద్రమూర్తి ప్రత్యక్షమయి 'అమ్మా, ఆలయ పాలనలో నీ కుమారుడు సుశిక్షితుడు కాగానే నిన్ను వైకుంఠానికి తీసుకెళ్ళి రామదాసు పక్కన కూర్చోబెడతాను' అని మాటిచ్చాడు. ఆ తరువాత ఆమె కూడా అక్కడకు చేరుకున్నది.

''నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ...' అని రామదాసు కీర్తన చేసారు. మీరు కూడా 12 ఏళ్ళు ఆగి ఆయనను రక్షించారు. కానీ మీ భక్తుడయిన రామదాసుకు, అదేపనిగా అన్నేళ్ళు దెబ్బలు తిన్నవాడికి మొదటి దర్శనం ఇవ్వకుండా, అన్ని దెబ్బలు కొట్టిన తానీషాకు ఎలా ఇచ్చారు'' అని సీతమ్మ అడిగిందట. ''సీతా! కిందటి జన్మలో తానీషా కూడా నా భక్తుడే. ''365 రోజులు సశాస్త్రీయంగా నమకచమకాలతో అభిషేకం చేస్తాను. అది పూర్తవగానే శంకరా, నాకు దర్శనం ఇవ్వు'' అని ప్రతిజ్ఞ చేసాడు. అభిషేకం మొదలుపెట్టాడు. 365 రోజులు చేసాననుకుని 364 రోజులే చేసాడు. నేను దర్శనం ఇంకా ఇవ్వలేదనే ఆగ్రహంతో అభిషేకం పాత్రను తీసి శివలింగం కేసి కొట్టాడు. అప్పుడే చెప్పాను, తప్పు నీవు చేసి నన్ను నిందించిన నేరానికి నీవు వచ్చే జన్మలో వేదాన్ని ప్రమాణంగా అంగీకరించని చోట పుడతావు. అయినా మొదటి దర్శనం నీకే ఇస్తాను' అని వాగ్దానం చేసినందువల్ల ముందుగా తానీషాకు దర్శనం ఇచ్చి తరువాత రామదాసును కరుణించాల్సి వచ్చింది.'' అని వివరించాడట. శివకేశవులిద్దరూ ఒకటేనన్న విషయానికి ఇదొక ఉదాహరణ.

చింతలమ్మతల్లి అనుగ్రహిస్తే చెన్నకేశవుడి అనుగ్రహంగా వేంకటేశ్వర స్వామి భక్తుడు అన్నమాచార్యుల వారయ్యారు. వేంకటేశ్వరుడు పూనకంలో చెబితే కంచి కామాక్షిదేవిని అర్చించిన భక్తుడు శ్యామశాస్త్రిగా పుట్టారు. కానీ అన్ని రూపాల్లో ప్రకాశించేవాడు ఒకడే. అటువంటి రూపాలే వాగ్గేయకారులవి కూడా. లోపల ఉండే నాదాన్ని నిరంతరం ఉపాసన చేసి దాని ద్వారా పునరావృత్తిరహిత శాశ్వత శివసాయుజ్య స్థితిని పొందడానికి వారు అలా సోపానాలు నిర్మించుకున్నారు. ఎంతమంది గురువులొచ్చినా, ఎంతమంది శిష్యులొచ్చినా పరంపరానుగతంగా వారు ఆర్తితో పాడుకున్న కీర్తనలు మనకు శిరోధార్యాలయ్యాయి. ఆధ్యాత్మిక ఉన్నతికి మార్గదర్శకాలయ్యాయి.

*(ఈ సీరీస్ ఇంతటితో సమాప్తం. వచ్చేవారం మరో సీరీస్‌తో)*



● ఆలియా భట్

## మళ్లీ మైక్ టెస్టింగ్

యాక్టింగ్ చేస్తూనే అప్పుడప్పుడు మైక్ పట్టుకొని మైక్ టెస్టింగ్ అంటూ పాటలు పాడేస్తుంటారు బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్. ఇదివరకు 'హైవే, ఉడ్తా పంజాబ్, డియర్ జిందగీ, బద్రీనాథ్ కి దుల్హనియా' సినిమాల్లో పాటలు పాడారు ఆలియా. ప్రస్తుతం 'సడక్ 2'లో నటిస్తున్నారామె. ఈ సినిమాలోనూ తన గొంతును వినిపించనున్నారు. ఈ పాట రికార్డింగ్ కూడా పూర్తయింది. కానీ ఇది ఫైనల్ వెర్షన్ కాదట. జీత్ గంగూలీ కంపోజ్ చేసిన ఈ ట్యూన్ ఫస్ట్ వెర్షన్‌ను ఆలియా పాడారు. ఈ పాట ఫైనల్ లిరిక్స్ ఇంకా పూర్తికాలేదట. ఆలియా భట్ వాయిస్ పిచ్ ఎలా ఉంటుందో అని సంగీత దర్శకుడు అర్థం చేసుకోవడానికి రఫ్‌గా రికార్డ్ చేశారట. త్వరలోనే ఫైనల్ సాంగ్ కంపోజ్ చేయనున్నారు. సంజయ్‌దత్, పూజా భట్ నటిస్తున్న ఈ చిత్రంతో 25 ఏళ్ల తర్వాత మళ్లీ మెగా ఫోన్ పట్టారు మహేశ్ భట్.



● పునర్ణవి, మహత్

## వినోదాల సైకిల్

'బ్యాక్ బెంచ్ స్టూడెంట్, బన్నీ అండ్ చెర్రీ, లేడీస్ అండ్ జెంటిల్‌మెన్' వంటి చిత్రాలతో యువతను ఆకట్టుకున్న మహత్ రాఘవేంద్ర హీరోగా నటించిన తాజా చిత్రం 'సైకిల్'. పునర్ణవి భూపాలం, శ్వేతావర్మ, సూర్య ముఖ్య పాత్రల్లో నటించారు. ఆట్ల అర్జున్‌రెడ్డి దర్శకత్వంలో పి.రాంప్రసాద్, డి.నవీన్‌రెడ్డి నిర్మించిన ఈ సినిమా షూటింగ్, డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ–''భారతీయ సినిమాలో ఇంకా చెప్పటానికి కొత్త కథలు లేవు. అయినా సరికొత్త కథలు రాస్తున్నాం.. కొత్త సినిమాలు తీస్తున్నాం. ఆ ప్రయత్నంలోనిదే 'సైకిల్'. అది పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంజన్‌కానీ, ఇంధనం కానీ లేకుండా నడుస్తూ, మనతో కలిసి ప్రయాణిస్తున్న సైకిల్ పేరుని మా సినిమాకి టైటిల్‌గా పెట్టాం. త్వరలో టీజర్, ఆడియో విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: వి.బాలాజీరాజు, కెమెరా: సిద్ధంమనోహర్, సంగీతం: జి.ఎం.సతీష్.



● వరుణ్ తేజ్

## అనంతపురంలో వాల్మీకి

కొన్ని రోజులుగా రాయలసీమ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు వరుణ్ తేజ్. అక్కడి కట్టు బొట్టు, అతిథి మర్యాదలు, వ్యవహారశైలిపై ప్రత్యేక దృష్టి పెట్టే పనిలో ఉన్నారు. వరుణ్ తేజ్, అధర్వ ప్రధాన తారాగణంగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'వాల్మీకి'. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఈ సినిమా ప్రీ-టీజర్ విడుదలైంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ అనంతపురంలో జరుగుతోంది. వరుణ్‌పై కీలక సన్నివేశాలను తీస్తున్నారు. ఇప్పటి వరకు ఈ సినిమా షూటింగ్ 70 శాతం పూర్తయిందని తెలిసింది. ఈ చిత్రం మేజర్ షూటింగ్ రాయలసీమలో జరుపుతున్నారు. దీన్నిబట్టి.. ఈ సినిమాలో వరుణ్‌తేజ్ రాయలసీమ యాసలో మాట్లాడతారా? అంటే ఆ విషయం ప్రస్తుతానికి సస్పెన్స్ అంటున్నాయి యూనిట్ వర్గాలు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమాకు మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్నారు. 'వాల్మీకి' సినిమా ఈ ఏడాది సెప్టెంబర్ 6న రిలీజ్ కానుంది.

## గ్యాంగ్ రెడీ

నేను గ్యాంగ్‌లీడర్‌ని.. మా గ్యాంగ్ రెడీ అంటున్నారు నాని. విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో నాని నటిస్తోన్న చిత్రం 'గ్యాంగ్‌లీడర్'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ సి.వి.యం నిర్మిస్తున్న ఈ సినిమా ప్రీలుక్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. కథకు అనుగుణంగా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. పోస్టర్ విడుదలతో 'గ్యాంగ్ లీడర్' పబ్లిసిటీని ప్రారంభించారు చిత్ర యూనిట్. సోమవారం సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేయనున్నారు. అలాగే ఈ నెల 18న ఫస్ట్ సాంగ్‌ని, 24న టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ పేర్కొంది. 'ఆర్‌ఎక్స్100' ఫేమ్ కార్తికేయ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మాటలు: వెంకీ, 'డార్లింగ్' స్వామి.




● 'గ్యాంగ్ లీడర్' ప్రీ లుక్



● నాని



● అనన్యా పాండే

## రెండు గంటలకోసారి తింటున్నా

బరువు తగ్గటానికి డిఫరెంట్ వర్కౌట్స్, డైట్ ఫాలో అవుతూ నానా తంటాలు పడుతుంటారు కొందరు. కానీ బాలీవుడ్ హీరోయిన్ అనన్యా పాండే మాత్రం ఐదు కిలోల బరువు పెరగడానికి చాలా శ్రమిస్తున్నారు. కార్తీక్ ఆర్యన్, అనన్యా పాండే, భూమి ఫడ్నేకర్ ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న సినిమా 'పతి పత్నీ ఔర్ ఓ'. 1978లో వచ్చిన 'పతి పత్నీ ఔర్ ఓ' సినిమాకు ఇది తాజా రీమేక్ అట. ఈ సినిమాలో సెక్రటరీ పాత్ర పోషిస్తున్నారు అనన్య. ''నా పాత్ర కోసం ఐదు కిలోల బరువు పెరగడం చాలా కష్టంగా ఉంది. ఆరోగ్య రీత్యా జంక్ ఫుడ్ తినకూడదు. కానీ బరువు పెరగాలి. అందుకే ప్రతి రెండు గంటలకు ఒకసారి సరైన ఫుడ్ తీసుకుంటున్నాను' అని చెప్పారు అనన్య. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ లక్నోలో జరుగుతోంది.



● ముమైత్ ఖాన్

## ముమైత్ రీ ఎంట్రీ

'మిస్టర్ 7, యాక్షన్ 3డీ, చిత్రం చెప్పిన కథ, మామ ఓ చందమామ' చిత్రాలకు సంగీతం అందించిన మున్నా కాశీ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హేజా'. ముమైత్ ఖాన్, నూతన్ నాయుడు, లిజీ గోపాల్, ప్రీతం నిగమ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎస్ఎన్ మూర్తి నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. మున్నా కాశీ మాట్లాడుతూ– ''తొలిసారి హీరోగా, దర్శకుడిగా చేస్తున్నా. సినిమా ఔట్‌పుట్ చాలా బాగుంది. ఈ సినిమాతో ముమైత్ ఖాన్‌గారు రీ ఎంట్రీ ఇస్తున్నారు'' అన్నారు. ''ఇప్పటి వరకూ వచ్చిన హారర్ సినిమాలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది'' అన్నారు కేవీఎస్ఎన్ మూర్తి. ఈ చిత్రానికి సంగీతం: మున్నా కాశీ అలియాస్ కె.వి.ఎస్.ఎన్ మూర్తి, కెమెరా: నాని చమిడిశెట్టి.

## నాకు అంత సీన్ లేదు

**"సాధారణంగా సినిమాలో హీరోయిన్ లేదా హీరోది డామినేటింగ్ క్యారెక్టర్ ఉంటుంది. కానీ, 'ఇస్మార్ట్ శంకర్'లో రామ్‌ది, నాదీ డామినేటింగ్ పాత్రలే. మా ఇద్దరి మధ్య లవ్-హేట్-లవ్ రిలేషన్‌షిప్ ఉంటుంది. మా ఇద్దరి మధ్య సీన్లు చాలా ఆసక్తికరంగా ఉంటాయి" అని హీరోయిన్ నభా నటేశ్ అన్నారు. రామ్ హీరోగా, నభా నటేశ్, నిధీ అగర్వాల్ హీరోయిన్లుగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. ఛార్మీ, పూరి జగన్నాథ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా నభా నటేశ్ పంచుకున్న విశేషాలు...**

● 'ఇస్మార్ట్ శంకర్' సినిమాలో నా పాత్ర పేరు చాందిని. సివిల్ ఇంజినీర్. మేం కన్‌స్ట్రక్షన్ జరిపే బిల్డింగ్ వద్దకు అప్పుడప్పుడు రౌడీలు వస్తుంటారు. భయపడకుండా వాళ్లకు రిటర్న్ ధమ్‌కీ ఇచ్చే పాత్ర నాది. సాధారణంగా పూరి హీరోయిన్స్ కంటే చాలా హైపర్ రోల్ ఇది. ఈ సినిమా కథ చెప్పినప్పుడే నా పాత్ర డైలాగ్స్ అన్నీ నా చేతిలో పెట్టారు. యాసలో ఎలా పలకాలి? డైలాగ్ అర్థం ఏంటి? అన్నీ తెలుసుకున్నాను. అప్పుడు నటించడం ఈజీగా అనిపించింది. అయితే నా పాత్రకి డబ్బింగ్ చెప్పలేదు.

● 'కాలేజ్‌లో చాలా మందికి పోయించాను.. నువ్వెంత?' అనే డైలాగ్ టీజర్‌లో రామ్‌ను భయపెడుతున్నట్టు చెప్పాను. కానీ నా కాలేజీ రోజుల్లో నాకంత సీన్ లేదు. నేనే చాలా భయపడేదాన్ని. నా ఫ్రెండ్స్ అందరూ నన్నే ఆటపట్టించేవారు. సినిమాల్లో (నన్ను దోచుకుందువటే, ఇస్మార్ట్ శంకర్) కనిపించినంత హైపర్ కాకపోయినా బయట చాలా ఎనర్జిటిక్‌గా ఉంటాను. అల్లరి చేసేదాన్ని. కాలేజీ మేనేజ్‌మెంట్ నుంచి ఇంటికి ఫోన్ వెళ్తుందేమో అని భయపడేదాన్ని.

● శంకర్ అంటే నాకు ఇష్టం.. కానీ తను చెప్పింది చేయను. నేనంటే శంకర్‌కి ఇష్టం కానీ, నా మాట వినడు. ఒకరిని ఒకరు డామినేట్ చేసుకునే పాత్రలు మావి. సినిమాలో రామ్‌ని చెంప మీద కొట్టాల్సిన సీన్లు ఉన్నాయి. నిజంగా కొట్టే సీన్లు కాకపోయినా ఫస్ట్ కొంచెం ఇబ్బంది పడ్డా. తర్వాత బాగానే చేశాను. షూటింగ్ జరిగినంత కాలం ఆఫ్ కెమెరా కూడా శంకర్ పాత్రలోనే ఉండిపోయాడు రామ్. నిధీ అగర్వాల్‌తో నాకు కాంబినేషన్ సీన్లు లేవు. కానీ 'దిమాక్ ఖరాబ్..' పాటని 6 రోజులు షూట్ చేశాం. అప్పుడు మేం మంచి ఫ్రెండ్స్ అయ్యాం.

● పూరీసార్‌తో వర్క్ చేయడం వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్. ఆయన క్యారెక్టర్స్ బాగా డిజైన్ చేస్తారు. ఆయనకే ఫుల్ ఫ్యాన్స్ ఉన్నారు. ఆయన యాక్టర్స్ అందరూ కంఫర్ట్‌బుల్‌గా ఉంటారు. ఛార్మీగారు మేనేజ్‌మెంట్‌లో బెస్ట్.

● రవితేజగారితో ప్రస్తుతం 'డిస్కో రాజా' సినిమా చేస్తున్నాను. రెండు మూడు ప్రాజెక్ట్స్ డిస్కషన్ స్టేజీలో ఉన్నాయి. అందులో ఓ తమిళ సినిమా కూడా ఉంది.



● నభా నటేష్










**సాక్షి స్పోర్ట్స్**
ఆదివారం
14-7-2019

# విశ్వ కిరీటం... పుట్టింటికా? కివీ గూటికా?

## నేడు ప్రపంచ కప్ ఫైనల్

- ఇంగ్లండ్‌తో న్యూజిలాండ్ అమీతుమీ
- విఖ్యాత లార్డ్స్ మైదానంలో సమరం
- విజేత ఎవరైనా వన్డే క్రికెట్‌కు కొత్త చాంపియనే

మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం



మోర్గాన్ విలియమ్సన్

ప్రారంభంలో చప్పగా సాగుతోందన్నారు
వారాలు గడుస్తున్నా ఊపు లేదన్నారు
మ్యాచ్‌లు తరుగుతున్నా మజా ఏదన్నారు
మధ్యలోకి వచ్చేసరికి కాక మొదలైంది
రంజైన మ్యాచ్‌లతో ఆట రక్తి కట్టింది
ఇప్పుడిక ప్రపంచ కప్ ఆఖరి అంకం
46వ రోజున 48వ మ్యాచ్‌తో ముగింపు
వన్డే కిరీటం ఎవరిదో తేలిపోయే సందర్భం
రానున్న నాలుగేళ్లకు రారాజు పట్టాభిషేకం
దూకుడైన ఇంగ్లండ్... నిబ్బరంగా న్యూజిలాండ్
జగజ్జేత హోదా పుట్టింటికి దక్కుతుందా?
రెక్కలు కట్టుకుని కివీస్ గూటిలో వాలుతుందా?
క్రికెట్ మక్కా లార్డ్స్‌లో...
అందమైన బాల్కనీ నుంచి...
సగర్వంగా కప్‌ను చూపే కెప్టెన్ ఎవరో?
మరికొద్ది గంటల్లో ఉత్కంఠకు తెర
తర్వాత తెరపైకి 'సరికొత్త విజేత'
అభిమానులూ... ఆస్వాదించండి!

**లండన్:** వన్డే క్రికెట్‌లో 23 ఏళ్ల తర్వాత సరికొత్త చాంపియన్ ఆవిర్భావానికి 12వ ప్రపంచ కప్ వేదిక కాబోతోంది. తొలిసారి జగజ్జేతగా నిలిచేందుకు లండన్‌లోని ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో ఆదివారం ఇంగ్లండ్, న్యూజిలాండ్ తుది సమరంలో తలపడనున్నాయి. మ్యాచ్‌లో ఎవరు గెలిచినా అది వారి దేశ చరిత్రలో సువర్ణాధ్యాయంగా మిగిలిపోనుంది. ఇరు జట్ల బలాబలాల ప్రకారం చూస్తే ఈ ఫైనల్‌ను బ్యాటింగ్, పేస్ బౌలింగ్ మధ్య పోటీగా పేర్కొనవచ్చు. దూకుడైన ఆటతో పైచేయి సాధించడం ఇంగ్లండ్ వ్యూహం కాగా... నెమ్మదిగా పట్టు బిగించే స్వభావం న్యూజిలాండ్‌ది. మరి అంతిమ పోరులో ఎవరి ప్రణాళికలు విజయవంతం అవుతాయో చూడాలి?

### మార్పుల్లేకుండానే!

అత్యంత కీలక మ్యాచ్ కాబట్టి రెండు జట్లు తాము సెమీఫైనల్లో ఆడిన తుది పదకొండు మందితోనే ఫైనల్లో దిగే వీలుంది. పైకి కనిపించకున్నా అటు ఇటు ఒకరిద్దరు ఆటగాళ్లే కీలకం. జేసన్ రాయ్, రూట్‌ను త్వరగా ఔట్ చేస్తే ఆతిథ్య జట్టు పరోక్షంగానైనా ఆత్మరక్షణలో పడటం ఖాయం. ఈ నేపథ్యంలో విధ్వంసక జాస్ బట్లర్ నుంచి భారీ ఇన్నింగ్స్ నమోదవాల్సి ఉంటుంది. అనంతరం కెప్టెన్ మోర్గాన్, ఆల్‌రౌండర్ స్టోక్స్ బాధ్యతలు తీసుకుంటారు. ఇక విలియమ్సన్, రాస్ టేలర్ తేలిపోతే న్యూజిలాండ్ పని ఖతం. అసలే ఆ జట్టు ఓపెనర్లు గప్టిల్, నికోల్స్ పేలవ ఫామ్‌తో సతమతం అవుతోంది. లాథమ్, గ్రాండ్‌హోమ్, నీషమ్ అదనపు పరుగులు జోడించగలరు తప్ప పరిస్థితిని అమాంతం మార్చలేరు. మొత్తమ్మీద చూస్తే బ్యాటింగ్, బౌలింగ్‌లో సమతూకంతో ఉన్నందున ఇంగ్లండ్‌కు ఫేవరెట్ మార్కులు ఎక్కువగా పడతాయి. బ్యాటింగ్‌లో బలహీనంగా ఉన్నా టోర్నీలో కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకుని గెలిచినందున కివీస్‌ను తేలిగ్గా తీసుకోలేం.

### చరిత్ర బాటలో ఈ ఇద్దరు

ఐర్లాండ్ జాతీయుడైన మోర్గాన్ ఇంగ్లండ్ తరఫున ఆడటమే అనూహ్యం అనుకుంటే, కెప్టెన్‌గానూ ఎదిగి, ఇప్పుడు ప్రపంచ కప్ సాధించే వరకు తీసుకొచ్చాడు. గాటింగ్, గూచ్ వంటి మహామహులకు సాధ్యం కాని ఈ చిరకాల స్వప్నాన్ని గనుక నెరవేరిస్తే మోర్గాన్ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. అటు విలియమ్సన్‌కూ అంతే స్థాయిలో ఖ్యాతి దక్కుతుంది. మార్టిన్ క్రో, బ్రెండన్ మెకల్లమ్ వంటి తమ దేశ దిగ్గజాలకు త్రుటిలో చేజారిన కప్‌ను సాధిస్తే... ఇప్పటికే ప్రపంచ శ్రేణి బ్యాట్స్‌మన్‌గా పేరున్న అతడు వ్యక్తిగతంగా మరో మెట్టెక్కుతాడు.

### నాలుగోసారి... రెండోసారి....

ఇంగ్లండ్ ప్రపంచకప్ ఫైనల్ ఆడటం ఇది నాలుగోసారి. 1979, 87, 92లలో ఆ జట్టు తుది సమరానికి అర్హత సాధించింది. న్యూజిలాండ్ 2015 కప్ రన్నరప్. చిత్రమేమంటే ఇంగ్లండ్ ఆటగాళ్లందరికీ ఇదే తొలి ఫైనల్. కివీస్ తరఫున గత ఫైనల్ మ్యాచ్ ఆడిన గప్టిల్, విలియమ్సన్, టేలర్, బౌల్ట్, హెన్రీ ఈసారీ బరిలో దిగనున్నారు.

### అటో గోడ.. ఇటో గోడ

ఇరు జట్లలో అంత తొందరగా బద్దలు కొట్టలేనంతటి రెండు బ్యాటింగ్ గోడలున్నాయి. అవే విలియమ్సన్ , రూట్ (549 పరుగులు). పోటాపోటీగా రాణించిన ఈ ఇద్దరూ సమవయస్కులే. ఒకే తరహా బ్యాటింగ్ శైలి వారే. తమ జట్ల విజయాల్లో కీలకంగా మారిన వారే. ఎలాంటి సందర్భంలోనైనా ఇన్నింగ్స్‌లు నిర్మించగలవారే. ఫైనల్లో ఎవరు తమ పాత్ర సమర్థంగా పోషిస్తారో చూద్దాం.

**వీరి సమరం ఆసక్తికరం**

### రాయ్, బెయిర్‌స్టో X బౌల్ట్, హెన్రీ

జేసన్ రాయ్ (426 పరుగులు), బెయిర్‌స్టో (496 పరుగులు)... టోర్నీలో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జంట. గాయంతో రాయ్ దూరమైతే ఓ దశలో సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్నది జట్టు. అప్పుడు బెయిర్‌స్టో ఒంటరివాడైనట్లు కనిపించాడు. భారత్‌తో మ్యాచ్‌లో రాయ్ పునరాగమనంతో ఈ జోడీ మళ్లీ తడాఖా చూపుతోంది. ఫైనల్లో వీరికి న్యూజిలాండ్ పేసర్లు బౌల్ట్ (17 వికెట్లు), హెన్రీ (13 వికెట్లు) అడ్డుకట్ట వేస్తే ఇంగ్లండ్‌కు ముకుతాడు పడినట్లే. కచ్చితమైన లెంగ్త్‌లో బౌలింగ్ చేసే ఈ జోడీకి మరో పేసర్ లాకీ ఫెర్గూసన్ (18 వికెట్లు) తోడైతే ఆతిథ్య జట్టుకు కష్టాలు తప్పవు.






### విలియమ్సన్, టేలర్ X ఆర్చర్, వోక్స్

న్యూజిలాండ్ ఫైనల్‌కు చేరిందంటే అది కెప్టెన్ విలియమ్సన్ (548 పరుగులు) విశేష రాణింపు, రాస్ టేలర్ (335 పరుగులు) నిలకడతోనే. భారత్‌తో జరిగిన సెమీస్‌లో వీరి అర్ధ సెంచరీలే ఈ విషయాన్ని చాటుతాయి. ఈ ఇద్దరికీ ఇంగ్లండ్ పేసర్లు ఆర్చర్ (19 వికెట్లు), వోక్స్ (13 వికెట్లు) నుంచి సవాల్ ఎదురవడం ఖాయం. మూడో పేసర్ మార్క్ వుడ్ (17 వికెట్లు) కూడా తక్కువేం కాదు. కేన్–టేలర్ జోడీ... వీరిని కాచుకొని క్రీజులో నిలదొక్కుకుంటే న్యూజిలాండ్ ఇన్నింగ్స్ సాఫీగా సాగే అవకాశం ఉంటుంది.






### స్పిన్నర్లూ ఉన్నారోయ్...

బ్యాటింగ్‌కు అనుకూలమైనా, పేసర్లు పండుగ చేసుకుంటున్నా ఈ కప్‌లో స్పిన్నర్లూ అంతోఇంతో ప్రభావం చూపారు. అలాంటివారిలో ఆదిల్ రషీద్ (ఇంగ్లండ్, 11 వికెట్లు), సాన్‌ట్నర్ (న్యూజిలాండ్, 6 వికెట్లు) ముఖ్యులు. స్పిన్‌ను సమర్థంగా ఆడే భారత్‌ను సెమీస్‌లో సాన్‌ట్నర్ కట్టి పడేశాడు. రషీద్... ఆస్ట్రేలియాపై నిర్ణయాత్మక ప్రదర్శన కనబర్చాడు. ఇక ఫైనల్స్‌లో అవసరమైన సందర్భంలో వీరు ఎలాంటి పాత్ర పోషిస్తారో?

### తుది జట్లు (అంచనా)

**ఇంగ్లండ్:** జేసన్ రాయ్, బెయిర్‌స్టో, రూట్, మోర్గాన్ (కెప్టెన్), స్టోక్స్, బట్లర్, వోక్స్, ప్లంకెట్, ఆర్చర్, రషీద్, మార్క్ వుడ్.
**న్యూజిలాండ్:** గప్టిల్, నికోల్స్, విలియమ్సన్ (కెప్టెన్), రాస్ టేలర్, నీషమ్, లాథమ్, గ్రాండ్‌హోమ్, సాన్‌ట్నర్, హెన్రీ, బౌల్ట్, ఫెర్గూసన్.

### పిచ్, వాతావరణం

శనివారం వరకు పిచ్‌పై సన్నటి పొరలా పచ్చిక ఉంది. వేడి ప్రభావంతో ఆదివారం మ్యాచ్ సమయానికి అది ఎండిపోవచ్చు. తద్వారా సహజ స్వభావంతో బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుంది. పిచ్‌ను పరిశీలించిన మోర్గాన్ మ్యాచ్ మొదలయ్యే వేళకు ఓ అంచనాకు రావొచ్చని అన్నాడు. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు. **ఫైనల్‌కూ రిజర్వ్ డే ఉంది. ఆదివారం వర్షం వల్ల అంతరాయం కలిగి ఫలితం రాకపోతే సోమవారం కొనసాగిస్తారు. ఒకవేళ ఫైనల్ 'టై' అయితే 'సూపర్ ఓవర్' ద్వారా విజేతను నిర్ణయిస్తారు. మ్యాచ్ రద్దయితే మాత్రం రెండు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.**

### ముఖాముఖిలో పోటాపోటీ...

ఇప్పటివరకు ఇరు జట్ల మధ్య 90 మ్యాచ్‌లు జరిగాయి. న్యూజిలాండ్ 43 మ్యాచ్‌లు, ఇంగ్లండ్ 41 గెలిచాయి. రెండు 'టై' కాగా, నాలుగింట్లో ఫలితం తేలలేదు. ప్రపంచకప్‌లో 9 సార్లు ఎదురుపడగా ఐదుసార్లు కివీస్, నాలుగుసార్లు ఇంగ్లండ్ నెగ్గాయి.

# హై హై... హాలెప్

## వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్ నెగ్గిన సిమోనా హాలెప్

- ఈ ఘనత సాధించిన తొలి రొమేనియా ప్లేయర్‌గా రికార్డు
- తుది పోరులో 56 నిమిషాల్లోనే సెరెనాపై ఘనవిజయం
- రూ.20 కోట్ల 26 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

**ఆల్‌టైమ్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ రికార్డును సమం చేసే అవకాశాన్ని అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ మరోసారి చేజార్చుకుంది. సహజశైలిలో, స్థాయికి తగ్గట్టు ఆడితే విజయం ఖాయమనుకున్న చోట ఈ నల్లకలువకు ఊహించని పరాజయం ఎదురైంది. గతంలో సెరెనాతో ఆడిన పది మ్యాచ్‌ల్లో కేవలం ఒక్కసారి మాత్రమే నెగ్గిన రొమేనియా క్రీడాకారిణి సిమోనా హాలెప్ వింబుల్డన్ వేదికపై తన కెరీర్‌లోనే చిరస్మరణీయ విజయం నమోదు చేసుకుంది. 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత సెరెనాపై కేవలం 56 నిమిషాల్లో అదీ నాలుగు గేమ్‌లు మాత్రమే కోల్పోయి జయకేతనం ఎగురవేసిన హాలెప్ కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకుంది.**

**లండన్:** మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని భావించిన సెరెనా విలియమ్స్‌కు మళ్లీ ఆశాభంగమైంది. ఇప్పటికే 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ఈ అమెరికా స్టార్ మరో టైటిల్‌తో మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా–24 టైటిల్స్) పేరిట ఉన్న ఆల్‌టైమ్ అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ రికార్డును సమం చేయాలని ప్రయత్నించి విఫలమైంది. గత ఏడాది వింబుల్డన్‌లో, యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరి రన్నరప్‌తోనే సరిపెట్టుకున్న సెరెనా ఈ యేడు కూడా వింబుల్డన్ ఫైనల్లో ఓటమి రుచి చూసింది. గత సంవత్సరం తుది పోరులోఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ) షాక్ ఇవ్వగా... ఈసారి సిమోనా హాలెప్ (రొమేనియా) ఆ పని చేసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఏడో సీడ్ హాలెప్ 6–2, 6–2తో 11వ సీడ్, ఏడుసార్లు చాంపియన్ సెరెనా విలియమ్స్‌ను చిత్తుగా ఓడించి తొలిసారి వింబుల్డన్ టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. అంతేకాకుండా వింబుల్డన్ టైటిల్ గెలిచిన తొలి రొమేనియా ప్లేయర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. విజేతగా నిలిచిన హాలెప్‌కు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 20 కోట్ల 26 లక్షలు)... రన్నరప్ సెరెనాకు 11 లక్షల 75 వేల పౌండ్లు (రూ.10 కోట్ల 13 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.



### ఫైనల్ గణాంకాలు

| హాలెప్ | | సెరెనా |
|---|---|---|
| 1 | ఏస్‌లు | 2 |
| 0 | డబుల్ ఫాల్ట్‌లు | 1 |
| 2/2 | నెట్ పాయింట్లు | 4/11 |
| 4/5 | బ్రేక్ పాయింట్లు | 0/1 |
| 13 | విన్నర్స్ | 17 |
| 3 | అనవసర తప్పిదాలు | 26 |
| 55 | మొత్తం పాయింట్లు | 38 |

### ఆరంభం నుంచే దూకుడు...

గతంలో 37 ఏళ్ల సెరెనాపై ఒక్కసారి మాత్రమే నెగ్గిన 27 ఏళ్ల హాలెప్ ఈసారి మాత్రం ఆరంభం నుంచే తన ఆధిపత్యాన్ని చాటుకుంది. తొలి గేమ్‌లో, మూడో గేమ్‌లో సెరెనా సర్వీస్‌లను బ్రేక్ చేసిన హాలెప్ తన సర్వీస్‌లను కాపాడుకొని 4–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత సెరెనాకు కోలుకునే అవకాశం ఇవ్వకుండా ఆడిన హాలెప్ తొలి సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో సెరెనా పుంజుకుంటుందని ఆశించినా హాలెప్ జోరు ముందు ఆమె తేలిపోయింది. ఐదో గేమ్‌లో, ఏడో గేమ్‌లో సెరెనా సర్వీస్‌లను బ్రేక్ చేసిన హాలెప్ ఎనిమిదో గేమ్‌లోనూ తన సర్వీస్‌ను నిలబెట్టుకొని విజయాన్ని ఖాయం చేసుకుంది. గతేడాది హాలెప్ ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించింది.

> నా జీవితంలోనే గొప్ప మ్యాచ్ ఆడాను. వింబుల్డన్ ఫైనల్ ఆడాలన్నది మా అమ్మ కోరిక. వింబుల్డన్ ఫైనల్ ఆడితే టెన్నిస్‌లో ఏదో ఘనత సాధించినట్లేనని మా అమ్మ చెప్పింది. ఆ రోజు రానే వచ్చింది. ఆమె కోరుకున్నట్టే వింబుల్డన్‌లో ఫైనల్ ఆడటమే కాకుండా టైటిల్ కూడా గెలిచాను. మా అమ్మ కలను నిజం చేశాను.
> – సిమోనా హాలెప్


విన్నర్స్ ట్రోఫీతో హాలెప్




## ఫెడరర్ X జొకోవిచ్

### నేడు వింబుల్డన్ పురుషుల సింగిల్స్ ఫైనల్

సాయంత్రం గం. 6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-2లో ప్రత్యక్ష ప్రసారం

- ఫెడరర్, జొకోవిచ్ నేడు 48వ సారి ముఖాముఖిగా తలపడనున్నారు. గతంలో 25 సార్లు జొకోవిచ్... 22 సార్లు ఫెడరర్ గెలుపొందారు.
- ఫైనల్స్‌లో వీరిద్దరు ఎదురెదురుగా ఆడనుండటం 19వ సారి. ఫైనల్స్ ముఖాముఖిలోనూ జొకోవిచ్ 12–6తో ఆధిక్యంలో ఉన్నాడు. గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఫెడరర్‌పై 9సార్లు గెలిచిన జొకోవిచ్ 6సార్లు ఓడిపోయాడు.
- వింబుల్డన్‌లో వీరిద్దరు మూడుసార్లు తలపడ్డారు. 2015, 2014 ఫైనల్స్‌లో ఫెడరర్‌పై జొకోవిచ్ గెలిచి టైటిల్ సాధించగా... 2012 సెమీఫైనల్స్‌లో జొకోవిచ్‌పై ఫెడరర్ విజయం సాధించాడు.

## భారత లిఫ్టర్ ప్రదీప్‌కు స్వర్ణం



**అపియా (సమోవా):** కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ తమ పతకాల వేటను పసిడి పతకంతో ముగించింది. పోటీల చివరిరోజు పురుషుల 109 కేజీల విభాగంలో ప్రదీప్ సింగ్ బంగారు పతకం సాధించాడు. ఈ క్రమంలో అతను కొత్త కామన్వెల్త్ రికార్డును నమోదు చేశాడు. ప్రదీప్ క్లీన్ అండ్ జెర్క్‌లో 202 కేజీలు, స్నాచ్‌లో 148 కేజీలు బరువెత్తి ఓవరాల్‌గా 350 కేజీలతో విజేతగా నిలిచాడు. 96 కేజీల విభాగంలో వికాస్ ఠాకూర్ (338 కేజీలు) రజత పతకాన్ని సాధించాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత లిఫ్టర్లు యూత్, జూనియర్, సీనియర్ విభాగాల్లో కలిపి మొత్తం 35 పతకాలను సాధించారు.

## యూఎస్ ఓపెన్ సెమీస్‌లో సౌరభ్ వర్మ



**ఫులెర్టాన్:** యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారుడు సౌరభ్ వర్మ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. భారత్‌కే చెందిన హెచ్‌ఎస్ ప్రణయ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో సౌరభ్ వర్మ 21–19, 23–21తో విజయం సాధించాడు. ఈ గెలుపుతో సౌరభ్ ముఖాముఖి రికార్డులో 4–0తో ప్రణయ్‌పై తన ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. సెమీస్‌లో తనోంగ్సక్ సెన్‌సోమ్‌బున్‌సక్ (థాయ్‌లాండ్)తో సౌరభ్ పోటీ పడతాడు.

## బొటాస్‌కు పోల్ పొజిషన్



**సిల్వర్‌స్టోన్ (ఇంగ్లండ్):** ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో మెర్సిడెస్ జట్టు డ్రైవర్ వాల్తెరి బొటాస్ నాలుగోసారి పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం జరిగిన బ్రిటిష్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్‌లో బొటాస్ అందరికంటే వేగంగా ఒక నిమిషం 25.093 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. ఆదివారం జరిగే ప్రధాన రేసును తొలి స్థానం నుంచి ప్రారంభించే అవకాశాన్ని సంపాదించాడు. మెర్సిడెస్‌కే చెందిన హామిల్టన్ రెండో స్థానం నుంచి మొదలు పెడతాడు. లెక్‌లెర్క్ (ఫెరారీ)... వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్)... గాస్లీ (రెడ్‌బుల్) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల నుంచి రేసును ఆరంభిస్తారు.

1884 జూన్ 16న న్యూయార్క్‌లోని కోనీ దీవిలో ప్రపంచంలోనే తొలిసారిగా రోలర్ కోస్టర్‌ను ఉపయోగించారు.






# దండయాత్ర.. ఇది ఏరియా-51పై దండయాత్ర!

అదిగో పులి అంటే.. ఇదిగో తోక అన్న సామెత మీరు వినే ఉంటారు! ఈ తంతు కూడా అలాంటిదే.. అగ్రరాజ్యం అమెరికాలో చాలా కాలంగా ఓ పుకారు ప్రచారంలో ఉంది. మిలటరీ వాళ్లు అప్పుడెప్పుడో గ్రహాంతర వాసులతో భేటీ అయ్యారు. వాళ్ల వ్యోమనౌకను ఏరియా-51 అనే ప్రాంతంలో దాచి ఉంచి ప్రయోగాలు చేస్తున్నారని కూడా అంటూ ఉంటారు. ఈ పుకారు ఆధారంగానే ఇండిపెండెన్స్ డే, ట్రాన్స్‌ఫార్మర్స్ వంటి హాలీవుడ్ సినిమాలూ రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు ఈ ప్రస్తావనంతా దేనికంటే ఈ ఏరియా-51పై దండయాత్ర చేయాలన్న అంశానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 5,40,000 మంది మద్దతు పలికారట! ఇంత మంది ఒక్కసారిగా ఏరియా-51 పైకి వెళితే మిలటరీ వాళ్లు కూడా మనల్ని అడ్డుకోలేరని ఈ ఆన్‌లైన్ పిటిషన్‌ను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన వాళ్లు అంటున్నారు. ఇంతకీ ఏరియా-51 అనేది ఉందా? అంటే భేషుగ్గా ఉంది. లాస్‌వేగస్ నుంచి ఓ గంట ప్రయాణం చేస్తే వచ్చే అమర్‌గోసా లోయలో ఇది ఉంటుంది. కాకపోతే.. ఇందులో గ్రహాంతర వాసుల వ్యోమనౌకలు, టెక్నాలజీలు ఉన్నాయా? లేదా? అన్నదే ప్రశ్న. ఈ కేంద్రంపైకి సెప్టెంబర్ 20న దండయాత్ర చేద్దామని అనుకుంటున్నారు స్మైలీకున్ అనే గేమర్. వీడియో గేమ్ క్యారెక్టర్ నరుటో మాదిరిగా (చేతులు వెనక పెట్టుకుని తల ముందుకుపెట్టి) పరిగెత్తితే మిలటరీ వాళ్ల బుల్లెట్లకు కూడా చిక్కమని అంటున్నాడు ఈ గేమర్. అయితే దీన్ని అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని కొందరు వ్యాఖ్యానిస్తున్నా.. సెప్టెంబర్ 20న ఎవరైనా అక్కడకు వస్తే ఏమిటనేది ఇప్పుడు చర్చకు వస్తోంది. అమెరికా వైమానిక విభాగం ప్రతినిధి లారా మెక్ ఆండ్రూస్ ఈ విషయంపై మాట్లాడుతూ.. ఏరియా-51పై దండయాత్ర చేయాలనుకున్న వారికి ఓ చిన్న వార్నింగ్ ఇచ్చారు. 'అది ఓ వైమానిక శిక్షణ కేంద్రం. అక్కడికి ఎవరూ రావద్దనే చెబుతాం. లేదంటే.. దేశాన్ని, దాని ఆస్తులను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు'అని ప్రకటించారు. చాలా కాలంపాటు అసలు ఈ ఏరియా-51 అనేది లేనేలేదని, దీనిపై వచ్చే వార్తలన్నీ పుకార్లని చెప్పిన అమెరికా.. 2013లో దీని ఉనికిని స్వయంగా నిర్ధారించింది.

## అన్నిపార్టీల నేతలూ టచ్‌లో ఉన్నారు

### కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ



**సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్):** బీజేపీ నాయకత్వంతో కాంగ్రెస్, టీడీపీ, టీఆర్‌ఎస్‌తోపాటు సీపీఐ నాయకులూ టచ్‌లో ఉన్నారని, వారంతా తగిన సమయం కోసం వేచి చూస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. చాలా మంది కాంగ్రెస్ ప్రముఖులు, టీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. టీఆర్‌ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో భేటీ నేపథ్యంలో ఆయన పార్టీలో ఎప్పుడు చేరుతున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు దత్తాత్రేయ పైవిధంగా స్పందించారు. శనివారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయమని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వంటి బలమైన నాయకులే విశ్వసిస్తున్నారని అన్నారు. వినోద్‌కుమార్, కవిత ఓడిపోవడంతో టీఆర్‌ఎస్‌లో అంతర్మథనం ప్రారంభమైందన్నారు. టీఆర్‌ఎస్ పాలనలో అన్ని శాఖల్లోనూ అవినీతి వేళ్లూనుకుపోయిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రైల్వే ప్రాజెక్టులకు రూ.910 కోట్ల కేటాయింపులు జరిపిందని, అయితే మంత్రి కేటీఆర్ రైల్వే కేటాయింపుల్లో రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదనడం ఆయన అవగాహనారాహిత్యమని అన్నారు.

## కాంగ్రెస్ నాయకత్వాన్ని మార్చాలి

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**చండూరు:** కాంగ్రెస్ పార్టీలో కొన్ని తప్పుడు నిర్ణయాలతోనే గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాలేకపోయామని, కాంగ్రెస్ నాయకత్వాన్ని మార్చాలని ఎప్పట్నుంచో చెబుతూ వస్తున్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా చండూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఇంతనష్టం జరిగినా నాయకత్వాన్ని మార్చకపోవడం బాధాకరమన్నారు. ఇదే విధంగా తప్పులు చేస్తూ పోతుంటే రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయన్నారు. సీఎం కేసీఆర్‌పై యుద్ధం చేయడానికి కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు సరిపోరు అని నాలుగు గోడల మధ్య రెండేళ్లుగా చెబుతూనే ఉన్నానని తెలిపారు. ఇటీవల తాను మాట్లాడిన విషయాలకు కాంగ్రెస్ పార్టీ షోకాజ్ నోటీస్ ఇచ్చిందని, దానికి వివరణ సైతం అందజేశానన్నారు. పార్టీ కోసం తాను మంచి మాటలు చెప్పానని, తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లో బంగారం పట్టివేత

**రామగుండం:** కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఓ వ్యక్తి నుంచి జీఆర్పీ పోలీసులు కిలో బంగారం పట్టుకున్నారు. జీఆర్పీ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరికి చెందిన గోలి రామాంజనేయులు శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని పలు జ్యువెలరీ షాపుల్లో బంగారం విక్రయించి కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో తిరిగి వెళుతున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో రైలు పెద్దపల్లి జిల్లా రామగుండంవద్దకు చేరిన సమయంలో జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి రామాంజనేయులును తనిఖీ చేయగా అతడి వద్ద కేజీ బంగారం, రూ.2 లక్షల నగదు లభించింది. అతడిని విచారించగా పొంతన లేని సమాధానం చెప్పడం, ఎలాంటి రశీదులు చూపకపోవడంతో బంగారం, నగదును స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎదురెక్కుతున్న ప్రాణహిత నీరు

- మేడిగడ్డ బ్యారేజీలో 5.5 టీఎంసీల నిల్వ
- కన్నెపల్లిలో మూడు మోటార్లతో ఎత్తిపోతలు
- గ్రావిటీ కాల్వ గుండా అన్నారానికి ప్రాణహిత
- అన్నారం బ్యారేజీలో 3.1 టీఎంసీల నిల్వ

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీకి నీరు రోజురోజుకూ పెరుగుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాంతాల్లో గోదావరిలో ప్రాణహిత నది నీరు చేరి కన్నెపల్లి నుంచి మోటార్లు ఎత్తి పోయడంతో ఎదురెక్కుతున్నాయి. శనివారం మేడిగడ్డ వద్ద 9,600 క్యూసెక్కుల వరద ప్రవహించింది. బ్యారేజీలోని 85 గేట్లు మూసివేయడంతో 5.5 టీఎంసీల నీరు 7.6 మీటర్ల ఎత్తులో నిలిచి ఉంది. దీంతో నీరంతా బ్యారేజీ వెనక్కి తరలుతోంది.

### కన్నెపల్లిలో మూడు మోటార్లతో..

కన్నెపల్లి పంపుహౌస్‌లో శనివారం 3, 4, 6 నంబర్ల మోటార్లు నీటిని ఎత్తిపోశాయి. శుక్రవారం నాలుగు మోటార్లు ఎత్తిపోసిన విషయం తెలిసిందే. కాగా, ప్రాణహిత నదికి వరద ఉధృతి కాస్త తగ్గింది. ఈ వారంలో నీటి లభ్యతను బట్టి మొత్తం 11 మోటార్లలో 6 మోటార్లకు వెట్‌రన్ నిర్వహించి నీటిని ఎత్తిపోయనున్నారు.

### అన్నారంలో 3.2 టీఎంసీలు

కన్నెపల్లి నుంచి గ్రావిటీ కాల్వ ద్వారా 13.34 కిలోమీటర్ల దూరం నీరు ప్రయాణించి అన్నారం బ్యారేజీలో కలుస్తోంది. ఈ బ్యారేజీలోని 66 గేట్లను మూసివేశారు. బ్యారేజీ నీటినిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 3.1 టీఎంసీలు నిల్వ ఉంది. ఈ ప్రాంతంలో గోదావరి నీటి మట్టం అడుగు భాగం నుంచి 8.5 మీటర్లు ఉంది.

### అన్నారం నుంచి వేలాలకు..

కన్నెపల్లి నుంచి మోటార్ల ద్వారా ఎత్తిపోసిన నీరు గ్రావిటీ కాల్వ ద్వారా వెళ్లి అన్నారం బ్యారేజీలో కలుస్తోంది. ఇలా కలసిన నీరంతా గోదావరిలో పెద్దపల్లి జిల్లా వేలాల వరకు 23 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. ఇక్కడ గోదావరి వెడల్పు పెరగడంతో నీరు మెల్లమెల్లగా కదులుతోంది.



గ్రావిటీ కాల్వ ద్వారా అన్నారం బ్యారేజీలోకి చేరుతున్న నీరు

## బొగత వద్ద పర్యాటకుల సందడి



**వాజేడు :** ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం వద్ద శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. రెండో శనివారం సెలవు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. గత కొన్ని రోజులుగా మండలంతోపాటు గుట్టలపై పడుతున్న వర్షాలకు జలపాతం పూర్వపు అందాలను సంతరించుకుని జలధారలతో కనువిందు చేస్తోంది. ప్రకృతి అందాలను వీక్షించడానికి వచ్చిన పర్యాటకులు జలపాతం వద్ద నిర్మించిన కొలనులో స్నానాలు చేయడంతోపాటు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

## దేవాదుల వద్ద పంపింగ్ షురూ



దేవాదుల పంప్‌హౌస్

**కన్నాయిగూడెం:** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమీపంలోని గుట్టల గంగారంలో నిర్మించిన చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం (తుపాకులగూడెం ప్రాజెక్టు) వద్ద శనివారం నీటి పంపింగ్ మొదలైంది. కొన్నిరోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరిలో నీరు చేరడంతో ఇక్కడ నీటి మట్టం పెరిగింది. అయితే మూడు రోజులుగా ఎగువ నుంచి వరద తగ్గడంతో గోదావరిలో నీటి ప్రవాహం మందగించి శనివారం సాయంత్రం వరకు 73.2 మీటర్లుగా నమోదైనట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. కాగా, దేవాదుల పంప్‌హౌస్ వద్ద మొత్తం మూడు ఫేజ్‌లు ఉండగా.. ఒక్కో ఫేజ్ నుంచి ఒక మోటార్ ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. అవసరాన్ని బట్టి మిగతా మోటార్ల ద్వారా కూడా పంపింగ్ చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## కన్నబిడ్డనే కడతేర్చాలనుకున్న తండ్రి

పెళ్లి తర్వాత ప్రేమాయణమే కారణం.. • కొనఊపిరితో ఉన్న యువతి.. ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు

**చౌటుప్పల్:** కుటుంబ పరువు తీస్తుందని కూతురునే చంపబోయాడు ఓ తండ్రి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యువతి (22), అదే గ్రామానికి చెందిన యువకుడు (25) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో.. తామిద్దరం వివాహం చేసుకోవాలనుకుంటున్నామని చెప్పారు. కానీ వరుసలు కుదరకపోవడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. ఆ తర్వాత గత నెల 14న ఆ యువతికి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జిల్లెలగూడ గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేశారు. కానీ అదేనెల 20న ఆ యువతి ప్రియుడితో వెళ్లిపోవడంతో అమ్మా యి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీ సులు వారిని వెతికి తీసుకొచ్చారు. యువతిని తీసుకెళ్లిన యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అనంతరం ఇరు కుటుంబాలు, ప్రేమికులు ఎవరికి వారుగా ఉండాలని గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో యువతి ఈ నెల 10న ప్రియుడితో మరోసారి వెళ్లిపోవడంతో కుటుంబసభ్యులు ఆమెను వెతికి పట్టుకొచ్చి నారాయణ పురం మండలం కంకణాలగూడెంలోని తమ బంధువుల ఇంట్లో ఉంచారు.

**చంపేందుకు నిర్ణయించుకున్న తండ్రి..**

కుమార్తె వ్యవహారంతో కుటుంబం పరువు పోతుందని భావించిన తండ్రి ఆమెను చంపేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఓ ఆటోను కిరాయికి తీసుకుని కంకణాలగూడెంకు వెళ్లాడు. ఇంటికి వెళ్దామంటూ కుమార్తెతో చెప్పి అక్కడి నుంచి పంతంగికి బయలుదేరారు. జాతీయ రహదారిపై నుంచి వెళ్లాల్సి ఉండగా జిల్లేడుచెల్క గ్రామ స్టేజీ వద్దకు రాగానే ఆటోను మట్టిరోడ్డు వైపు మళ్లించాడు. అటుగా వెళితే గ్రామస్తులు చూస్తారు, ఇక్కడి నుంచైతే ఎవరూ చూడరని కుమార్తెను నమ్మించాడు. కొంత దూరం వెళ్లాక నిర్మానుష్య ప్రాంతంలో కుమార్తె గొంతును బలంగా నులమడంతో ఊపిరి ఆడక ఆమె స్పృహ కోల్పోయింది. దీంతో ఆమె చనిపోయిందని భావించిన తండ్రి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయంపై తమ బంధువుకు సమాచారమిచ్చాడు. భయపడిన అతను వెంటనే విషయాన్ని పోలీసులకు చెప్పాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు కొన ఊపిరితో ఉన్న యువతిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని, ప్రస్తుతం ఆమె కోలుకుంటోందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

## తెలంగాణ పోరాట యోధురాలు

## చకిలం లలితాదేవి కన్నుమూత

- భర్త తిరుమలరావుతో కలసి రజాకార్లపై పోరాటం
- సంవత్సరం నిండని బిడ్డతో మూడేళ్లు జైలు జీవితం
- హైదరాబాద్‌లో అంత్యక్రియలు



**సూర్యాపేట:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చకిలం లలితాదేవి (93) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం ఉదయం హైదరాబాద్ హుడా కాంప్లెక్స్‌లో మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లలితాదేవి ఆమె పెద్ద కుమారుడు చకిలం జగదీశ్‌చందర్ రావు వద్ద ఉంటున్నారు. సూర్యాపేట జిల్లాలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సీతారామారావు, వెంకటనర్సమ్మ కుమార్తె లలితాదేవికి 14 ఏళ్ల వయసులోనే మోతే మండలం నామవరం గ్రామానికి చెందిన సాయుధ పోరాట యోధుడు చకిలం తిరుమలరావుతో వివాహం జరిగింది. మెట్టినింటిలో అడుగుపెట్టడంతోనే తెలంగాణ సాయుధ పోరాటంలో అడుగుపెట్టినట్టయింది. నామవరం గ్రామంలో రజాకార్లు వారి ఇంటిని తగలపెట్టడం.. మామ, మరిదిలపై దాడి చేయడంతో నిర్బంధం పెరిగి అడవిలోకి వెళ్లారు. ఒక దశలో సంవత్సరం కూడా నిండని బిడ్డను ఎవరికైనా ఇచ్చి ఉద్యమంలో పాల్గొనాలని భావించింది. ఒక రెడ్డి కుటుంబం ఆ బిడ్డను పెంచుకునేందుకు ముందుకు వచ్చినప్పటికీ అత్తగారి వద్ద బిడ్డను ఉంచి అడవిబాట పట్టారు. తన భర్తతో కలసి సాయుధ పోరాటంలో పనిచేసి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి దళంలో మల్లు స్వరాజ్యం, ప్రియంవద, శశి రేఖ, కమలాదేవిలతో కలసి అడవిలోకి వెళ్లారు. తుపాకులు పేల్చడంలోనూ శిక్షణ తీసుకున్నారు. గ్రామాల్లో ప్రజారాజ్యాలు ఏర్పాటు చేసి కూలీలకు కనీస వేతనాలు ఇప్పించారు. పోరాటంలో జైలుకెళ్లి వచ్చిన తర్వాత హిందీ పండిట్‌గా సూర్యాపేట పట్టణంలో పలు పాఠశాలల్లో పనిచేశారు. ఆమె అంత్యక్రియలు శనివారం హైదరాబాద్‌లోని వివేకానంద శ్మశాన వాటికలో నిర్వహించారు.



సాయుధ పోరాటంలో శిక్షణ తీసుకుంటున్న లలితా దేవి (వృత్తంలో..)

**బిడ్డతో సహా జైలు జీవితం..:** లలితాదేవి సంవత్సరం కూడా నిండని బిడ్డ అరుణతో ఔరంగాబాద్ జైలులో మూడేళ్లు ఉన్నారు. అయినప్పటికీ ఆమెకు సాయుధపోరాట యోధులకు ఇచ్చే పింఛన్ రాకపోవడం గమనార్హం. పోరాట విరమణ అనంతరం తిరిగొచ్చిన భార్యా భర్తలకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు ఆమె ఒంటిపై ఉన్న నగలను కూడా పార్టీకి చందాగా ఇచ్చినట్లు కుమార్తె అరుణ 'సాక్షి'కి తెలిపారు.

# ఆరోగ్యంలో నంబర్‌వన్ కావాలి

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు
- అన్ని ఆస్పత్రుల్లో ఐసీయూ, డయాలసిస్ కేంద్రాలు
- మంత్రులు ఈటల, కొప్పుల
- జగిత్యాలలో నర్సింగ్ కళాశాల భవనం ప్రారంభం



నర్సింగ్ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్

**సాక్షి, జగిత్యాల:** ఆరోగ్యరంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలో రూ.17.85 కోట్లతో నిర్మించిన నూతన నర్సింగ్ కళాశాల భవనాన్ని శనివారం ఆయన మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఒకప్పుడు తుప్పుపట్టిన బెడ్లు, సెలైన్ స్టాండ్లతో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులను టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐసీయూ, డయాలసిస్ కేంద్రాలతోపాటు అధునాతన సౌకర్యాలు కల్పించామని చెప్పారు. జిల్లా కేంద్రంలో పనిచేసే వారికంటే గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ఎక్కువ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పేదలైన నిండు గర్భిణులు కూలి పనులకు వెళ్లే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్‌తోపాటు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తోందని చెప్పారు. మానవ సంపదను ప్రభుత్వం ఆస్తిగా పరిగణిస్తోందని, విద్యాభివృద్ధి కోసం కొత్తగా 700 రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.లక్షకు పైగా ఖర్చుపెడుతోందని చెప్పారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ గతంలో పేరుకే ప్రభుత్వ ఆస్పత్రులుగా ఉండేవని, కానీ కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కావని అన్నారు. అందరికీ సంపూర్ణ ఆరోగ్యం దిశగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మెడికల్ అండ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రమేశ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మానవత్వం చాటిన మంత్రులు

**కొడిమ్యాల(చొప్పదండి):** అధికారిక కార్యక్రమం కంటే ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటమే ప్రథమ కర్తవ్యంగా భావించారు మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముగ్గురు బాధితులను తమ కాన్వాయ్‌లోని వాహనంలో ఆస్పత్రికి పంపించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం గోపాల్‌రావుపేటకు చెందిన కోమటి శేఖర్, భార్య నళిని, కుమారుడు చందూతో కలసి శనివారం కరీంనగర్‌లోని కూతురు ఇంటికి బైక్‌పై బయలుదేరారు. ఆరెపేట శివారులో వీరి బైక్‌ను గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు జగిత్యాలలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ప్రారంభించేందుకు కరీంనగర్ నుంచి వస్తున్నారు. రోడ్డుపక్కన విలపిస్తున్న ప్రమాద బాధితులను చూసి వాహనాలు ఆపి వారి వద్దకు వచ్చారు. క్షతగాత్రులను తమ కాన్వాయ్‌లోని ఓ వాహనంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. మానవత్వంతో స్పందించిన మంత్రులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



గాయపడిన వారిని పలకరిస్తున్న మంత్రులు



పిచ్చికుక్క కరవడంతో గాయపడ్డ వృద్ధురాలు

## పిచ్చికుక్క స్వైర విహారం

- 33 మందిపై దాడి..
- వరంగల్ రూరల్ జిల్లా వరికోలు గ్రామంలో ఘటన

**వరంగల్ రూరల్:** జిల్లాలోని నడికూడ మండలం వరికోలు గ్రామంలో శనివారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి 33 మందిపై దాడి చేసింది. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గ్రామస్తులంతా పొలం పనులకు వెళుతున్న సమయంలో శివారు నుంచి వచ్చిన ఓ పిచ్చి కుక్క కనిపించిన వారందరిపై దాడి చేసింది. అలాగే ఇళ్ల ముందు కట్టేసిన గేదెలతోపాటు కుక్కలపైనా దాడి చేసింది. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. కుక్క దాడి చేస్తున్న సమయంలో జనం బెంబేలెత్తి కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఆ కుక్క కోసం వీధుల్లో వెతకగా అనుమానంగా కనిపించిన రెండు కుక్కలను కొట్టి చంపారు.

2002 జూన్ 15న ఎంఎన్ అనే గ్రహశకలం భూమికి కేవలం 1.2 లక్షల కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లిపోయింది. అదే కనుక భూమిని ఢీకొని ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది.





# బుర్ర తక్కువ మనిషి!

బుర్ర తక్కువ మనిషి అని మీరెవరినైనా తిట్టారనుకోండి. అవతలి వాళ్లు.. వెంటనే ఇంతెత్తున ఎగురుతారు. నన్ను అంతమాట అంటావా? అని కయ్యానికి దిగుతారు!

కానీ.. రష్యాలోని ఓ 60 ఏళ్ల వ్యక్తిని ఈ మాట అంటే మాత్రం పెద్దగా ఇబ్బందేమీ ఉండకపోవచ్చు! ఎందుకంటారా? తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే ఇతనికి మెదడులో సగం లేదు కాబట్టి!

ఆశ్చర్యంగా ఉందా? అసలు ఎలా బతికాడన్న అనుమానం వస్తోందా? చదివేయండి. మరి.. మాస్కోలోని బుర్నాసియాన్ ఫెడరల్ మెడికల్, బయో ఫిజికల్ సెంటర్‌లో కొన్ని రోజుల క్రితం 60 ఏళ్ల వృద్ధుడు చేరాడు. ఒక కాలు, చేయి కదపలేక పోతున్నా అని అంటే.. డాక్టర్లు స్కాన్ చేయించారు. తీరా ఆ మెదడు స్కాన్‌ను చూసిన డాక్టర్లు షాక్ అయ్యారు. ఎడమ వైపు భాగం అసలు లేనే లేదు. నల్లటి ఖాళీ మాత్రమే కనిపిస్తోంది. ఇలా సగం మెదడు మాత్రమే ఉంటే.. ఏదో ఒక సమస్య ఉండి తీరాలనుకున్న డాక్టర్లు.. అతడి గురించి వాకబు చేస్తే మరిన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. ఆ వ్యక్తి ఇంజనీరింగ్ చదవడమే కాకుండా.. రెడ్ ఆర్మీలో కూడా పనిచేశాడు. ఏరకమైన ఇబ్బందులూ లేకుండా ఎంచక్కా కుటుంబాన్ని కూడా నడుపుకొచ్చారు. పిండంలో ఉన్న సమయంలోనే అతడి మెదడు సగమే పెరిగి ఉంటుందని.. స్కాన్ల వంటి టెక్నాలజీ అప్పట్లో అందుబాటులో లేని కారణంగా అతడు భూమ్మీదకు రాగలిగాడని న్యూరాలజిస్ట్ మరీనా అనికినా చెప్పారు. చెడిపోయిన మెదడు భాగాలను అతి అరుదైన శస్త్రచికిత్స ద్వారా తొలగించే అవకాశమున్నా దుష్పరిణామాలకు దారితీయొచ్చని.. ఈ వ్యక్తి విషయంలో సగం మెదడు లేకపోయినా ఏరకమైన ఇబ్బంది లేకపోవడం అద్భుతమనే చెప్పాలని అంటున్నారు అనికినా. సాధారణంగా మెదడు కుడివైపు భాగం సృజనాత్మకమైన అంశాలకు ఉపయోగపడితే.. ఎడమవైపు భాగం సైన్స్, మ్యాథమెటిక్స్, లాజిక్స్ వంటి అంశాలకు పనికొస్తుంది. కానీ ఈ వ్యక్తిలో ఎడమ భాగం లేకున్నా సమస్యలు లేకపోవడం గమనార్హం.

# కలలకు రెక్కలు తొడిగితే

సాక్షి, హైదరాబాద్

అమెరికా వెళ్లి ఉన్నత చదువులు చదవాలని, అక్కడ మంచి ఉద్యోగం చేయాలని ప్రపంచవ్యాప్తంగా ప్రతి విద్యార్థి కలలు కంటుంటారు. ఇందుకోసం ఇంజనీరింగ్ పూర్తి చేసి జీఆర్‌ఈ రాయాలి, వీసా ఇంటర్వ్యూకి వెళ్లాలి. అక్కడ సెలెక్ట్ కావాలి.. ఇవన్నీ పూర్తయినా.. వీసా వస్తుందన్న గ్యారెంటీ లేదు. కానీ, అమెరికా ప్రభుత్వం మనదేశంలోని పేద విద్యార్థులను పరిమిత సంఖ్యలో ఎంపిక చేసి వారిదేశంలో దాదాపు ఏడాది పాటు ఉచితంగా విద్యనం దిస్తుంది. కమ్యూనిటీ కాలేజ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం (సీసీఐపీ) పేరిట చేపడుతున్న ఈ కార్యక్రమంతో పలువురు ప్రతిభావంతులైన విద్యార్థులకు సంవత్సరంపాటు యూఎస్‌లో విద్యనభ్యసించే అరుదైన అవకాశం దక్కుతుంది. మనదేశంలో ఉన్న ఆయా అమెరికన్ కాన్సులేట్లు ఈ ప్రక్రియను చేపడతాయి. ప్రతి విద్యార్థికి ప్రాథమిక అర్హత ఆంగ్లంలో మాట్లాడగలగడమే.

**అమెరికాలో విద్యాభ్యాసానికి అరుదైన అవకాశం**
- కమ్యూనిటీ కాలేజ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం రూపంలో చాన్స్
- తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు విద్యార్థినుల ఎంపిక
- ఆర్థిక స్తోమతలేని ప్రతిభావంతులకు యూఎస్ ప్రభుత్వ వినూత్న పథకం

### కోర్సు ఎలా ఉంటుంది?

18 ఏళ్లుగా సీసీఐపీ ద్వారా పలువురు విద్యార్థులను అమెరికా తమ దేశంలో చదివిస్తోంది. కోర్సు 9–10 నెలల్లో పూర్తవుతుంది. ఈ సమయంలో భారత్ నుంచి వెళ్లిన విద్యార్థులందరినీ ఎంపిక చేసిన ప్రాంతాల్లో చదివిస్తారు. వారి అభిరుచిని బట్టి సైన్స్, ఐటీ, ఆర్ట్స్.. ఇలా విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించేలా వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని, మానసిక స్థైర్యాన్ని కూడా పెంచేలా శిక్షణ ఇస్తారు. దానికితోడు అక్కడి సాంస్కృతిక వైవిధ్యంపై పూర్తి అవగాహన వచ్చేలా.. అమెరికాలోని పలు ప్రాంతాల్లో పర్యటించేలా చూస్తారు. తద్వారా అక్కడి ఆచార వ్యవహారాలు తెలుసుకునే వీలు కలుగుతుంది. కోర్సు కోసం ప్రత్యేకమైన సిలబస్, ఇంటర్న్‌షిప్‌లో భాగంగా పలు అసైన్‌మెంట్లు కూడా ఉంటాయి. ఏడాది చివరిలో పరీక్షలు కూడా ఉంటాయి.



### ఎంపిక విధానం..

ఈ కోర్సు లక్ష్యం పూర్తిగా పేదరికంలో ఉన్న వారికి నాణ్యమైన, మెరుగైన విద్యను అందించడం. అందుకని ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఇందుకోసం కొందరు ఎన్జీవోల సాయం తీసుకుంటారు. తెలుగు రాష్ట్రాలనుంచి ఏటా 5 నుంచి 7 మంది ఎంపికవుతారు. ఇప్పటిదాకా 50 మంది తెలుగు విద్యార్థులు సీసీఐపీ ప్రోగ్రామ్‌లో భాగంగా అమెరికాలో విద్యనభ్యసించారు. ఈ విద్యా సంవత్సరానికి 60 దరఖాస్తులు రాగా ముగ్గురు మాత్రమే ఎంపికయ్యారు. అనేక రౌండ్ల వడపోత అనంతరం ఈసారి మేరిశ్రుతి, ఉదయభాను, సంతోషివాణి అనే ముగ్గురు విద్యార్థినులను ఎంపిక చేశారు. వీరంతా 21 ఏళ్లలోపు వారే కావడం విశేషం.

### సమాజసేవలో పాల్గొంటా



మా ఫాదర్ రైతు, తల్లి రిసెప్షనిస్టు. మాకు తెలిసిన ఎన్జీవో ద్వారా దరఖాస్తు చేసుకున్నా. సెలెక్టవుతాననుకోలేదు. నాకు సమాజసేవ అంటే ఆసక్తి. అమెరికాలో కోర్సు పూర్తయ్యాక, ఇండియాకు వచ్చి సమాజ సేవ చేస్తాను. **–మేరీ శ్రుతి, హైదరాబాద్**

### పరిశోధనలే నా ధ్యేయం



మా తల్లిదండ్రులది వ్యవసాయం. ప్రస్తుతం బీఎస్సీ మైక్రోబయాలజీ మొదటి సంవత్సరం పూర్తయింది. నాకు పరిశోధనలంటే ఆసక్తి. అక్కడ ఈ దిశగా పలు విషయాలు నేర్చుకుంటా. ఇండియాకి వచ్చాక నా పరిశోధనలు కొనసాగిస్తా

**– ఉదయభాను, నల్లగొండ**

### ఐటీలో కొత్త ఆవిష్కరణలు..



ప్రస్తుతం బీఎస్సీ ఫస్టియర్ చదువుతున్నాను. మా తండ్రి ఇటీవల మరణించారు. ఈ కోర్సుకు సెలెక్ట్ అవడం నా అదృష్టం. యూఎస్‌లో ఐటీ కోర్సు చేస్తాను. నాతో జీఎంఆర్ ఫౌండేషన్ సీసీఐపీకి దరఖాస్తు చేయించారు. ఐటీలో కొత్త ఆవిష్కరణలు నా ధ్యేయం.

**–సంతోషి వాణి, పాలకొండ, శ్రీకాకుళం**

## నేడు, రేపు మోస్తరు వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో నేడు, రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తమిళనాడు, దాని పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని పేర్కొంది. ఇప్పటికే రాష్ట్రంలోని నవీపేట్‌లో 4 సెం.మీ, రెంజల్ 3 సెం.మీ, తాండూర్ 2 సెం.మీ, నిజామాబాద్ 2 సెం.మీ, ఎడపల్లి 2 సెం.మీ, బజార్‌హత్నూర్ 2 సెం.మీ, తాడ్వాయి 1 సెం.మీ, కామారెడ్డి 1 సెం.మీ, కాగజ్‌నగర్ 1 సెం.మీ, దహేగావ్ 1 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

## 'పీఆర్సీ, ఫిట్‌మెంట్ వెంటనే ప్రకటించాలి'

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ, ఫిట్‌మెంట్ వెంటనే ప్రకటించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లో టీటీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, ఏరుకొండ నర్సింహస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఆర్సీ కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 61 సంవత్సరాలకు పెంచే ఉత్తర్వులు సైతం జారీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను గురుకుల పాఠశాలలుగా మార్చి విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయాలని కోరారు.

## జర్నలిస్టుల హక్కులకు భంగం: ఐజేయూ

**సాక్షి, హైదరాబాద్:** సమాచారాన్ని పొందే విషయంలో జర్నలిస్టులు, ప్రజల హక్కులకు భంగం కలిగించే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు, ప్రెస్ కౌన్సిల్ సభ్యుడు దేవులపల్లి అమర్, సెక్రటరీ జనరల్ సబీనా ఇంద్రజిత్ ధ్వజమెత్తారు. కేంద్ర శాఖల ఆవరణలోకి అడుగుపెట్టేందుకు జర్నలిస్టులు అనుమతి తీసుకోవాలన్న నిబంధనలు స్వేచ్ఛాయుత ప్రెస్‌కు అవరోధంగా ఉన్నాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జర్నలిస్టుల కదలికలపై విధించిన ఆంక్షలను ఆర్థిక శాఖ వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడే విషయంలో ప్రభుత్వం తన నిబద్ధతను చాటాలని సూచించారు.



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

# తిరుమలలో రాష్ట్రపతి

- నేడు శ్రీవారిని దర్శించుకోనున్న రామ్‌నాథ్ కోవింద్
- రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్రపతికి గవర్నర్, ఏపీ సీఎం జగన్ సాదర స్వాగతం

**తిరుమల/రేణిగుంట(చిత్తూరు జిల్లా)/సాక్షి, అమరావతి:** రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శనివారం రాత్రి తిరుమల చేరుకున్నారు. సతీమణి సవితా కోవింద్‌తో కలసి తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి ధర్మారెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. శనివారం రాత్రికి రాష్ట్రపతి తిరుమలలోనే బస చేశారు. ఆదివారం ఉదయం వరాహస్వామి దర్శనానంతరం శ్రీవేంకటేశ్వర స్వామివారిని రాష్ట్రపతి దంపతులు దర్శించుకోనున్నారు. శ్రీవారి దర్శనానంతరం రాష్ట్రపతి పద్మావతి అతిథిగృహానికి చేరుకుని అల్పాహారం స్వీకరించాక తిరుగు ప్రయాణమవుతారు. అంతకుముందు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి శనివారం సాయంత్రం 5.10 గంటలకు చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. ఆయనకు రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణ్యం, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సాదర స్వాగతం పలికారు.

# నగిషీలతో కుస్తీ!

**చార్మినార్‌లో పెచ్చులూడి పడిన చోట మరమ్మతు సంక్లిష్టం**

- తమిళనాడు స్థపతులతో పనులు
- 30 రోజులు గడిచినా పూర్తి కాని తీరు
- మరో పది రోజులు పట్టే అవకాశం



వర్షానికి కూలిన మినార్‌లోని నగిషీ



దెబ్బతిన్న భాగాన్ని మరమ్మతులు చేసిన నిపుణులు

**సాక్షి, హైదరాబాద్:** అది కేవలం రెండు మీటర్ల పొడవు.. 90 సెంటీమీటర్ల వెడల్పున్న భాగం.. అంతమేర డంగు సున్నంతో మరమ్మతు చేసేందుకు ఐదుగురు నిపుణులతో కూడిన సిబ్బంది 30 రోజులుగా కుస్తీ పడుతున్నారు.. కానీ పని పూర్తి చేయలేకపోయారు. మరో పది రోజుల పాటు ఎలాగోలా కుస్తీపట్టి దాన్ని పూర్తి చేసి 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకోనున్నారు. ఇది 428 ఏళ్ల వయసున్న చార్మినార్ కట్టడానికి చిన్న మరమ్మతు విషయంలో జరుగుతున్న వ్యవహారం. గత మే 1న అర్ధరాత్రి భారీ వర్షానికి కట్టడం నైరుతి వైపున్న మినార్‌లో రెండు మీటర్ల పొడవున్న భారీ పెచ్చులు ఊడి పడిన విషయం తెలిసిందే. కట్టడానికి అతి చేరువ నుంచి భారీ వాహనాలు దశాబ్దాలుగా తిరగటం, చార్మినార్ పాదచారుల ప్రాజెక్టుకు సంబంధించి భారీ యంత్రాలతో కట్టడం చేరువలో పనులు చేపట్టడం వల్ల ఏర్పడ్డ ప్రకంపనాల వల్లనే వానలకు పెచ్చులూడి పడినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినా.. వాస్తవాలు వెలికితీసేందుకు ఇప్పటికే పలుమార్లు కేంద్ర పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) నిపుణులు దాన్ని పరిశీలించి వెళ్లారు. ఇంకా నివేదిక అందలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. కూలిన ప్రాంతానికి ఏఎస్ఐ ఆధ్వర్యంలో మరమ్మతు ప్రారంభించారు.

### స్థపతుల ఆధ్వర్యంలో..

భారీ పెచ్చులూడి పడిన ప్రాంతంలో మంచి నగిషీలున్నాయి. పునర్నిర్మాణంలో ఆ నగిషీలన్నింటిని తిరిగి చెక్కాల్సి ఉంది. ఇక్కడే సమస్య వచ్చి పడింది. చార్మినార్ పూర్తిగా డంగు సున్నంతో నిర్మించిన కట్టడం. సున్నం, రాతి పొడి, గుడ్డు సొన, నల్ల బెల్లం, కరక్కాయ.. ఇలాంటి వాటిని రంగరించి రూపొందించిన మిశ్రమంతో ప్లాస్టరింగ్ చేశారు. ఇప్పటి నిపుణులకు సిమెంటుతో నగిషీలు దిద్దటం తెలుసు కానీ ఈ మిశ్రమంతో నగిషీలు దిద్దటం అంత సులువు కాదు. అందుకే తమిళనాడు రాష్ట్రానికి చెందిన కొందరు నిపుణులైన స్థపతులను ఈ పనికి ఏఎస్ఐ రంగంలోకి దించింది. ఇలాంటి పనుల్లో సిద్ధహస్తులైన ముగ్గురు స్థపతులు, వారికి మరో ఇద్దరు సహాయకులు కలిసి ఈ పని చేపడుతున్నారు. దాదాపు నెల రోజుల క్రితం మొదలుపెట్టినా ఇప్పటివరకు దాన్ని పూర్తి చేయలేకపోయారు. తీర్చి దిద్దాల్సిన నగిషీలు సంక్లిష్టమైనవి కావటంతో చాలా జాగ్రత్తగా పనిచేయాల్సి వస్తోంది. దీంతో చాలా సమయం పడుతోంది. పని చేసినంత మేర మిశ్రమం ఆరిన తర్వాతనే మరిన్ని నగిషీలు అద్దాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో అసలు నగిషీలంత మెరుగ్గా అవి రాకపోవటంతో మళ్లీ మళ్లీ చేయాల్సి వస్తోంది. ఫలితంగా రెండు మీటర్ల భాగాన్ని 30 రోజులు గడిచినా పూర్తి చేయలేకపోయారు. ప్రస్తుతం అవి తుది దశకు చేరుకున్నాయి. మరో పది రోజుల్లో పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలు కూడా పనికి అడ్డుగా మారాయి. పని జరుగుతున్న చోట నీళ్లు చేరి నగిషీలు దెబ్బతింటుండటంతో మళ్లీ చేయాల్సి వస్తోంది. అక్కడికీ.. ఆ భాగంపై నేరుగా వాన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

### మరిన్ని పెచ్చులూడే పరిస్థితి..

గత మే నెలలో భారీ పెచ్చులు ఊడిపడ్డ తరహాలో మరిన్ని చోట్ల ఊడిపడే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. 428 ఏళ్ల క్రితం చార్మినార్ నిర్మించినప్పటి ప్లాస్టరింగ్ ప్రస్తుతం లేదు. వివిధ సందర్భాల్లో పాతది తొలగించి కొత్త ప్లాస్టరింగ్ చేసినట్టు ఏఎస్ఐ అధికారులు గుర్తించారు. చివరిసారిగా 1924లో ఏడో నిజాం హయాంలో రీప్లాస్టరింగ్ జరిగింది. కొన్ని సందర్భాల్లో ఆ పూత అంత నాణ్యంగా జరగలేదనీ తేలింది. అలాంటి వాటికి సులభంగా పగుళ్లు ఏర్పడ్డాయి. ఆ సందుల్లోంచి వాన నీళ్లు చేరి పటుత్వం కోల్పోతున్నాయి. అలా చాలా చోట్ల సన్నటి పగుళ్లున్నాయి. భారీ వర్షాలకు అవి ఊడిపడే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వాయవ్య మినార్ నుంచి ఇలాంటి పెద్దపెద్ద పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ తర్వాత పోలీసు స్టేషన్ వైపు భాగంలో కూడా ఊడిపడ్డాయి. ఇక చిన్నచిన్న ముక్కలు చాలా మార్లు పడ్డాయి. చాలా ప్రాంతాల్లో పైపూత బలహీనపడిందని తాజాగా గుర్తించారు. ఇక ఊడిపోయినప్పుడల్లా పునరుద్ధరించటం తప్ప ఇప్పటికిప్పుడు చేసేదేమీ లేదని ఓ ఉన్నతాధికారి పేర్కొనడం విశేషం.


















# 'సింగరేణి' పెన్షన్ రూ.350 మాత్రమే!

- పలువురు రిటైర్డు కార్మికుల ఆవేదన
- 14,857 వేలమందికి కేవలం రూ.వెయ్యిలోపే..
- పెన్షన్ పెంపునకు సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి

**సాక్షి, హైదరాబాద్:** బొగ్గు గనుల్లో ఏళ్లకొద్దీ మగ్గి రిటైరైన పలువురు సింగరేణి కార్మికుల పెన్షన్ ఎంతో తెలుసా? నెలకు రూ.350 మాత్రమే! 14.857 మందికి రూ.వెయ్యిలోపు పెన్షన్ మాత్రమే అందుతోంది. రిటైరైన తర్వాత నెలకు కనీసం రూ.1,000 పెన్షన్ కూడా రావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోల్‌మైన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శి కేఆర్‌సీ రెడ్డి, ఎం.బాబురావు నేతృత్వంలో సింగరేణి రిటైర్డు ఉద్యోగుల బృందం శనివారం ఇక్కడ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలసి గోడును వెల్లబోసుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన బొగ్గు గనుల్లో దినదిన గండంగా ముప్పై, నలభై ఏళ్లు పనిచేసి రిటైరైన వారిలో కొందరికి నెలకు రూ.350, మరికొందరికి అంతకన్నా తక్కువ పెన్షన్ వస్తోందని కేంద్రమంత్రికి విన్నవించుకున్నారు.

### 20 ఏళ్లుగా పునఃసమీక్షలేదు...

60 వేల మంది రిటైర్డు సింగరేణి ఉద్యోగుల్లో 25 శాతం మంది నెలకు రూ.1,000 లోపు పెన్షన్ అందుకుంటున్నారని అసోసియేషన్ నాయకులు చెప్పారు. మిగిలిన 75 శాతం మందికి రూ.5,000 లోపు పెన్షన్ మాత్రమే లభిస్తోందన్నారు. సింగరేణితోపాటు దేశంలోని ఇతర గనుల సంస్థల కార్మికుల పదవీ విరమణ సమయంలో ఖరారు చేస్తున్న పెన్షన్ మొత్తాలు ఆ తర్వాతి కాలంలో ఎలాంటి పెరుగుదల లేకుండా అలానే ఉండిపోతున్నాయన్నారు. ప్రతి మూడేళ్లకోసారి పెన్షన్లను పునఃసమీక్షించాలని నిబంధనలున్నా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ బోర్డు ట్రస్టీల నిర్లక్ష్యం వల్ల 20 ఏళ్లుగా పునఃసమీక్ష నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని బొగ్గు గనుల సంస్థల్లో 9 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారని, వారందరూ ఇలాంటి దుస్థితినే ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ విషయంలో కేంద్రం ఓ నిర్ణయం తీసుకునే వరకు, రూ.6 వేల లోపు పెన్షన్ అందుకుంటున్న పెన్షనర్లందరికీ నెలకు కనీసం రూ.8 వేల గౌరవ పెన్షన్ మంజూరు చేయించేందుకు కృషి చేయాలని కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సింగరేణి రిటైర్డు కార్మికులు పెన్షన్లకు సంబంధించిన దుస్థితిని తెలిపే అధికారిక గణాంకాలను యూనియన్ నాయకులు ఈ సందర్భంగా కిషన్‌రెడ్డికి అందించారు.

| పెన్షన్ మొత్తం (రూ.ల్లో) | పెన్షనర్ల సంఖ్య |
|---|---|
| 1,000 లోపు | 14,857 |
| 1,001-3,000 | 24,844 |
| 3,001-5,000 | 5,797 |
| 5,001-10,000 | 9,552 |
| 10,001-15,000 | 385 |
| 20,000+ | 347 |
| మొత్తం | 60,707 |







Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792